అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 21-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 01 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



మాట్లాడుతున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య

మిగులు భూమి

లెక్క తేల్చాలి..

ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్, పోడు భూములు పేదలకు పంచాలి

- జీవో నెంబర్ 58 ప్రకారం 120 గజాల ఇంటి స్థలం కేటాయించాలి
- సర్కార్ భూముల్లో గుడిసెలేసుకున్న వారికి పట్టాలివ్వాలి
- పోరాటంలో పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి
- భూ చట్టంలో ఉన్న లొసుగులను సవరించాలి :

తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక భూ సదస్సు డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర భూ సర్వే జరిపి ప్రభుత్వ సీలింగ్, అసైన్డ్, పోడు భూములను అర్హులైన పేదలకు పంచాలని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో నిర్వహించిన భూ సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో పేదలకు ఇండ్ల స్థలాలు, సాగు భూమి పంచాలని పలు తీర్మానాలను ఐక్యవేదిక కన్వీనర్ ఎస్. వీరయ్య ప్రవేశ పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాల్లో 69 భూ పోరాట కేంద్రాల్లో పేదలు గుడిసెలేసుకొని మూడేండ్ల నుంచి నివాసముంటున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు భూ కేంద్రాల్లోని గుడిసెలను తొలగించి, పోరాటంలో పాల్గొన్న వారిపై అక్రమ కేసులను బనాయించి జైలుకు పంపించిందని విమర్శించారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పలు చోట్ల గుడిసెలను తొలగించి దాడులకు పాల్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారెంటీల్లో ప్రధాన గ్యారంటీగా ఉన్న ఇండ్ల స్థలాల కోసం మాత్రమే తాము పోరాడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మూడు సార్లు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రెండు సార్లు కలిసి విన్నవించిన సందర్భంలో సానుకూలంగా ఉన్నామని ప్రకటించినా, ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని చెప్పారు. మహబూబాబాద్ భూ పోరాట కేంద్రంలో గుడిసెలను గత ప్రభుత్వం 18 సార్లు తొలగించిందనీ, కాంగ్రెస్ సర్కార్ 19వ సారి గుడిసెలను నేలమట్టం చేసి అక్రమ కేసులు బనాయించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను రేవంత్ ప్రభుత్వం భవిష్యత్‌లో చేయదని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల స్థలాలు, సాగు భూములను రేవంత్ సర్కార్ అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య మాట్లాడుతూ 11.5 లక్షల ఎకరాల అటవీ భూములను గుర్తించిన గత ప్రభుత్వం కేవలం 4.2 లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చిందని తెలిపారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా అటవీ భూములకు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర భూసర్వే నిర్వహించి, మిగులు భూమిని పేదలకు భూములు పంచాలనీ, ఇండ్ల నిర్మాణానికి రాష్ట్రం రూ.5లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు మొత్తం రూ.15 లక్షలివ్వాలివ్వాలనీ, డంపింగ్ యార్డులు,

...3లో

2018 పరువునష్టం కేసులో... రాహుల్‌కు బెయిల్



వివరాలు 11లో

ఉచిత రేషన్ బస్తాపై మోడీ చిత్రం !

- రాజస్థాన్‌లోనే 13 కోట్ల ఖర్చు



వివరాలు 11లో

ఏడాదికి రెండుసార్లు

- 10, 12 తరగతుల బోర్డు ఎగ్జామ్స్‌పై కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం
- ఈ ఆప్షన్ 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



వివరాలు 11లో

నేడు ఎప్‌సెట్ నోటిఫికేషన్

- 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎప్‌సెట్ కన్వీనర్ వెల్లడి

వివరాలు 10లో

ఆర్ఆర్ఆర్‌కు పచ్చజెండా..

భూసేకరణ, విధాన ప్రక్రియలు వేగవంతం

- యుటిలిటీస్ తరలింపు భారం భరిస్తామన్న కేంద్ర మంత్రి
- హైదరాబాద్-విజయవాడ ఆరు లైన్లు, హైదరాబాద్-కల్వకుర్తి నాలుగు లైన్లకు అనుమతికై రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల భేటీ



నితిన్ గడ్కరీతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి, కోమటిరెడ్డి..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం(చౌటుప్పల్-ఆమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి- 182 కిలోమీటర్లు) జాతీయ రహదారికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని ఇప్పటికే జాతీయ రహదారిగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రహదారులు, ఫ్లై ఓవర్‌లు, రీజనల్ రింగ్ రోడ్డుతో సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులపై గడ్కరీతో సీఎం చర్చించారు. ఆ మేరకు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు కేంద్ర మంత్రి అంగీకరించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు కోరాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను గడ్కరీ ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ అంశంతో పాటు తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు అనుమతి, పలు ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జాతీయ

...11లో

జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి కోరిన రహదారుల వివరాలు

- మరికల్-నారాయణపేట్-రామసముద్ర-63 కి.మీ
- పెద్దపల్లి-కాటారం-66 కి మీ
- పుల్లూర్-అలంపూర్-జటప్రోలు-పెంట్లవెల్లి-కొల్లాపూర్-లింగాల్-అచ్చంపేట-డిండి-దేవరకొండ-మల్లేపల్లి-నల్గొండ-225 కి.మీ
- వనపర్తి-కొత్తకోట-గద్వాల-మంత్రాలయం-110 కి మీ
- మన్నెగూడ-వికారాబాద్-తాండూర్-జహీరాబాద్-బీదర్-134 కి మీ
- కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి-పిట్లం-16 కిమీ
- కరీంనగర్-రాయపట్నం-60 కిమీ
- ఎర్రవెల్లి క్రాస్ రోడ్-గద్వాల-రాయచూర్-67 కి మీ
- జగిత్యాల-పెద్దపల్లి-కాల్వ శ్రీరాంపూర్-కిష్టంపేట-కల్వపల్లి-మోరంచపల్లి-రామప్ప దేవాలయం-జంగాలపల్లి-164 కి మీ
- సారపాక-ఏటూరునాగారం-93 కి మీ
- దుద్దెడ-కొమురవెల్లి-యాదగిరిగుట్ట-రాయగిరి క్రాస్‌రోడ్-63 కిమీ
- జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం-100 కిమీ
- సిరిసిల్ల-వేములవాడ-కోరుట్ల-65 కిమీ
- భూతప్పూర్-నాగర్‌కర్నూల్-మన్ననూర్-మద్దిమడుగు (తెలంగాణ)-గంగలకుంట-సిరిగిరిపాడు-166 కిమీ

రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవం

రేణుకా, అనిల్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర ఎన్నిక



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యసభ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో ఖాళీఅయిన మూడు స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఎమ్మెల్యేల బలాబలాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు రెండు, బీఆర్ఎస్‌కు ఒక స్థానం గెలిచే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, స్వతంత్ర అభ్యర్థిగా

...11లో



రాజ్యసభకు సోనియా ఎన్నిక

వివరాలు 11లో

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

ఈసీ కసరత్తు పూర్తి

- లోక్‌సభతో పాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు
- 2019లో మార్చి 10న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సీఈసీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కార్యాచరణకు సమాయత్తమైంది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు తెలుస్తున్నది. ఎన్నికల సంఘం వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగించే అవకాశముందని విశ్వసనీయ వర్గాల సమాచారం. మార్చి 9 తర్వాత లోక్‌సభ ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించే అవకాశముందని జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. కాగా, పార్లమెంట్ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల

...11లో



కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం

కాలిబూడిదైన 50 పేదల గుడిసెలు

- మంటల ధాటికి పేలిన ఐదు గ్యాస్ సిలిండర్లు
- భయంతో పరుగులు తీసిన జనం
- గుడిసెవాసులంతా మేడారం వెళ్లడంతో తప్పిన ప్రాణనష్టం
- కనీస ఆనవాళ్లు లేకుండా బూడిదైన పేదలగూళ్లు
- కుటుంబానికి రూ.లక్ష సాయం, పక్కా ఇల్లు నిర్మించాలని ఎమ్మెల్యే గంగుల డిమాండ్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/కరీంనగర్ క్రైం

కరీం'నగరం' నడిబొడ్డున మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సుభాష్‌నగర్ నుంచి ఆదర్శనగర్‌కు వెళ్లే దారిలోని గుడిసెలకు మంటలు అంటుకోవడంతో.. అందులోని ఐదు వంటగ్యాస్ సిలిండర్లు భారీ శబ్దాలతో పేలుడు సంభవించి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. భయంతో చుట్టుపక్కవాళ్లు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలకుపైగా శ్రమించి మంటలు ఆర్పారు. ఆ గుడిసెవాసులంతా మేడారం జాతరకు వెళ్లడంతో పెనుప్రమాదం తప్పినా.. అప్పటికే ఆనవాళ్లు లేకుండా


...11లో

నేటి నుంచి మేడారం మహాజాతర

వెలసిన గుడారాలు.. బయలెల్లిన పగిడిద్దరాజు

- నేడు కన్నెపల్లి నుంచి రానున్న సారలమ్మ
- రేపు చిలకలగుట్ట నుంచి సమ్మక్క
- జాతరకు రూ.105 కోట్లతో ఏర్పాట్లు
- 12 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు

మేడారం నుంచి నవతెలంగాణ ప్రాంతీయ ప్రతినిధి బి.దయాసాగర్



మేడారం సమ్మక్క, సారక్కల మహా జాతర బుధవారం ప్రారంభం కానుంది. ఈనెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగే ఈ జాతరకు లక్షలాది మంది సందర్శకులు తరలిరానున్నారు. ఇప్పటికే చాలా మంది తమ మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల గ్రామం నుంచి సమ్మక్క భర్త పడగ రూపంలోనున్న పగిడిద్దరాజు, కన్నాయిగూడెం మండలంలోని కొండాయి నుంచి గోవిందరాజులును, తాడ్వాయి మండలం కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొని బుధవారం మేడారంలోని గద్దెలపై ప్రతిష్ఠించనున్నారు. గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొని వచ్చి గద్దెలపై ఉంచనున్నారు. అధికారిక లాంఛనాలతో ఉద్విగ్న వాతావరణంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. లక్షలాది మంది ప్రజల నడుమ యాటలు, కోళ్ల బలులతో సమ్మక్కను తీసుకువచ్చే రహదారిపై రక్తతర్పణం చేస్తారు. శివసత్తులు, కొమ్ము వాయిద్యాలు, ఆదివాసీ యువతీయువకుల సంప్రదాయ నృత్యాల నడుమ భారీ పోలీసు బందోబస్తుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కాగా, జాతరకు ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ 6 వేల బస్సులను ఏర్పాటు చేసింది.

పడగ రూపంలో బయలెల్లిన పగిడిద్దరాజు

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామం నుంచి సమ్మక్క భర్త పగిడిగిద్దరాజుకు పెనుక వంశానికి చెందిన ప్రధాన పూజారి పెనుక రాజేశ్వర్ తదితరులు

...3లో

అన్ని ఏర్పాట్లు పూర్తి

- రద్దీకనుగుణంగా సౌకర్యాల పెంపు
- పెరుగుతున్న భక్తుల తాకిడి
- సమాచారం పౌరసంబంధాల శాఖ కమీషనర్ వెల్లడి

వివరాలు 2లో

బీజేపీకి షాక్

ఆప్ అభ్యర్థి విజేత

- చండీగఢ్ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు



ఆప్ మేయర్ అభ్యర్థి కుల్దీప్ కుమార్, కార్యకర్తల సంబురాలు

న్యూఢిల్లీ : వివాదానికి కేంద్ర బిందువుగా మారిన చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆప్ అభ్యర్థిని విజేతగా ప్రకటించింది. దీంతో ఆప్‌కు భారీ విజయం సొంతమైంది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి ఎనిమిది బ్యాలెట్ ఓట్లను చెల్లుబాటు చేయకపోవటంతో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన విషయం విదితమే.

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న ఆప్ మేయర్ అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఎన్నికలో విజేతగా తేలారు. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ ద్వారా చెల్లుబాటు కాని ఎనిమిది బ్యాలెట్లు చెల్లుబాటు అయ్యేవనీ, అవి ఆప్ మేయర్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌కు అనుకూలంగా ఉన్నాయని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. పిటిషనర్‌కు అనుకూలంగా పోలైన ఎనిమిది ఓట్లను పాడు చేసేందుకు అనిల్ మసీహ్ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారని ధర్మాసనం వెల్లడించింది. ప్రజాస్వామ్య సూత్రాలను పరిరక్షించడం న్యాయస్థానం విధి అని ధర్మాసనం తెలిపింది. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్‌పై కూడా కోర్టు ధిక్కారం కింద నోటీసులు జారీ అయ్యాయి. చండీగఢ్ మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, వీడియోను సమర్పించాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది.

జనవరి 30న జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేసి, మూడు పదవులను నిలబెట్టుకుని, కాంగ్రెస్-ఆప్ కూటమిని ఓడించింది. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ అవకతవకలు చేశారని ఆరోపిస్తూ, తాజా ఎన్నికలను కోరుతూ ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇందులో సర్వోన్నత న్యాయస్థానం ఆప్‌కు అనుకూలంగా తీర్పును వెలువరించింది.

పదవి అయిపాయే..బిల్లులు రాకపాయే



అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్న వైనం

- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో మాజీ సర్పంచులు
- రేపు చలో హైదరాబాద్

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

సర్పంచుల ఐదేండ్ల పదవీ కాలం అయిపోయింది. వారి స్థానంలో గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్నది. ఐదేండ్ల కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులపై వడ్డీల మీద వడ్డీల భారం పెరుగుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం ఎలాగూ సర్పంచులకు బిల్లులను సకాలంలో చెల్లించలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలని మాజీ సర్పంచులు వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు.

మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తమ పంచాయతీకే అవార్డులు రావాలని పోటీపడి సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయనే ఆశతో దొరికినకాడల్లా అప్పులు తెచ్చిమరీ ముందుకెళ్లారు. డంపింగ్‌యార్డులు, పల్లెప్రకృతివనాలు, రైతువేదికలు, వైకుంఠదామాలు, సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణాల విషయంలో సర్పంచులతో గత ప్రభుత్వం ఉరుకులు పరుగులు పెట్టించి మరీ పనిచేయించింది. కానీ, బిల్లుల విడుదల విషయంలో తీవ్ర జాప్యం చేసింది. జీపీలకు 17 నెలల నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు అందలేదు. ఒక్కో సర్పంచికి తక్కువలో తక్కువ రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షలకుపైగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. అభివృద్ధి పనులకు సంబంధించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెగ్యులర్ నిధుల విడుదల జాప్యం నెలకొంది. దీంతో వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ బిల్లులు లేని మాజీ సర్పంచులే లేరు. వడ్డీలతో అప్పులు కొండంత పెరిగి వారికి తలనొప్పిగా మారాయి. సర్పంచి పదవిలో ఉన్నంత కాలం అప్పు ఇచ్చిన వాళ్లు గ్రామపెద్ద అనే గౌరవంతో పెద్దగా ఎవ్వరూ అడగలేదు. ఇప్పుడు పదవి అయిపోయిన తర్వాత అప్పులోళ్లు కోడికూయకముందే ఇండ్ల ముందు వచ్చి మాజీ సర్పంచుల ఇండ్ల ముందు తిష్టవేస్తున్న పరిస్థితి. రిజర్వేషన్ ద్వారా ఏదో అవకాశం వచ్చిందికదా ఊర్లో నాలుగు మంచి పనులు చేద్దామనే యావతో ముందుకెళ్లిన సర్పంచులంతా ఇప్పుడు అప్పుల కొలిమిలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. అప్పులోళ్ల పోరు భరించలేక, ఊర్లో తమ మొహం చూపించలేక లోలోపల కుమిలిపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులకు తీరని అన్యాయం చేసిందనీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బిల్లులను చెల్లించి న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీనిచ్చింది. ఈ నేపథ్యంలోనే మాజీ సర్పంచులు తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

22న చలో హైదరాబాద్



గత బీఆర్ఎస్ ప్రభుత్వమూ సర్పంచుల బిల్లులను ఇవ్వకుండా తొక్కిపెట్టింది. చేసిన పనులకు సంబంధించి నాకు రూ.35 లక్షలకుపైగా బిల్లులు రావాలి. కాంగ్రెస్ ప్రభుత్వమూ ఇవ్వడం లేదు. గ్రామ ప్రథమ పౌరులు అప్పుల బాధలతో ఇబ్బందులు పడుతుంటే ఒక్క ఎమ్మెల్యే కూడా అసెంబ్లీలో మాట్లాడకపోవడం బాధాకరం. అందుకే నిధుల కోసం ఈ నెల 22న వందలాది మంది మాజీ సర్పంచులు గన్‌పార్కు వద్దకు చేరుకుని నిరసన తెలుపుతారు. రాజకీయాలకు అతీతంగా మాజీ సర్పంచులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి. రేపోమాపో ఎలక్షన్ కోడ్ వస్తే మళ్లీ రెండు మూడు నెలలు పెండింగ్‌లో పెట్టే అవకాశముంది. దయచేసి ఎన్నికల కోడ్ రాకముందు బిల్లులిస్తే ప్రభుత్వానికి అండగా ఉంటాం. దేవుళ్లుగా భావించి సపోర్టుగా నిలుస్తాం. లేకుంటే నేతలను ఊర్లల్లో అడుగుపెట్టనివ్వం.

- సుర్వి యాదయ్య గౌడ్,
మాజీ సర్పంచి (అల్లం దేవి చెరువు, యాదాద్రి భువనగిరి జిల్లా)

డీహెచ్‌పై నిరాధార ఆరోపణలకు మెడికల్ జేఏసి ఖండన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్‌పై చేస్తున్న ఆరోపణలు నిరాధారమంటూ మెడికల్ జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు అధికారులు తప్పుడు ఆడియోలు సృష్టించి దాన్ని మీడియాలో వచ్చేలా చేసి డీహెచ్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏ స్థాయిలో ఉన్నా... సహించేది లేదని అదే సందర్భంలో నిజాయితీగా ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులను ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్న అధికారులు వెంటనే తమ పద్ధతిని మానుకోవాలనీ, లేనియెడల వారు తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీనియార్టీలో ముందున్న ఒక గిరిజన అధికారికి అవకాశం కల్పించడంతో కొందరు అధికారులు జీర్ణించుకోలేక ఆయనపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు బి. వెంకటేశ్వర్ రెడ్డి, యాద నాయక్, నెహ్రూ నాయక్, సుజాత రాథోడ్, రాబర్ట్ బ్రూస్, రామలక్ష్మి, సాయి రెడ్డి, వేణుగోపాల్ గౌడ్, కిరణ్ రెడ్డి, సకల రెడ్డి, జ్ఞానేశ్వర్, బీసీ శ్రీనివాస్ కలీముద్దీన్, పాండు నాయక్, తిరుపతి నాయక్, రాజశేఖర్, శిరీష, జమాలుద్దీన్, దేవ్ సింగ్, అనిల్ కుమార్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలి

- బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మానసిక వికలాంగులకు బోధిస్తున్న ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)లను రెగ్యులరైజ్ చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. వీరు గత 20 ఏండ్లుగా రాష్ట్రంలోని మానసిక వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు విద్యను అందిస్తూ సేవలందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయనీ, అందుకు అవసరమైన పోస్టులను రెగ్యులర్ డీఎస్సీలో పొందుపర్చకుండా ఇతర ప్రక్రియ ప్రారంభమైందని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయాలని చూస్తున్న తరుణంలో వీరిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రాష్ట్రంలో 70 వేల మంది ఇలాంటి విద్యార్థులుండగా, వారికి బోధించేందుకు 1,523 మంది ఐఈఆర్పీలు అవసరమని తెలిపారు. ఇప్పటికే బోధిస్తున్న 996 మందిని రెగ్యులర్ చేసి, మిగిలిన పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయాలని సూచించారు. కాంట్రాక్టు విధానంలో పనిచేసిన జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్‌లను రెగ్యులరైజ్ చేసినందున వీరిని కూడా రెగ్యులరైజ్ చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకపోవచ్చన్నారు. ప్రభుత్వంలో ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి లేనందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను గిరిజన సాంప్రదాయాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు జరగొద్దనే సంకల్పంతో ముఖ్య మంత్రి రూ. 105 కోట్ల నిధులను మంజూరు చేశారు. తెలంగాణలో మహా కుంభమేళగా ప్రసిద్ధి గాంచిన అతి పెద్ద ఈ గిరిజన జాతర రెండేండ్లకొకసారి మాఘ మాసంలో నాలుగు రోజుల పాటు జరుగుతుంది. ఈ జాతరకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి సైతం భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారు. ప్రతి ఏడాది వారి తాకిడి పెరుగుతూనే వుంది. ఇప్పటికే 58 లక్షలకు పైగా భక్తులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక ఏర్పాట్లతో పాటు ఈ ఏడాది శాశ్వత ఏర్పాట్ల పైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే భక్తులకు వివిధ శాఖల ద్వారా నివాసానికి ఉన్న షెడ్లతో పాటు అదనంగా మరికొన్ని నిర్మాణాలను పూర్తి చేశారు. వరంగల్ నుంచి మేడారం మార్గంలో రూ. 1.65 కోట్ల చొప్పున మూడు షెడ్లను నిర్మించారు. వన దేవతలు గద్దెలకు చేరటానికి ముందు రోజు నుంచి తిరిగి వనంలోకి వెళ్లేవరకు భక్తులు నాలుగు రోజుల పాటు గుడారాలు వేసుకొని అమ్మవార్ల సన్నిధిలో ఉండడం ఆనవాయితీ. ఈ మేరకు గుడారాలతో భక్తులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రంగం ముందుచూపుతో ఏర్పాట్లు చేసింది.

జాతర నిర్వహణకు. త్రాగు నీరు, మరుగుదొడ్లు, అదనపు స్నాన ఘట్టాలు, బ్యాటరీ ట్యాప్స్, అంతర్గత రోడ్లు, వైద్యం, వసతి, పారిశుద్యం, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల అభివృద్ధి , క్యూలైన్, తదితర ఏర్పాట్లను పూర్తి చేసింది. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అనేక మార్లు పర్యటించింది. గత జాతర అనుభవాలను పరిగణనలోకి తీసుకొని లోపాలను సరిదిద్దింది. ఏర్పాట్లను విస్తృత పరిచింది. భక్తులకు ఇబ్బందుల్లేని దర్శనమే లక్ష్యంగా జిల్లా, రాష్ట్ర యత్రంగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. జాతరకు ముందు ఏర్పాట్లను పంచయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఉన్నతాధికారులు కూడా పలుమార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా మేడారంలో పర్యటించి పనులను పరిశీలించారు. మొత్తంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనులు పూర్తి చేశాయి. రవాణా వ్యవస్థను నియంత్రించేందుకు వాహనాల పార్కింగ్ స్థలాలను గద్దెలకు దూరంగా ఏర్పాటు చేయడం, రోడ్ల వెడల్పు, నూతన రోడ్లు, మరమ్మత్తులు చేసి ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

నిరంతర నిఘా : జాతర జరిగే అన్ని ప్రాంతాల్లో 300 ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ కోసం 300సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి సెంట్రల్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించేందుకు ఆలయ పరిసర ప్రాంతాలను 10 జోన్లు, 38 సెక్టార్లు, 60 సబ్ సెక్టర్లుగా విభజించి సెక్టార్ల వారీగా అధికారులు సిబ్బందిని నియమించారు. సెక్టోరల్ అధికారులకు ఇచ్చిన వాకిటాకీ ద్వారా వివరాలు తెలుసుకుంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. దాదాపు 16 వేల మంది ఉద్యోగులు మేడారం విధుల్లో పాల్గొననున్నారు.

రవాణా శాఖ : భక్తుల రవాణాకు ఆర్టీసీ ఆరువేల బస్సులను ఏర్పాటు చేసింది. రవాణా సౌకర్యాలకోసం ప్రభుత్వంరూ.2.25 కోట్ల నిధులు మంజూరు చెసింది. తాత్కాలిక బస్ స్టాండ్‌తో పాటు, సీసీ కెమెరాలు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లైటింగ్, రైలింగ్, త్రాగు నీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేసి రవాణాకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టింది.

ఆర్‌డబ్ల్యుఎస్ : ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా రూ.13.50కోట్లతో పనులు చేపట్టారు. 17 ఇన్ ఫిల్టరేషన్ వెల్స్ , 495 ప్రాంతాల్లో ఐదువేల నల్లాలను ఎర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం కలగకుండా 40 జనరేటర్లు ఎర్పాటు చేశారు. 8,400 తాత్కాలిక మరుగుదొడ్లను 500 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఏడు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి, తాగునీరు అందిస్తున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు 300 మంది సిబ్బందిని నియమించారు.

పంచాయతీరాజ్ : జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తోన్న నేపథ్యంలో పారిశుద్యం ఇక్కడ పెద్ద సవాలుగా మారింది. దానిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం నాలుగు వేల మంది కార్మికులను ఏర్పాటు చెసింది. పారిశుధ్య నిర్వహణకు మేడారంకు ఆవల డంపింగ్ యార్డులు, జాతర పరిసర ప్రాంతాల్లో 300 మిని డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులతో గద్దెల వద్ద, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విదంగా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యుత్ శాఖ: జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరాకు రూ.3.97కోట్లతో పనులు చేపట్టారు. నూతనంగా 210 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

వైద్య శాఖ : భక్తుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. మేడారం కల్యాణ మండపంలో కోటి రూపాయలతో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి 25 మంది వైద్యులు, 120 మంది వైద్యాధికారులు, 857 పారా మెడికల్ సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. పరిసర గ్రామాల్లో 75 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచింది. క్యూ లైన్ల వద్ద మినీ క్యాంపులు ఏర్పాటు చేశారు. తాడ్వాయిలో 10 పడకలు, పస్రలో ఐదు పడకల ఆసుపత్రులతోపాటు 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. జాతరలో ప్రత్యేకంగా 30 మొబైల్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

పోలీస్ శాఖ : శాంతి భద్రతల పరిరక్షణకు, జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 12 వేల పోలీస్ సిబ్బందితో 300 సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో జాతర పరిసర ప్రాంతాల్లో 33 పార్కింగ్ స్థలాలను ఎర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నదని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమీషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు..

అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

మంత్రి తుమ్మల భరోసా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్నీ పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నాట్ల దశ నుంచి పంట అమ్ముకునే దాకా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మంత్రి ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకటి, రెండు పంటల కొనుగోళ్లు చేసి మిగతా పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. రాష్ట్రంలో 75 శాతం సాగుభూమి రెండు, మూడు పంటలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులో మార్పు రావాలని సూచించారు. రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు సీఐఐ కేంద్రాలను కొనసాగించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు మార్కెట్లకు పోటెత్తుతున్న మిర్చి పంట అమ్మకాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులుగానీ, ధర విషయంలో తేడాగానీ రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అమ్మకాలు ఎక్కువగా జరిగే మార్కెట్లకు పర్యవేక్షకులను నియమించి, ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొనే ఏర్పాట్లు చేయాలని సూచించారు. యాసంగిలో 3.91లక్షల ఎకరాల్లో మిర్చి సాగుచేయగా ఇప్పటికే 94395.08 మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చిందని తెలిపారు. రానున్న రోజుల్లో 337014 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. వేరుశనగ అమ్మకాల్లో రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సత్వరం పరిష్కరించి అమ్మకాలు సజావుగా సాగేటట్టు చూడాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానశాఖల నుంచి కూడా అధికారులను సంబంధిత జిల్లా అధికారులతో మిర్చి, వేరుశనగ అధికంగా పండించే జిల్లాలను సందర్శించి, రైతులందరికీ మార్కెట్లకు ఉత్పత్తులను తీసుకొచ్చే విషయములో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

సహజత్వానికి అద్దం కాంచనపల్లి కవిత్వం

- "పెంకుటిల్లు" పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ కాంచనపల్లి కవిత్వం సహజత్వానికి అద్దం పడుతోందని శాసనమండలి సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన రచించిన పెంకుటిల్లు కవితా సంపుటిని కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాహిత్య నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించిన కాంచనపల్లి ఆ వారసత్వాన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రం సిద్ధించిన నేపథ్యంలో సాహిత్యంలోనూ తెలంగాణ ముద్ర బలంగా వేసిన కవి అని కొనియాడారు. పెంకుటిల్లు కవితా సంపుటిని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్‌కు అంకితం ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాన్ని అంకితం తీసుకోవడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. రచయిత కాంచనపల్లి మాట్లాడుతూ పుస్తకాల్లో జీవించే పరిణితి కవులకు రావాలనీ, అప్పుడే పాఠకులను కవిత్వం దగ్గరవుతుందని అన్నారు. తన "పెంకుటిల్లు" లో ఆ ప్రయత్నం చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, ప్రముఖ కవులు డాక్టర్ చెమన్, ఘనపురం దేవేందర్, కళ్లెం నవీన్ రెడ్డి, కురుమయ్య రాజీవ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ ద్వారా మేడారం 'బంగారం'

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క సారక్క జాతరలో పోస్టల్ శాఖ ద్వారా సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ రంగారావు తెలిపారు. ఈ మేరకు దేవాదాయశాఖతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ జాతరలో భక్తులు అమ్మవార్లకు సమర్పించే బంగారం (బెల్లం)ను పోస్టల్ శాఖ ద్వారా బుక్ చేసుకొనే సౌకర్యం కల్పించామన్నారు. ఈ సౌకర్యం దేశంలోని అన్ని ప్రధాన పోస్టాఫీసుల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందనీ, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిలో బంగారం (బెల్లం) రూ.60 చొప్పున ఎన్ని కిలోలు కావాలంటే అన్ని కిలోలు బుక్ చేసు కోవచ్చని వివరించారు.



ఇలా మొక్కుకున్న బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించాక, ప్రసాదాన్ని స్పీడ్ పోస్ట్ ద్వారా ఇంటికి పంపి స్తామనీ, దీనికోసం అదనంగా రూ.135 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

దేశం లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందనీ, నేరుగా జాతరలో పాల్గొనలేని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, జాతర ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

అంతర్గత ప్రజాస్వామ్యానికి చెల్లుచీటీ

బీజేపీలో అధికారమంతా ఇకపై పార్లమెంటరీ బోర్డుదే | జాతీయ సమావేశాల్లో కొనసాగిన మోడీ హవా





న్యూఢిల్లీ : బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం భూతద్దంతో వెతికినా కానరావడం లేదు. ఇటీవల ముగిసిన బీజేపీ జాతీయ సమావేశాల్లో ఈ విషయం తేటతెల్లమై పోయింది. పార్టీ అధ్యక్షుడిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకునే పద్ధతికి స్వస్తి చెబుతూ బీజేపీ రాజ్యాంగాన్ని సవరించారు. అధ్యక్షుని పదవీకాలం, అత్యవసర పరిస్థితుల్లో దాని పొడిగింపు వంటి విషయాలలో నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ పార్లమెంటరీ బోర్డుకు కట్టబెట్టారు. ఈ సవరణపై సమావేశంలో చర్చ జరిగిందా లేదా అనే విషయం ఎవరికీ తెలియదు. ఎందుకంటే సమావేశానికి పాత్రికేయులను అనుమతించలేదు. పీటీఐ వార్తా సంస్థ ఇచ్చిన సమాచారాన్నే మీడియా సంస్థలు ప్రజలకు చేరవేశాయి.

'సవరణల వివరాలను, వాటిలోని హేతుబద్ధతను బీజేపీ వివరించలేదు. భవిష్యత్తులో పార్టీ అధ్యక్ష పదవిని నియామకం ద్వారా భర్తీ చేసే పరిస్థితి రావచ్చునని మాత్రం పార్టీ వర్గాలు తెలిపాయి' అని పీటీఐ వివరించింది.

1980లో బీజేపీ ఆవిర్భవించినప్పటి నుండి కాంగ్రెస్ అంతర్గత పనితీరుకు పూర్తి భిన్నమైన రీతిలో వ్యవహారాలను నడిపింది. కాంగ్రెస్ ఓ కుటుంబ పార్టీ అని, అంతర్గత ప్రజాస్వామ్య సూత్రాలను తుంగలో తొక్కిందని బీజేపీ ఆరోపిస్తూ వస్తోంది. ప్రజాస్వామ్యబద్ధమైన ప్రక్రియ ద్వారానే తమ అధ్యక్షులందరూ ఎన్నికయ్యారని గొప్పలు చెప్పుకుంది. అయితే ఈ వాదనలో ఏ మాత్రం వాస్తవం లేదని బీజేపీ అధ్యక్ష ఎన్నికల ప్రహసనాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

అంతా ఏకగ్రీవమేనట

1997లో మొదటిసారి, గత సంవత్సరం రెండోసారి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. కానీ దీనికి భిన్నంగా బీజేపీ అధ్యక్షులందరూ 'ఏకగ్రీవం'గానే ఎన్నికయ్యారు. ముందుగానే ఎంపిక చేసుకున్న వ్యక్తికి వ్యతిరేకంగా ఎవరూ నామినేషన్ వేసే సాహసం చేయకుండా పార్టీ పెద్దలు, ఆర్ఎస్ఎస్ నేతలు జాగ్రత్తలు తీసుకునే వారు. 2014 వరకూ బీజేపీ అధ్యక్షుడిని ఎంపిక చేసింది ఆర్ఎస్ఎస్ సంస్థే.


2005లో మహమ్మద్ అలీ జిన్నా లౌకిక విశ్వసనీయతలను ప్రశ్నించిన తర్వాత అద్వానీని పూర్తిగా విస్మరించారు. 2013లో నితిన్ గడ్కరీని రాత్రికి రాత్రే పార్టీ అధ్యక్ష పదవి నుండి తప్పించి, రాజ్‌నాథ్ సింగ్‌ను నియమించడానికి కారణమేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. అయినప్పటికీ తమ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని బీజేపీ చెప్పుకుంటుంది.

2014 తర్వాత సీను మారింది

2014 తర్వాత బీజేపీకి ఓట్లు సంపాదించే నేతగా మోడీ ఆవిర్భవించారు. అద్వానీ, మురళీ మనోహర్ జోషీ వంటి సీనియర్ నేతలు పూర్తిగా తెరమరుగయ్యారు. ఒకప్పుడు బీజేపీ రాజకీయాలను శాసించిన ఆర్ఎస్ఎస్ కూడా మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది. 2014లో బీజేపీ అధ్యక్షుడుగా అమిత్ షా ఎన్నికైన తర్వాత పార్టీలో మోడీ ప్రభంజనం మొదలైంది. ఇందిరాగాంధీ మోడల్‌నే బీజేపీ అనుకరించడం ప్రారంభించింది. తాజాగా బీజేపీ రాజ్యాంగానికి చేసిన సవరణతో పార్లమెంటరీ బోర్డే సూపర్ పొలిట్‌బ్యూరోగా అవతరించింది. పార్లమెంటరీ బోర్డులో ఎవరు ఉండాలనేది నిర్ణయించేది అమిత్ షాయే. పార్టీ అధ్యక్షుడుగా జేపీ నడ్డా ఉన్నా లేక వేరెవరు ఉన్నా పూర్తి అధికారం, పట్టు మాత్రం మోడీదే. అటల్ బిహారీ వాజ్‌పేయి సైతం ప్రభుత్వం పైన, పార్టీ పైన ఇలా పెత్తనం చెలాయించే వారు కాదు. బీజేపీ జాతీయ సమావేశాల్లో రాజ్‌నాథ్ సింగ్, నడ్డా, చివరికి అమిత్ షా కూడా డమ్మీలుగా మిగిలిపోయారు. ఆర్ఎస్ఎస్ సైతం జరుగుతున్న పరిణామాలను నిస్సహాయంగా చూస్తూ ఉండిపోతోంది. ఏదేమైనా తాజా సవరణ ఆర్ఎస్ఎస్‌కు ఎదురు దెబ్బగానే భావించాలి. రాజ్యాంగం, ఏకాభిప్రాయం, ప్రజాస్వామ్యం వంటి పదాలన్నీ కంటితుడుపు మాటలుగానే మిగిలిపోయాయి.

నేడు హైదరాబాద్‌లో రెడ్ బుక్స్‌డే కార్యక్రమం

'లెనిన్ ఓ విప్లవాయుధం' పుసక్తంపై సామూహిక పఠనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెడ్ బుక్స్ డే కార్యక్రమం జరగనుంది. 'లెనిన్ ఓ విప్లవాయుధం'అనే పుస్తకంపై సామూహిక పఠన కార్యక్రమం ఉంటుంది. ఇందులో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, హైదరాబాద్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, పార్టీ సభ్యులు పాల్గొంటారు.

కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ(సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. లోధిరోడ్‌లోని కేసీ వేణుగోపాల్ నివాసంలో ఆయనను కలిసారు. ఈ భేటిలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారు. దాదాపు గంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, ఆరు గ్యారెంటీల అమలు తీరును నేతలు కేసీ వేణుగోపాల్‌కు వివరించారు. అలాగే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై మంతనాలు జరిపారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు, సీటు ఆశిస్తోన్న అభ్యర్థుల వివరాలపై చర్చించినట్టు సమాచారం. అలాగే మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపైనా సమాలోచన చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అనంతరం ఢిల్లీ పర్యటన ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటి రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు.



150 మంది అవుట్ సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్ల తొలగింపు

వారిని యధావిధిగా కొనసాగించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్లను తొలగించింది. తాజాగా సిద్ధిపేట మెడికల్ కాలేజీలో దాదాపు వంద మంది, మహబూబ్ నగర్ నర్సింగ్ కాలేజీలో దాదాపు 50 మందిని తొలగించడంతో వారిలో ఆందోళన నెలకొంది. దీంతో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సిద్ధిపేట జిల్లా సీఐటీయూ నాయకులు రవితో కలిసి ఉద్యోగాలు కోల్పోయిన నర్సింగ్ ఆఫీసర్లు మంగళవారం హైదరాబాద్ కోఠిలో రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు, తదితర ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు, నర్సింగ్ ఆఫీసర్లు మాట్లాడుతూ కోవిడ్ కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యోగాలు చేశామని గుర్తుచేశారు. రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో ఇంతకాలం పని చేసిన వారిన తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.ఐదేండ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యారోగ్యశాఖలోని ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించి యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌వన్నీ 420 హామీలు

- కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి ఇచ్చిందే కాంగ్రెస్
- అమరులకు నివాళ్లర్పించని వ్యక్తి.. నేడు సీఎం : షాద్‌నగర్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు




నవతెలంగాణ-షాద్‌నగర్

కాంగ్రెస్ పార్టీ 420 దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి అప్పగించిందే కాంగ్రెస్ అని తెలిపారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టే బీఆర్ఎస్ అని, రాష్ట్ర హక్కుల విషయంలో ఎప్పుడూ రాజీపడబోమని స్పష్టంచేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని, ఎప్పుడూ కూడా జై తెలంగాణ అనని వ్యక్తి, ఉద్యమకారులపైకి తుపాకి పట్టుకొని వెళ్లిన వ్యక్తి నేడు సీఎం అయ్యాడని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు అమరవీరులకు నివాళి అర్పించలేదని, ఈ విషయంలో తాను ఎంతో కలత చెందానని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో షాద్‌నగర్ ఎంతో క్రియాశీలకంగా పాల్గొన్నదని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని, మళ్లీ స్పీడ్ అందుకుంటామని తెలిపారు. కరోనా కాలంలో కూడా రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ఓడినా, గెలిచినా ఎప్పటికీ ప్రజల పక్షమేనని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. హామీల గురించి అడిగితే అసెంబ్లీలో తప్పుడు శ్వేత పత్రాలతో డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారని, వాస్తవాలు బయట పెడితే తిట్టడం మొదలు పెట్టారని అన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో వచ్చి అబద్ధాలు మాట్లాడరని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80శాతం పూర్తి అయ్యాయని, కాలవలు తవ్వితే నీళ్ళు వస్తాయని, కాంగ్రెస్ వాళ్ళు ఆ పని పూర్తి చేసి నీళ్లు అందియ్యాలన్నారు. స్వరాష్ట్రంలోనే పాలమూరుకు మెడికల్ కాలేజీలు వచ్చాయన్నారు. అక్రమ కేసులకు కార్యకర్తలు భయపడొద్దని, ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ గడ్డపై మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దీని కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. అంతకుముందు తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, అలాగే దివంగత గాయకుడు సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ ఈట గణేష్, మున్సిపల్ చైర్మెన్ నరేందర్, వైస్ చైర్మెన్ నటరాజన్, నాయకులు రాజవరప్రసాద్‌రావు, ఇబ్రహీం, రాంబాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నిపుణుల బృందం



నవతెలంగాణ-మహదేవ్‌పూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను రాష్ట్ర డ్యాం సెఫ్టీ అథారిటీ బృందం, సాంకేతిక, ఇంజినీరింగ్ నిపుణుల బృందం మంగళవారం పరిశీలించింది. ఇరిగేషన్ ఈఎన్‌సీ(అడ్మిన్) అనిల్‌కుమార్, నిపుణులు మొరం రాములు, దేశ్ సాయి నేతృత్వంలో డ్యాం సెఫ్టీ బృందం పరిశీలించారు. ముందుగా అన్నారం బ్యారేజ్ వద్దకు చేరుకొని 39 పియర్ వద్ద ఏర్పడిన సీపేజీని పరిశీలన చేశారు. బ్యారేజ్ 4వ బ్లాక్‌లోని డౌన్ స్ట్రీమ్ 38,39 పియర్ల మధ్య గల వెంట్ వద్ద ఏర్పడిన సీపేజీను పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. బ్యారేజీ సమస్యలు, పలు అంశాలపై ఈఈ యాదగిరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్ 7లోని దెబ్బతిని, కుంగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నది గర్భంలో బ్యారేజ్ కిందికి వెళ్లి 20పియర్ పగుళ్లను, ఆ ప్రాంతంలో నీటి ప్రవాహం, ఇసుక మేటలనూ పరిశీలించారు.

యాదాద్రిలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

- రెండోసారి ఎందుకు పెట్టారు
- ప్రభావిత గ్రామాలకు నష్ట పరిహారం ఇవ్వాలి : జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను మళ్లీ ఎందుకు పెట్టాల్సి వచ్చిందో ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయం సేకరణ జరిగింది. ఇందులో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఏర్పాటు చేసే ముందు ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, ఆ సమయంలో విదేశీ బొగ్గు వాడుతామని చెప్పారని, దానివల్ల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి కాలుష్యం, ప్రాణాపాయం ఉండదని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు స్వదేశీ బొగ్గును వాడేందుకు చూస్తున్నారని, దీనిపై న్యాయస్థానానికి వెళ్లడం వల్ల మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని చెప్పారు. ఎందుకు స్వదేశీ బొగ్గు వాడుతున్నారో, మాట మార్చాల్సిన అవసరం ఎందుకొచ్చిందో ప్రజలకు వివరించాలన్నారు. ప్లాంటు నిర్మాణం సమయంలో 40శాతం గ్రీనరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఒక్క మొక్క కూడా నాటలేదని చెప్పారు. ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని.. ఇప్పుడు గ్రీనరీ లేక, చెట్లు లేక గాలి, నీరు కలుషితమవుతున్నాయని.. దాని ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి పంట పూర్తిగా దిగుబడి తగ్గిపోయిందని తెలిపారు.ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురవుతున్న నర్సాపురం, వాడపల్లి, మరికొన్ని గ్రామాలను కూడా బాధిత గ్రామాలుగా చేర్చి అక్కడి రైతులకు పరిహారం అందించి న్యాయం చేయాలన్నారు. ప్రాజెక్టు ప్రభావితం చూపే ప్రాంతం వరకు అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.రంగారెడ్డి మాట్లాడే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు.

మిగులు భూమి లెక్క తేల్చాలి

(మొదటి పేజీ తరువాయి)

రైతు వేదికలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలని రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటంలో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పట్నం ప్రధాన కార్యదర్శి డిజి. నర్సింహరావు మాట్లాడుతూ ఢిల్లీ రైతుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇండ్ల స్థలాలు, సాగు భూమి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ భూమి కోసం రాష్ట్రంలో జరుగుతున్న పోరాటంలో మహిళలు వీరోచితంగా పోరాడి జైలుకెళ్లారనీ, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా భూ కేంద్రాల్లో ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు.

పట్టాలు పురుషుల పేరున కాకుండా మహిళల పేరున ప్రభుత్వం పంచాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరల నేపథ్యంలో పేదలు ఇండ్ల స్థలాలు కొనే పరిస్థితి లేదనీ, అర్హులైన పేదలందరికీ పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ 2016లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో 22 లక్షల మంది ఇండ్లు లేని పేదలున్నారనీ, ఇప్పుడాసంఖ్య 30 లక్షలకు చేరుకుందని చెప్పారు. 2015లో ఇచ్చిన జీవో 58 ప్రకారం ఇండ్లు లేని అర్హులైన పేదలందరికి 120 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద కార్మికులందరికి న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన హామీలు అమలు చేయకుంటే మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ సైతం గత ప్రభుత్వం లాగానే నిర్బంధాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. జగిత్యాల భూ పోరాట కేంద్రంలో గుడిసెలేసుకున్న వారిపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దాడులు చేయించి కేసులు బనాయించారని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా కోయపోశం గూడెం పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని సూచించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ నిలువ నీడ లేని పేదలకు భూమిపై హక్కుందని చెబుతున్న రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా ప్రభుత్వాలు నిర్బంధాన్ని సాగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటంలో సవాళ్లను ఎదురించి పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, తదితర తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారులో తొలి ప్రాజెక్టుకు శంకుస్థాపన

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు శ్రీకారం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత తొలి ప్రాజెక్టుకు బుధవారం శంకుస్థాపన జరగనుంది. ఈమేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2945.5 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. మక్తల్, నారాయణపేట, కోడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. సీఎం రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి దీని కోసం ప్రయత్నం చేస్తున్న సంగతి తెలిసిందే.

వివాహమైతే విధుల నుంచి తొలగిస్తారా ?

ఆ మిలటరీ నిబంధనలు లింగ వివక్ష, రాజ్యాంగ విరుద్ధమే : సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : వివాహం చేసుకుంటున్నందుకు లేదా ఇంట్లో సమస్యలున్నందుకు మహిళా ఉద్యోగులను వారి ఉద్యోగాల నుండి తొలగించాలని కోరుతున్న నిబంధనలు 'తీవ్రమైన లింగ వివక్ష' కిందకు వస్తాయని, అవి పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మహిళకు పెళ్లైందనే కారణంతో ఆమెను ఉద్యోగం నుండి తొలగించడం దారుణమైన లింగ వివక్షకు, అసమానతలకు నిదర్శనమని కోర్టు ఇటీవల జారీ చేసిన ఒక ఉత్తర్వులో వ్యాఖ్యానించింది. ఇటువంటి పితృస్వామ్య నిబంధనను ఆమోదించడం మానవ గౌరవాన్ని దెబ్బతీస్తుందని పేర్కొంది. లింగ ప్రధానమైన పక్షపాతాల ప్రాతిపదికన చట్టాలు, నిబంధ నలు రూపొందించడం రాజ్యాంగపరంగా అనుమతి యోగ్యం కాదని స్పష్టం చేసింది. మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో మహిళా పర్మినెంట్ కమిషనర్ ఆఫీసర్ హక్కులను పరిరక్షిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో భాగంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఆమె వివాహం చేసుకుంటో ందన్న కారణంగా ఆమెను విధుల నుండి తొలగించారు. మాజీ లెఫ్టినెంట్ సెలీనా జాన్‌కు 8వారాల్లోగా పూర్తిగా 60లక్షల రూపాయిలను నష్టపరిహారంగా చెల్లించాలని జస్టిస్ సంజయ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది. ఆమెకు అనుకూలంగా రూలింగ్ ఇచ్చిన సాయుధ బలగాల ట్రిబ్యునల్ లక్నో బెంచ్ నిర్ణయానికి వ్యతిరేకంగా కేంద్రం అప్పీల్ చేసింది. ఆమెను సర్వీసు నుండి తొలగించడమనేది 'తప్పు, అక్రమం' అని స్పష్టం చేసింది.



ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో మహిళలను సమానంగా చూడాలి

మహిళా ఆఫీసర్లకు పర్మినెంట్ కమిషన్‌ను తిరస్కరించినందుకు కేంద్రం, ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి)లపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. మహిళలను కూడా సమానంగా చూసేలా ఒక విధానాన్ని రూపొందించాలని కోస్ట్ గార్డ్ బలగాలను ఆదేశించింది. ఐసిజిలో అర్హత గల వుమెన్ షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్లకు శాశ్వత నియామకాన్ని మంజూరు చేయాలని కోరుతూ మహిళా అధికారి ప్రియాంక త్యాగి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం విచారణ జరిపింది.

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆచార వ్యవహారాలతో పగిడిద్దరాజును పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. అనంతరం అక్కడ నుంచి మేడారానికి అటవీ మార్గంలో కాలినడకన కర్లపెల్లి, గుండ్లవాగు మీదుగా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం చేరుకుంటారు. గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామంలో రాత్రి బస చేయడానికి పగిడిగిద్దరాజు పూజారుల కోసం నిర్మించిన భవనాన్ని మంగళవారం మంత్రి సీతక్క ప్రారంభించారు. పగిడిద్దరాజు పూజారులు బుధవారం మధ్యాహ్నం జంపన్నవాగు వద్దకు చేరుకుంటారు. అలాగే, కన్నాయిగూడెం మండలం కొండాయి నుంచి గోవిందరాజులును పూజారి దబ్బకట్ల గోవర్ధన్ తీసుకొని బుధవారం సాయంత్రం జంపన్నవాగు సమీపంలోకి వస్తారు. ఆ తర్వాత సారలమ్మను తీసుకొనివచ్చే క్రమంలోనే పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా తీసుకొని వచ్చి మేడారంలోని గద్దెలపై ప్రతిష్ఠిస్తారు.

నేటి నుంచి మేడారం మహాజాతర

నేడు గద్దెలకు సారలమ్మ, రేపు సమ్మక్క.

కన్నెపల్లిలో తొలుత ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సారలమ్మ దేవాలయంలో అధికారిక లాంఛనాలతో పూజలు చేస్తారు. అనంతరం ప్రధాన పూజారి కాకసారయ్యతో పాటు ఇతర పూజారులు సారలమ్మను ఆదివాసీల డోలు, కొమ్మువాయిద్యాలతో తీసుకొని బుధవారం మేడారం గద్దెలపై ప్రతిష్టిస్తారు. గురువారం మధ్యాహ్నం చిలుకలగుట్టలోని సమ్మక్క దేవాలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత ప్రధాన పూజారి కొక్కెర కృష్ణ సమ్మక్కను తీసుకుని బయలుదేరుతారు. ఈ క్రమంలో అధికారిక లాంఛనాలలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్కకు ఆహ్వానం పలుకుతారు. భారీ భద్రత నడుమ, రోప్ పార్టీ మధ్యలో పూజారులు, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆధ్వర్యంలో సమ్మక్కను పూజారి కొక్కెర కృష్ణ తీసుకుని గద్దెలపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. శుక్రవారం నాటికి గద్దెలపై సమ్మక్క, సారలమ్మ, పగడిద్దరాజు, గోవిందరాజులు కొలువుతీరి ఉండటంతో ఆదివాసీలు మొక్కులు సమర్పించుకుంటారు. జాతర ముగింపులో భాగంగా ఈనెల 24న సాయంత్రం సమ్మక్క, సారలమ్మల వనప్రవేశం నేపథ్యంలో పగిడిగిద్దరాజును తీసుకొని పూజారులు మళ్లీ పూనుగొండ్ల గ్రామానికి చేరుకొని 26వ తేదీన దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. ఈనెల 28, 29 మార్చి 1వ తేదీలలో తిరుగువారం జాతర జరుపుకుంటారు.

జాతరకు రూ.105 కోట్లతో ఏర్పాట్లు

మేడారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లతో వివిధ శాఖల కింద పలు పనులను ప్రారంభించి పూర్తి చేసింది. జాతర విజయవంతానికి మంత్రి సీతక్కతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పలుమార్లు మేడారం వచ్చి ఏర్పాట్లను సమీక్షించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు. మరుగుదొడ్లు, మినీ డంపింగ్ యార్డులనూ ఏర్పాటుచేశారు. పారిశుధ్యం నిర్వహణకు 4000 మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. జాతరలో నిరంతర విద్యుత్ నందించడానికి కొత్తూర్, మేడారంలలోని సబ్‌స్టేషన్‌లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మేడారంలోని కళ్యాణమండపంలో రూ. ఒక కోటితో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు.

12 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు

మేడారంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ నాయకత్వంలో 12 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 500 సీసీ కెమెరాలతో మొదటిసారి శాశ్వత ప్రాతిపదికన రూపొందించిన పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి జాతరతోపాటు పరిసర ప్రాంతాలను పర్యవేక్షించనున్నారు.

సంపాదకీయం

నాణ్యతేది..?

ఇటీవల యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఎఎస్‌ఇఆర్) తన తాజా నివేదికను విడుదల చేసింది. ఆ లెక్కలు చూస్తూ మన భావిభారతం పరిస్థితి ఏంటనే భయం కలుగుతోంది. దేశంలో నాణ్యమైన విద్య కొరవడిందని ఆ రిపోర్ట్ తేల్చి చెప్పేసింది. దీనికి ప్రభుత్వ అలసత్వమే ప్రధాన కారణం. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత, వారి విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి అనే విషయాలపై ఎఎస్‌ఇఆర్ 2005లో తన అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటి వరకు మూడు నివేదికలు విడుదల చేసింది. తాజాగా గతేడాది విడుదలైన నివేదికైతే పాఠశాల విద్యపై ఆందోళన వ్యక్తం చేసింది. 14-18 ఏండ్ల మధ్య విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన పునాది చాలా బలహీనంగా ఉందని ఆవేదన చెందుతోంది. పునాదే బలహీనంగా ఉంటే ఇక దానిపై నిర్మించబోయే భవనం పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విద్యార్థి దశలో బలమైన పునాది లేకపోవడంతో యువత సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారని, ఇది కూడా నిరుద్యోగానికి ఓ కారణమని ఆ నివేదిక చెబుతోంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం - 2020 తీవ్రమైన అసమానతలతో కూడుకొని ఉందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు మొదటి నుండి అంటూనే ఉన్నారు. కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందని నెత్తీనోరూ కొట్టుకుంటూనే ఉన్నారు. సిలబస్ మార్పిడి పేరిట శాస్త్రీయ భావాలను తొలగించడమే దీనికి ఉదాహరణ. మేధావులను తయారు చేసే విశ్వవిద్యాలయాల్లో మూఢనమ్మకాలు పెంచిపోషించే జ్యోతిష్య, వాస్తు, భూత వైద్యాన్ని ప్రవేశపెట్టారంటే భావిభారతం పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో విద్యావంతులైన వారందరికీ ఉద్యోగాలు లభించడం లేదు. పట్టభద్రుల్లో 45శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని మెర్సర్ మెటిల్ సంస్థ రూపొందించిన నివేదిక తెలిపింది. భారత్‌లో విద్యనభ్యసించి పట్టభద్రులైన వారిలో నైపుణ్యం పరిమితంగా ఉంటుందని గతేడాది ఏప్రిల్‌లో విడుదలైన బ్లూమ్‌బర్గ్ నివేదిక నిగ్గుతేల్చింది. 'ప్రపంచాన్ని మార్చగలిగే శక్తిమంతమైన ఆయుధం విద్య' అన్నాడు నెల్సన్ మండేలా. అంటే ప్రజల జీవన ప్రమాణాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు వారికి అందించే విద్యపై మాత్రమే ఆధారపడి ఉంటాయి. ఏ దేశమైనా అభివృద్ధి చెందిందంటే అక్కడ విద్యాభివృద్ధి ఉన్నట్టే. దేశ ప్రగతికి సాధనం విద్య.

ప్రపంచంలో కొన్ని దేశాలలో అత్యుత్తమ విద్యా విధానం అమల్లో ఉన్నట్టు కొన్ని లెక్కలు చెబుతున్నాయి. ఆయా దేశాల్లో విద్యకు అవసరమైన నిధులు కేటాయించి అందరికీ కనీసం హైస్కూల్ వరకైనా సమాన విద్యను అందించడమే



దీనికి కారణమని కూడా అవే లెక్కలు తేల్చాయి. కాబట్టే ఆయా దేశాలు అభివృద్ధి చెందాయి. అయితే ఇవేవి మన ప్రధాని కండ్లకు కనబడడం లేదు. తమ పరిపాలనా, వ్యాపార సౌలభ్యం కోసం నాడు విదేశీ పాలకులు మెకాలే విద్యా విధానం అమలు చేస్తే నేటి మన బీజేపీ పాలకులు తమ కుర్చీని సుస్థిరం చేసుకునేందుకు అంతరాల విద్యను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం ఉచిత నిర్బంధ విద్య అందించాల్సిన ప్రభుత్వాలు ఆ నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్ విధానాలకు వత్తాసు పలకుతున్నాయి. ఇది దేశ ప్రగతి నిరోధిస్తుంది. నాణ్యమైన విద్య మాత్రమే యువతను సమాజ అవసరాలకు అనుగుణంగా తయారు చేస్తుంది. కానీ మన దేశంలో గత 30 ఏండ్లుగా విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ బాట పట్టిందనేది ఎవ్వరూ కాదనలేని సత్యం. ఫలితంగా సామాన్యులు నాణ్యమైన విద్యకు దూరమయ్యారనేది కూడా పచ్చి నిజం.

ఇక కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం - 2020 తీవ్రమైన అసమానతలతో కూడుకొని ఉందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు మొదటి నుండి అంటూనే ఉన్నారు. కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందని నెత్తీనోరూ కొట్టుకుంటూనే ఉన్నారు. సిలబస్ మార్పిడి పేరిట శాస్త్రీయ భావాలను తొలగించడమే దీనికి ఉదాహరణ. మేధావులను తయారు చేసే విశ్వవిద్యాలయాల్లో మూఢనమ్మకాలు పెంచిపోషించే జ్యోతిష్య, వాస్తు, భూత వైద్యాన్ని ప్రవేశపెట్టారంటే భావిభారతం పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే దేశాన్ని పెను ప్రమాదంలోకి నెట్టేసే అంశాలు నూతన విద్యా విధానంలో ఎన్నో ఉన్నాయి.

ఇలాంటి విద్యా విధానం సామాన్యులకు నాణ్యమైన చదువును దూరం చేస్తుందనడంలో, అసమానతలు మరింత పెంచిపోషిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కనుక ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, అభివృద్ధికి అవసరమైన విద్యా విధానాన్ని ప్రభుత్వం అమలు చేయకపోతే సామాన్యులు నాణ్యమైన విద్యకు మరింత దూరమవ్వడం ఖాయం. మరీ ముఖ్యంగా శాస్త్రీయ, లౌకిక, ప్రజాతంత్ర విద్యా విధానాన్ని మానవీయ విలువలు పెంపొందించే విధంగా రూపొందించాల్సి బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అయితే నిత్యం హిందూ, కార్పొరేట్ల జపంలో తరించే బీజేపీ ఈ బాధ్యత తీసుకుంటుందనే నమ్మకం ప్రజలు పూర్తిగా కోల్పోయారు. కనుక పాలకుల కనుసన్నల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టి, విద్యా వ్యవస్థను కాపాడుకోవల్సిన బాధ్యత పౌర సమాజంపై ఎంతైనా ఉంది. ఇప్పటికే కార్మిక, కర్షకులు ఏకమై కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలపై పోరాడేందుకు సిద్ధమయ్యారు. వారితో విద్యార్థులు, యువత, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావేత్తలు సైతం భుజం కలిపే సమయం ఆసన్నమయ్యింది.

దేశానికి కావాల్సింది 'ఎర్ర కాగితాలు'



ఆర్. రఘు
9490098422

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 ఓట్‌ఆన్ ఎకౌంటు బడ్జెట్ ప్రవేశపెడుతూ 2014లో తాము అధికారంలోకి వచ్చేవరకు పాలించిన ప్రభుత్వాలు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా భ్రష్టు పట్టించాయో (తమ వాజ్‌పాయ్ పాలన ఆరేళ్లనూ దాన్లో కలపాలనుకున్నట్లుంది) శ్వేత పత్రం (తెల్ల కాగితాలు) ద్వారా తేల్చిపారేస్తానని హూంకరించారు. దానికి ప్రతిగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖార్గే మీ పదేండ్ల పాలన బండారం తేల్చడానికి బ్లాక్ పేపర్ (నల్ల కాగితాలు) ప్రవేశపెడతానని ధీటుగా ప్రకటించారు. వీరిద్దరూ చెప్పే దాంట్లో అబద్దాల మాట ఎలా ఉన్నా ఒక నిజం మాత్రం ఉంది. 75 ఏండ్లు దేశాన్ని పాలించిన వీరు, మధ్యలో తొంగిచూసిన జనతా, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాలు కలిసి మొత్తం మీద దేశాన్ని అధోగతి పాలు చేశాయన్నది మాత్రం వాస్తవం. పార్టీల అభిమానాల్ని పక్కనపెట్టి వాస్తవాలను వాస్తవాలుగా పరిగణించి పరిశీలిస్తే డెబ్బయి అయిదేండ్లుగా నడిచిన ఆర్థిక విధానాలు కొన్ని తాత్కాలిక ఉపశమనాలను కల్పించినా ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపలేకపోయాయన్నది యదార్థం.

వామపక్షాలు అధికారంలోకి వచ్చిన కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ముందుకు తెచ్చిన ప్రత్యామ్నాయాలను సహించలేని పాలక పార్టీలు ప్రారంభం నుండి కమ్యూనిస్టు పార్టీ పైన, వారి సైద్ధాంతిక అంశాల మీద దాడి చేస్తూనే ఉన్నాయి. 2008లో యూపీఏ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును వామపక్షాలు ఉపసంహరించుకున్న సందర్భంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ "హమ్మయ్య మా కాళ్లకి ఉన్న సంకెళ్లు తెగిపోయాయి. ఇక స్వేచ్ఛగా ఆర్థిక సంస్కరణలను (ఉదారవాద ఆర్థిక విధానాలను) అమలు చేసుకోవచ్చని" బడా పెట్టుబడిదారుల తరపున ఊపిరి పీల్చుకోవడం మనం చూసాం. కానీ ఆ రోజు వామపక్షాలు ఒత్తిడి వలనే గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి వచ్చాయన్న సంగతి మనం మర్చిపోగలమా? ఏమైనా ఆ తరువాత క్రమంగా వామపక్షాలు బలహీనపడటంతో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఒకే తరహా ఆర్థిక విధానాలు, పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గ అనుకూల ఆర్థిక విధానాలు అమలులోకి రావడం మొదలైంది. సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడి తీవ్రతరమైంది. ఆ దేశాల ప్రాపకం కోసం అర్రులు చాచడం ప్రారంభమైంది. పాలకవర్గ పార్టీలు జయప్రదంగా పాలకవర్గాల గురించి, ఆ వర్గాల ప్రయోజనాల గురించి, వాటి కోసం వారు పడుతున్న తాపత్రయం గురించి మాత్రం ప్రజల్లో చర్చలు రాకుండా జాగ్రత్త పడగలుగుతున్నాయి. "ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు పదేపదే మోసపోతూనే ఉంటారు" అని ఓ ఎర్ర కాగితంలో లెనిన్ చెప్పాడు

గ్యారెంటీగా గ్యారెంటీ లేని గ్యారెంటీలు!

ఎన్నికల సీజన్ వచ్చింది. పోటీలు తీవ్రంగా ఉండనున్నాయి. 'మోడీజీ గ్యారెంటీ', 'కాంగ్రెస్సే భవిష్యత్తుకు గ్యారెంటీ' నినాదాలు ఆకాశాన్నంటుతున్నాయి. నిజానికి ఈ తతంగం కొత్తేమీ కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గరీబీ హటావో, రైతు సాధికారిత, మహిళా సాధికారిత, దేశం వెలిగిపోతోంది, తాజాగా ఆత్మ నిర్భర భారత్, స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, స్వర్ణాంధ్ర, బంగారు తెలంగాణ, వికసిత భారత్, సబ్‌కా సాత్- సబ్‌కా వికాస్... ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ, అన్ని భాషల్లోనూ పాలక పార్టీల ప్రభుత్వాలు ఎన్నికల వేళ మరింత బిగ్గరగా హోరెత్తిస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టిన నాటి నుండి దాన్ని బలపరిచే రాజకీయ పార్టీలన్నింటినీ పీడించే సమస్య, దాన్నే వారి ఆయుధంగా మలుచుకునే సమస్య 'పేదరికం'. మనదేశంలో కూడా పేదరికం నిర్మూలనకు సవాలక్ష పథకాలున్నాయి. కొన్ని రద్దయ్యాయి, కొత్తవి వస్తున్నాయి. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అయినా పేదరికానికి శాశ్వత పరిష్కారం వీళ్లకి దొరకటం లేదు. ఆ పేదరికం ఆకలిని, రక్తహీనతను, న్యూనతను, వివక్షను, అసమానతలను సృష్టిస్తున్నది. నేడు పెట్టుబడిదారీ ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి మూలం కూడా ఈ పేదరికాన్ని నిర్మూలించలేని దానిలోని వైరుధ్యమే. కానీ నిన్నటి కన్నా ఈ రోజు మెరుగా? గత ప్రభుత్వం కన్నా నేటి ప్రభుత్వం మెరుగా? అని ఆలోచించటం తప్ప మరో మార్గం లేదన్నట్లు బూర్జువా రాజ్యం నిరంతరం ప్రజల మనస్సులను నింపేస్తూనే ఉంటుంది.

పేదరికంపై ఎర్ర కాగితాలేమి చెబుతున్నాయి ?


సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వ సొమ్మును పంచి పెట్టడం వలన ప్రజలు సోమరులవుతున్నారని, ఆ సొమ్ముకు అలవాటు పడి కూలీకి రావటం లేదని పాలకవర్గాల ప్రతినిధులు వాపోతున్నారు. మధ్యతరగతిలో కూడా ఈ భావనకు మంచి గిరాకీ వచ్చింది. అలా అధికారంలో ఉన్న పార్టీలను తిట్టిన ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి రాగానే కొత్త రాగం ఎత్తుకుంటున్నాయి. మోడీ 'రేవడీ' (పాలకోవా) అంటే ఉచితాలకు మేము వ్యతిరేకమని చెబుతూనే సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ ఉంటాడు. నిర్మలా సీతారామన్ స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి తమ ప్రభుత్వం 25 కోట్ల మందిని పేదరికం నుండి విముక్తి చేశారంటారు. కానీ మోడీజీ 80 కోట్ల మందికి అందిస్తున్న ఉచిత రేషన్ (బియ్యం,గోధుమలు) మరో ఐదేండ్లు కొనసాగించటం తమ గొప్పగా చెబుతున్నారు. 80 కోట్లమంది అంటే దాదాపు 57 శాతం మంది నిరుపేదరికంలో ఉన్నారనేగా!? అందువలన పేదరికం నిర్మూలించాలంటే పేదరికాన్ని చూసే చూపు మారాలి. పేదరికం పెట్టుబడిదారులు, వారి ఆర్థిక శాస్త్ర పండితులు చెబుతున్నట్లు అది జబ్బు కాదు, అది పెట్టుబడిదారీ విధానం అనే జబ్బు సృష్టించే లక్షణం. "పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు బలపడే కొద్ది అవి సరళమైన, ఏకోన్ముఖమైనవి కావని, ద్విముఖమైనవని రోజురోజుకి అర్థమవుతుంది. ఒక పక్క సంపద ఉత్పత్తి అవుతుంటే మరోపక్క పేదరికం ఉత్పత్తి సమాంతరంగా జరుగుతూ ఉంటుంది". (తత్వశాస్త్ర దారిద్ర్యం -మార్క్స్) కానీ పెట్టుబడిదారీ వర్గం వారి పండితులు మాత్రం "ప్రకృతిలో ప్రతి జననం అప్పుడు వచ్చే పురిటి నొప్పులు లాగా పారిశ్రామిక అభివృద్ధిలో పేదరికం అనేది ఉంటుంది" (అదే గ్రంథం) అని బుకాయిస్తూ ఉంటారు. పేదరికం నిర్మూలన కోసం ఆర్థిక శాస్త్ర పాండిత్యం కావాలని పాకులాడనక్కర్లేదు. "తమ కండ్ల ముందు ఏం జరుగుతుందో గ్రహించి దాన్ని ప్రచారం చేస్తే సరిపోతుంది. మనం ఎంతకాలం శాస్త్ర పరిజ్ఞానం కోసం వెతుకుతూ, ప్రణాళికలు రూపొందిస్తూ పోరాట ప్రారంభంలోనే ఉండిపోతామో పేదరికంలో పేదరికాన్ని మాత్రమే చూస్తాం. దాంట్లో పాత సమాజాన్ని కూలదోసే విప్లవాత్మక, విధ్వంసకర పాత్రను చూడలేము" (పై గ్రంథం నుండి) అని కార్ల్‌మార్క్స్ ప్రకటించాడు.

ఎర్రకాగితాలే (రెడ్ బుక్స్) శరణ్యం

ప్రపంచవ్యాప్తంగా ఎర్ర పుస్తకాల కోసం వెతుకులాట ప్రారంభ మైంది. కారణం నేటి ప్రపంచానికి ప్రత్యామ్నాయం కావాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ సమస్యలను పరిష్కరించలేని నిర్జీవస్థితికి జారుతూ ఉంటే, ప్రత్యామ్నాయం కోసం వెతుకులాట అనివార్యం. మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి, అనివార్యంగా వచ్చే సంక్షోభం గురించి ఏమి చెప్పాడని తెలుసుకోవడానికి ఆయన రాసిన పెట్టుబడి గ్రంథాన్ని పెట్టుబడి దారీ మేధావులు తిరగేస్తున్నారు. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమైతే రావలసింది సోషలిజమేనన్న సహజ సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించగలగాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్లీనంగా అభివృద్ధి చెందే ప్రాథమిక వైరుధ్యానికి పరిష్కారమే సోషలిజం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సమాజపరంగా ఉంటుంది. పంపిణీ వ్యక్తి పరంగా ఉంటుంది. అంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ కష్టించి సృష్టించే సంపదని కొద్దిమంది హస్తగతం చేసుకుంటూ ఉంటారు. సంపదను కూడా ఉత్పత్తి లాగా సమాజపరం చేయడం ద్వారా అంటే సోషలిస్టు వ్యవస్థ నిర్మించుకోవడం ద్వారా అన్ని ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు దొరుకుతాయి.

గతంలో రష్యా, తూర్పు యూరప్ దేశాలలో నేడు చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తరకొరియా, లావోస్ వంటి సోషలిస్టు దేశాలలో సంక్షోభరహిత ఆర్థిక అభివృద్ధి కనబడుతుంది. అందువలనే పెట్టుబడిదారీ పాలకులు, వారి పార్టీలు ఎన్నికల చుట్టూ, సంక్షేమ పథకాల చుట్టూ పరిభ్రమించేటట్లు ప్రజల్ని తిప్పుతున్నారు. ఇప్పుడు బంతి కమ్యూనిస్టులు, వామపక్షాలు, ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులు, పార్టీల కోర్టులో పడింది. ఈ శక్తులు ప్రస్తుతం బలహీనంగా ఉన్నా, వేగంగా ఆ బలహీనతను అధిగమించాలి. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక పోరాటాలను పెంపొందించాలి. అందుకు కఠోర కృషి చేయాలి. మార్క్సిస్టు శాస్త్ర మౌలిక గ్రంథాలను (రెడ్ బుక్స్) అధ్యయనం చేయాలి. ఈ సందర్భంగా అత్యున్నత ఎర్ర పుస్తకం కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ముగింపులో కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు వక్కాణించి "కమ్యూనిస్టు విప్లవాన్ని చూసి పాలకవర్గాలని వణకనివ్వండి. శ్రామికులు తమ సంకెళ్లను తప్ప కోల్పోయేదేమీ లేదు. వారికి గెలవాల్సిన మరో ప్రపంచం ఉంది. ప్రపంచ కార్మికులారా ఏకంకండి!!" ఈ మాటలు మననం చేసుకుంటూ కార్యోన్ముఖులు కావాలి.

(ఫిబ్రవరి 21 'రెడ్‌బుక్స్‌డే')



మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి, అనివార్యంగా వచ్చే సంక్షోభం గురించి ఏమి చెప్పాడని తెలుసుకోవడానికి ఆయన రాసిన పెట్టుబడి గ్రంథాన్ని పెట్టుబడి దారీ మేధావులు తిరగేస్తున్నారు. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమైతే రావలసింది సోషలిజమేనన్న సహజ సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించగలగాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్లీనంగా అభివృద్ధి చెందే ప్రాథమిక వైరుధ్యానికి పరిష్కారమే సోషలిజం.

2008లో యూపీఏ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును వామపక్షాలు ఉపసంహరించుకున్న సందర్భంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ "హమ్మయ్య మా కాళ్లకి ఉన్న సంకెళ్లు తెగిపోయాయి. ఇక స్వేచ్ఛగా ఆర్థిక సంస్కరణలను (ఉదారవాద ఆర్థిక విధానాలను) అమలు చేసుకోవచ్చని" బడా పెట్టుబడిదారుల తరపున ఊపిరి పీల్చుకోవడం మనం చూసాం. కానీ ఆ రోజు వామపక్షాలు ఒత్తిడి వలనే గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి వచ్చాయన్న సంగతి మనం మర్చిపోగలమా?

గిరిజనుల, దళితుల, ప్రజల మధ్య చిచ్చుపెట్టే పని ఈరోజు ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్నది. ఇప్పటివరకు కలిసున్న, కలిసి తిన్న, మన మధ్య చిచ్చుపెట్టే పని చేస్తున్నది. సర్వమత సమ్మేళనంగా జరిగే ఈ మహా జాతరను కులం పేరుతో, మతం పేరుతో విచ్ఛిన్నం చేయజూస్తున్నది. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆదివాసులు, దళితులు, బడుగు బలహీన వర్గాలు తాము సహజ సిద్ధంగా జరుపుకొనే మహా వీరవనితల జాతరలో వీరి బ్రాహ్మణ జోక్యాన్ని నివారించాలి.

బడుగుల మహా జాతర సమ్మక్క సారక్క

ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరు నాగారం అడవుల్లోని ఆదివాసీ గూడాల్లో ఎగసిపడ్డ అగ్గిపిడుగులు సమ్మక్క సారక్కలు. కాకతీయ రాజుల పెత్తనంపై సివంగుల్లా తిరగబడ్డ యోధులు. వారి అమరత్వానికి గుర్తుగా ప్రజలు జరుపుకునే మహా ఉత్సవమే మేడారం జాతర. నేటి నుండి ఆ మహాజాతర ప్రారంభం కాబోతోంది. ఒక కుగ్రామమైన మేడారం ఈ రెండు రోజులు మహాజనసంద్రంగా మారుతుంది. ఆ వీరవనితల చారిత్రక పోరాటగాథను ముక్తకంఠంతో నినదిస్తుంది. 12వ శతాబ్దంలో శిస్తుల పేరుతో కాకతీయుల పీడనకు, పెత్తనాలకు వ్యతిరేకంగా సమ్మక్క, సారక్క, జంపన్న పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఆదివాసీల సంస్కృతి, ప్రాకృతిక సంస్కృతి. చనిపోయిన తాత ముత్తాతలను పూజించడం వారి సంప్రదాయం. అలాంటి సంప్రదాయంలో తమ జాతికోసం యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వారిని ఆదివాసులందరూ వీరులుగా కొలిచారు. నిత్యం వారి త్యాగాలను, తెగువను, చరిత్రను స్మరించుకున్నారు. తమ ముందు తరాలకు కథలుగా చెప్పడం ప్రారంభించారు. తమ భావితరాలు వారిలా తలవంచకుండా బతకాలని భావించి, వారి త్యాగాన్ని మించిన వేడుక లేదని ఒక మహా జాతర ప్రారంభించారు.

ఆదివాసుల సాంప్రదాయం ప్రకారం వారి వంశస్తులే పూజారులుగా వ్యవహరిస్తారు. సమ్మక్క సిద్దబోయిన ఆడబిడ్డ కనుక ఆ సిద్దబోయిన కుటుంబమే సమ్మక్క గద్దెల వద్ద ఇప్పటివరకు పూజారులుగా ఉన్నారు. సారక్క కాక ఇంటి వంశస్తురాలు, అందుకే కాక ఇంటి పేరు ఉన్నవారే సారక్క గద్దె వద్ద పూజారులుగా ఉన్నారు. ఈ సమ్మక్క సారక్కలకు పూజ ప్రాకృతికమైనది. విగ్రహారాధనకు పూర్తిగా సంబంధం లేనిది. కేవలం గద్దెలకు మొక్కడమే వీరి పద్ధతి. అందుకే చేను చెలక, చెట్టు చేమా, గొడ్డు గోదా వీరి దేవుళ్ళు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతే ఆదివాసుల దైవం. రెండేండ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి ముందు బుధ, గురు, శుక్రవారాలు పండుగ చేస్తారు. వారం రోజులపాటు అట్టహాసంగా కుల, మతాలకు వ్యతిరేకంగా ఈ జాతర జరుగుతుంది. సర్వమత సమ్మేళనంగా ఈ జాతర ఉంటుంది. బుధవారం రోజు కన్నెపల్లి గ్రామం నుంచి కుంకుమ భరిణి, కంక బంగు(వెదురు)ను సారక్కగా కాక వంశస్తులు తీసుకొని సాయంత్రం నాలుగు గంటల వరకు మేడారంలోని ఆమె గద్దెకు చేరుస్తారు. అదేరోజు కొత్తగూడ మండలం పోనుగండ్ల కామారం నుండి దాదాపు 100 కిలోమీటర్ల దూరం నుండి ఆదివారం ప్రారంభమై బుధవారం సాయంత్రం వరకు పగిడిద్దరాజుని మేడరానికి తీసుకొని వస్తారు. గురు వారం రోజున చల్లపేయను (పిల్లలు కనని ఆవు) బలి ఇచ్చి, ఇప్పపువ్వు సార తాగి చిలకల గట్టు నుండి సమ్మక్కను గురువారం రోజు గద్దెకు చేరుస్తారు. శుక్రవారం రోజున మొక్కులు అప్పజెప్పితే శనివారం ఆ తల్లులు గద్దెకు చేరుతారని ఆదివాసుల నమ్మకం. నిజానికీ 1950వరకు ఆ ప్రాంతానికే పరిమితమై ఈ జాతర ఉండేది. ఆ తర్వాత చుట్టూ పక్క గ్రామాలకు పాకింది. 1980 తరువాత ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ నుండి



ఎక్కువగా వచ్చే వారు. కాలక్రమేణా నాలుగు రాష్ట్రాల నుండి జనం తండోపతండాలుగా వస్తున్నారు. 2000 తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇతర రాష్ట్రాల నుండి కోటి మందికి పైగా ఈ జాతరకు వస్తున్నారు. రెండేండ్లకు ఓసారి జరిగే ఈ సమ్మక్క సారక్క జాతర ఆసియాలోనే అతిపెద్ద జాతరగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ జాతరలో బ్రాహ్మణ సమాజంలో ఉన్న ఉపవాసాలు, వెజిటేరియన్ భోజనాలు, ఆంక్షలు, వివక్షా పద్ధతులూ, ఆడవాళ్లు రావద్దు అనే పద్ధతులు ఏవీ ఉండవు. అంతేకాక ఫుడ్ డెమోక్రసీ ఉంటుంది. 'ఏదైనా తిను, ఏమైనా తాగు, అవి అయ్యాకే నన్ను దర్శనం చేసుకో' అనేది ఈ జాతర ప్రత్యేకత. కానీ క్రమేణా బ్రాహ్మణవాదులు ఈ జాతరను ఆవహిస్తున్నారు. రాజకీయాలకోసం, మతాధిపత్యం కోసం హిందుత్వ సంప్రదాయాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్నారు. హిందూ, ముస్లిములు కూడా ఈ జాతరకు వస్తారు. వారు ఎలా తింటారు, ఎలా ఉంటారనేది వాళ్ల ఇష్టం. కానీ కొత్తగా జాతరలో హలాల్ చేయొద్దని ఒక చర్చను కొత్తగా ఆర్‌ఎస్‌ఎస్ తీసుకొస్తున్నది. అందరూ కలిసి చేసుకునే జాతరలో కులాల, మతాల పేరుతో చిచ్చులు పెట్టే పని చేస్తున్నది. దాంట్లోకి ఆదివాసులను లాగే ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటివరకు ఏ కులం, ఏ మతానికి సంబంధం లేకుండా నడిచే ఈ జాతరను భ్రష్టు పట్టించే పని కి పూనుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం ఈ దేశంలో ఒకే దేవుడు ఉండాలి. కానీ ఈరోజు ఈ జాతరకు ఇంత మంది వస్తున్నారు కనుక దాన్ని కబ్జా చేసి హిందుత్వాన్ని చొప్పించాలనేది వారి ప్రయత్నం. అసలు ఆదివాసులు ఏ రకంగా హిందువులు అవుతారు. ఆదివాసులు ఒక తెగ. ఏ మతంతోనూ వారికి సంబంధం లేదు. కానీ ఈ ఆదివాసీ జాతరను హిందూ పండగగా మార్చాలని, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నం చేస్తున్నది. మరి సమ్మక్కని తీసుకొచ్చేటప్పుడు చల్ల పేయను బలిచ్చి తింటారు కదా! మరి వారు దాన్ని వీరు అంగీకరిస్తారా? విగ్రహారాధన ఉండదు. బ్రాహ్మణ మంత్రాలు ఉండవు...వీటిని ఆమోదిస్తారా? చిన జీయర్ స్వామి సమ్మక్క సారక్కలను విమర్శించినప్పుడు వీరు నోరు మెదుపలేదు. "సమ్మక్క సారక్క లేమన్నా బ్రహ్మలోకం నుండి దిగొచ్చారా... జాతర ఒక వ్యాపారం" అని ఆయన అన్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఏమీ మాట్లాడకుండా ఎందుకు నోరు మూసుకుంది? పైగా పరోక్షంగా మద్దతు ఇచ్చింది. గిరిజనుల, దళితుల, ప్రజల మధ్య చిచ్చుపెట్టే పని ఈరోజు ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్నది. ఇప్పటివరకు కలిసున్న, కలిసి తిన్న, మన మధ్య చిచ్చుపెట్టే పని చేస్తున్నది. సర్వమత సమ్మేళనంగా జరిగే ఈ మహా జాతరను కులం పేరుతో, మతం పేరుతో విచ్ఛిన్నం చేయజూస్తున్నది. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆదివాసులు, దళితులు, బడుగు బలహీన వర్గాలు తాము సహజ సిద్ధంగా జరుపుకొనే మహా వీరవనితల జాతరలో వీరి బ్రాహ్మణ జోక్యాన్ని నివారించాలి.



బీరెడ్డి సాంబశివ
9490300329

'తెలుగు'కు ఏది వెలుగు?



మేకిరి దామోదర్
9573666650

ప్రపంచంలో నేడు సృజనకు, వినూత్నతకు పట్టం కడుతున్న వేళ.. ఈ సృజన, వినూత్నత ఎక్కడి నుంచి వస్తుంది? మాతృభాష బతికితేనే సృజన పుడుతుంది, వినూత్నత విచ్చుకుంటుంది. విద్యా, విజ్ఞానం వాటి నుంచి విరాజిల్లుతుంది. ఇది పరిశోధనలో తేలిన శాస్త్రీయతే కదా!. దీనిని కాదనగలరా? మాతృభాష అంటే వట్టి అక్షరాల పోగు కాదు. తల్లి పేగు నుంచి గర్భస్థ శిశువుకు ప్రాణధార ఎలా ప్రవహిస్తుందో, తల్లి భాష నుంచి మనిషికి జ్ఞానధార అలానే సంక్రమిస్తుందనేది శాస్త్రీయంగా రూఢీ అయింది. అలాంటి మాతృభాష పరిరక్షణ కోసం కొందరు యువకులు ప్రాణాలర్పించిన "ఫిబ్రవరి 21వ తేదీని" ఐక్య రాజ్యసమితి సాంస్కృతిక విభాగమైన యునెస్కో" అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా" ప్రకటించింది. ప్రపంచంలో ఆంగ్లభాష అనే రోడ్డురోలర్ కింద పడినలిగిపోతున్న మాతృభాషలెన్నో..! భాష అనేది ఆ జాతికి తల్లి వేరు అని యునెస్కో గుర్తించింది. ఏ మాతృభాష అంతరించినా మానవ మేధలో కొంత భాగం అంతరించినట్లే. అంతేకాదు ఆ జాతి సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి అనేక వెలకట్టలేని రూపాలైన ఆచార వ్యవహారాలు, సామెతలు, నానుడులు, చమత్కారాలు, జాతీయాలు, మౌఖిక, లిఖిత ఆ ప్రాంత సమాచార సంగతులు సర్వం అంతరించిపోతాయి. "మాతృభాష కన్నయితే ఆంగ్ల భాష కళ్లజోడు" లాంటిది. అసలు కళ్లుంటే? కదా కళ్లజోడుతో పని పడేది. నేడు ఆధునిక వైద్యశాస్త్రం నవజాత శిశువుకు తల్లిపాలు తప్పనిసరి తాగించాలి, బొడ్డు (పేగు) తాడు మూలకణాల్ని భద్రపరిస్తే భవిష్యత్తు ఆపత్కాలంలో ఎనలేని మేలు జరుగుతుందని చెబుతుంది. అలాగే ఆయా జాతులకు జీవనాడి, సంస్కృతికి, మూల కణాలకు, సహజ వికాసానికి మారుపేరైన మాతృభాషను ఇంతగా నిర్లక్ష్యం చేయరాదు. మాతృభాషలో బోధన జరపడం అంటే పరభాషను నేర్చుకోవద్దని కాదు. ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలో తప్పనిసరి చేసి, ఉన్నత విద్యలో తెలుగును ఒక విషయంగా ఉంచినప్పుడే భాష మనుగడలో ఉండగలదు. ఆ తరువాత ఎన్ని భాషలు అయినా నేర్చుకోవచ్చు. రాజ్యాంగంలో పొందుపరచుకున్నట్లు మాతృ భాషలను రక్షించుకుంటూ అన్యభాషలు నేర్చుకుందాం. అంతే కాదండోయ్ ప్రపంచంలో సొంతభాషను నమ్ముకుని అభివృద్ధి చెందిన దేశాలు జపాన్, చైనా, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ లాంటివి వారి వారి మాతృభాషల్లోనే విశ్వ విద్యాలయ స్థాయి వరకూ విద్యాబోధనాభ్యాసన చేస్తున్నారు. పాలనలోనూ అవే భాషలను ఉపయోగిస్తూ ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన వారి చిత్తశుద్ధి నుంచి స్ఫూర్తి పొందాల్సి ఉంది. ప్రపంచీకరణ ముసుగులో ఆంగ్ల మాధ్యమాన్ని అద్దాల మేడలో చూపిస్తూ మాతృభాషను పురిటి నొప్పులకు గురిచేస్తున్న కార్పొరేట్‌శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాలపై, సమాజం పైనే ఉంది. మాతృభాషను మృతభాషగా మారడానికి ముమ్మాటికీ ప్రభుత్వాలు, చదువుకున్న తెలుగు సమాజం, మానవ నిర్లక్ష్యమే కారణం. చదువుకోని జనం నాల్కలపై నడయాడిస్తూ భాషను బతికిస్తున్నారు. ఆధునిక ప్రపంచీకరణ యుగంలో పేదోడి పిల్లలకేమో మాతృభాష మాధ్యమంలో బోధన, పెద్దోడి పిల్లలకేమో ఆంగ్ల చదువులు అనే భేదాభిప్రాయాలు పొడచూపుతున్నాయి. అందుకే పాలకులు పేదోడి పిల్లలైనా, పెద్దోడి పిల్లలైనా ఒకే పాఠశాలలో చదివేలా విద్యా విధానంలో సమూల మార్పులు చేయాలి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యలోనైనా, సర్కారు బడిలోనైనా మాతృభాష తప్పనిసరి చేయాలి. ఏ రాష్ట్రంలోనైనా ఏ దేశంలోనైనా ప్రపంచంలో ఎక్కడైనా ఏ మాతృభాషకైనా పెను ప్రమాద సంకేతా నికి కారణం అది మాట్లాడే వారి సంఖ్య క్రమేపి తగ్గిపోతుండటం వల్లనే. భావ వ్యక్తీకరణకు మాతృ భాషను సాధనంగా వినియోగించే వారు తగ్గిపోతుంటే? ఆ భాష ఉనికికే పెను ప్రమాదం పొంచి ఉంది. అలాగే నెమ్మదిగా నశించి పోతుంది. అలా భారత్‌లో 1961 నాటికి 1652 భాషలు వినియోగంలో ఉండేవి. 2011 నాటికి అందులో 280 పైగా అంతరించిపోయాయి. మాట్లాడే వారి సంఖ్య నానాటికి తగ్గడం వల్ల తెలుగు కనుమరుగయ్యే ముప్పు పొంచి ఉందని భాషా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఐదు దశాబ్దాల పాటు దేశంలో అత్యధికులు మాట్లాడే భాష జాబితాలో తెలుగు మూడో స్థానంలో కొనసాగేది. నేడది హిందీ, బెంగాలీ, మరాఠీల తర్వాత నాలుగో స్థానానికి పరిమితమైంది. సైబర్ శకం, డిజిటల్ యుగంలో భాషలు మరింత వేగంగా ప్రాధాన్యం కోల్పోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏకత్వంలో భిన్నత్వానికి, సాంస్కృతిక వైవిధ్యానికి నెలవైన భారతావనిలో భాషలు మన ఘన వారసత్వానికి ప్రతీకలు. ఆసంపదే నాగరికతకు గట్టి పునాది. అది ఇప్పుడు బీటలు వారుతోంది!.



మన దేశ జనాభాలో తెలుగు మాట్లాడేవారు 1971 నాటికి 8.16శాతం ఉండేవారు. నాలుగు దశాబ్దాలలో 6.7 శాతానికి పడిపోయారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మాతృభాషపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అందువల్ల పతన కొనసాగుతూనే ఉందన్న ఆందోళన మాతృభాష అభిమానులలో పెరిగిపోతోంది. ఎందుకింతటి దుస్థితి దాపురించింది?. అమ్మ భాషను పాఠశాల గుమ్మంలోనే వదిలి పెట్టాల్సి వస్తున్న దురవస్థ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను చావు దెబ్బతీస్తుందంటూ జాతీయ సాధన సర్వే (నాస్), అసర్-2023 లాంటి సర్వేలు సమస్య మూలాలను స్పృశించాయి. మాతృభాషలో పట్టులేని వారు ఇతర భాషల్లోని నైపుణ్యాలు ఒడిసి పట్టలేరన్న నిజాన్ని పరభాష మోజులో పడి మనవారు గుర్తించడం లేదు. ఇది "అంధుడికి అద్దం ఇవ్వడం లాంటిదే" అన్న మేధావుల హెచ్చరికలను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు, ఆంగ్లంలో చదివితేనే తమ పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్న తల్లిదండ్రుల భావన చాలామందిని ఆంగ్లభాష వైపు మళ్లిస్తుంది. అన్నింటా మాతృభాష వినియోగం పెరిగితేనే కాపాడుకోగలం. దీనికి ప్రభుత్వాలే విశేషకృషి, ప్రాధాన్యత కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ నియామకాల్లో అమ్మ భాషకు, తెలుగు మాధ్యమానికి పెద్దపీట వేయాలి. మన తెలంగాణ ప్రభుత్వం శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల్లో తెలుగు వినియోగాన్ని పెంపొందిం చడానికి గట్టి కృషి చేయాలి. తేనెలొలికే తెలుగు రుచిని పసినాలుకలకు పంచి, వారిలో మాతృభాషపై అనురక్తిని పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులు అందిపుచ్చు కోవాలి. తెలుగు గడ్డపై అమ్మ భాషకు ప్రాణప్రతిష్ట చేయడానికి ఆధునిక సాంకేతిక ఉపకరణాల్లో తెలుగును వాడటానికి ఉపయోగపడేలా ఆధునికరించే కృషి తక్షణమే చేపట్టాలి. తెలుగును ప్రపంచ భాషగా గుర్తించేలా ఆధునీకరించాలి. సాంకేతిక నిపుణులు, భాషావేత్తలు, పాలకులు, తెలుగుజాతి చిత్తశుద్ధితో కృషిచేయాలి. ఏ భాషైనా వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం ద్వారానే అభివృద్ధి చెందుతుంది. ప్రతి ప్రభుత్వ శాఖలో, పాలన, న్యాయ, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలన్నీ తెలుగులోనే జరగాలి. తెలుగు మాధ్యమాలు చదివేవారికి సరియైన భవిష్యత్తు, ప్రత్యేక అవకాశాలు కల్పించబడాలి. అప్పుడే తెలుగుభాష వెలుగొందుతుంది.

అమ్మ భాషను పాఠశాల గుమ్మంలోనే వదిలి పెట్టాల్సి వస్తున్న దురవస్థ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను చావు దెబ్బతీస్తుందంటూ జాతీయ సాధన సర్వే (నాస్), అసర్-2023 లాంటి సర్వేలు సమస్య మూలాలను స్పృశించాయి. మాతృభాషలో పట్టు లేని వారు ఇతర భాషల్లోని నైపుణ్యాలు ఒడిసి పట్టలేరన్న నిజాన్ని పరభాష మోజులో పడి మన వారు గుర్తించడం లేదు. ఇది "అంధుడికి అద్దం ఇవ్వడం లాంటిదే" అన్న మేధావుల హెచ్చరికలను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు, ఆంగ్లంలో చదివితేనే తమ పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్న తల్లిదండ్రుల భావన చాలామందిని ఆంగ్ల భాష వైపు మళ్లిస్తుంది. అన్నింటా మాతృభాష వినియోగం పెరిగితేనే కాపాడుకోగలం. దీనికి ప్రభుత్వాలే విశేష కృషి, ప్రాధాన్యత కల్పించాల్సి ఉంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
బుధవారం ఫిబ్రవరి 21, 2024 www.navatelangana.com



విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం సిరిపురం (కేజి) ఉన్నత పాఠశాల నందు గ్రామ వాస్తవ్యులు (గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్న) యస్.కె లతీఫ్ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను వైరా సబ్ ఇన్స్పెక్టర్ వంశీ క్రిష్ణా బాగ్యరాజ్ చేతుల మీదుగా అందించారు. అనంతరం సబ్ ఇన్స్పెక్టర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్య కుమారి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు యమ్.డి ముజీబ్, పద్మావతి, సురేష్, ఉప్పెంద్రయ్య, వస్త్రం, వెంకటేశ్వరరావు, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, అమరం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలో న్యూలక్ష్మీపురం 33/11 కెవి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు తొలగింపు, విద్యుత్తు లైన్లో మరమ్మతులు ఉన్నందున బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల పరిశ్రమ, రైతులు, గృహ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

తీర్థాల జాతర ఏర్పాట్లపై నేడు సమావేశం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయంలోనిర్వహించనున్న జాతర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో బుధవారం సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాంప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమన్వయ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

కోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు

మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు

నవతెలంగాణ -ఎర్రుపాలెం

గత కొన్ని సంవత్సరాల నుండి మధిర కోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ఎదురు చూస్తున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఈ ప్రాంత వాసులకు నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోర్టు నిర్మాణానికి 24 కోట్ల రూపాయలు మంజూరు చేయడం అభినందనీయమని ఎర్రుపాలెం మండలానికి చెందిన మదిర కోర్టు న్యాయవాది గంధం శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు లోపే మధిర భార్ అసోసియేషన్ న్యాయవాదులకు ఇచ్చిన హామీని మల్లు భట్టి విక్రమార్క మాట నిలబెట్టుకొని మాట తప్పని నాయకుడిగా మరోసారి ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. మధిర కోర్టు భవనాల సముదాయానికి 24 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం భట్టి విక్రమార్క చేసిన కృషిని అభినందించారు.

వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలిపిన సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదంతో మరోసారి రాజ్యసభకు ఎన్నిక కాబోతున్న వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వద్దిరాజుకు మళ్లీ అవకాశం కల్పించడంపై ఈ సందర్భంగా కేసీఆర్‌కు సండ్ర కృతజ్ఞతలు తెలిపారు. సండ్రతో పాటు పెనుబల్లి మండల బీఆర్ఎస్ నాయకులు పసుమర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు...

సునీతరాయ్‌ని కలిసిన కాంగ్రెస్ మహిళానేత రజియా

నవతెలంగాణ-సత్తుపల్లి

తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరాయ్‌ని ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో సత్తుపల్లి మండల కాంగ్రెస్ మహిళా నాయకురాలు షేక్ రజియా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనతో పాటు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య పాల్గొన్నారని రజియా తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా తమని సునీతరాయ్ కోరారని రజియా చెప్పారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండల సమస్యలు, భాగ్యనగర్‌తండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుగులోత్ హర్షనాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆయను కలిసిన గ్రామస్తులు గ్రామపంచాయతీ అభివృద్ధి పనులపై వివరించారు. కారేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, 30 పడకల ఆసుపత్రి, అంబులెన్స్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. భాగ్యనగర్‌తండా, సామ్యాతండా, లావుడ్యాతండాలలో మంచినీటి బోర్లు, సశ్మాన వాటికలు నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యువజన కాంగ్రెస్ మండల నాయకులు గుగులోత్ రాజేష్ నాయక్, లావుడియా రాజ్‌కుమార్, వాంకుడోత్ రాంబాబు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి హాజరుకానున్న ఉద్యమనేత

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో బుధవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ జయంతికి తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పోడు ఉద్యమనేత భూక్యా వీరభద్రం హాజరుకానున్నట్లు గిరిజన సంఘంమండల అధ్యక్షకార్యదర్శులు అజ్మీర శోభన్‌నాయక్, బానోత్ బస్సీలాల్ లు తెలిపారు. బంజార గిరిజనులలో చైతన్యం నింపి ఐక్యతకు పాటుపడిన సంత్ సేవాలాల్ ఆదర్శపురుషుడని సేవాలాల్ జయంతిలో గిరిజన సంఘం పాల్గొంటుందన్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి దిశగా ఎదగాలి

- సెర్ప్ ఖమ్మం డీపీఎం శ్రీనివాస్

నవతెలంగాణ-సత్తుపల్లి

స్వయం సహాయక సంఘాల్లో ఉండే మహిళలు ఆర్థిక నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడం ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ (పేదరిక నిర్మూలన సంస్థ) ఖమ్మం డీపీఎం శ్రీనివాస్ (డీఆర్డీఏ) అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో లఖ్‌పత్ దీదీ పథకంపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాస్‌తో పాటు ఏపీఎం నాగపుల్లారావు స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఎంఎస్ కార్యదర్శి డి సరోజిని అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం కేవీ సుబ్బారావు, డ్వాక్రా ఈవో తలశీల రత్నకుమారి, డీఎంజీ ఎస్ జనార్ధనరావు, సీసీలు పి రామారావు, ఎం శ్రీనివాస్, పి కృష్ణయ్య, ఎన్ నరేంద్ర, స్త్రీశక్తి మేనేజర్ చంటి, ఎంఎస్‌ఏ ఇందిర, సీవో బాబూరావు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు

ఏకగ్రీవంగా ఎన్నిక

అమరవీరుల స్థూపానికి నివాళి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి నుంచి ధ్రువీకరణ పత్రం మంగళవారం అందుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రంలోని బడుగు, బలహీన, బీసీ వర్గాల అభివృద్ధి అని పేర్కొన్నారు. బీసీలను రాజకీయంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నత అవకాశాలు కల్పించారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగుజాడల్లో తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం నిత్యం కృషి చేస్తానని వద్దిరాజు రవిచంద్ర అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఇతర ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ రద్దు

- 'బంధం' కోరిక తీరకుండానే మధ్యలోనే పదవి గండం
- మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సూరంశెట్టి ?

నవతెలంగాణ - బోనకల్





మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మధిర మండలం మర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలను రెండు రోజుల క్రితం రద్దు చేస్తూ జీవో విడుదల చేసింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించబడిన బోనకల్ మండలంలోని ముష్టికుంట గ్రామానికి చెందిన బంధం శ్రీనివాసరావుకి మధ్యలోనే పదవి గండం ఏర్పడింది. దీంతో అతని చిరకాల కోరిక తీరకుండానే మిగిలిపోయింది. మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల నుంచే చైర్మన్ పదవిని భర్తీ చేయవలసి ఉంది. ఈ మూడు మండలాల పరిధిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన సూరంశెట్టి కిషోర్ గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడిగా ఉంటూ వస్తున్నారు. కిషోర్ తండ్రి నాగభూషణం గతంలో కాంగ్రెస్ మధిర మండల జడ్పిటిసిగా పని చేశారు. కిషోర్ కుమార్ కుటుంబం ప్రారంభం నుంచి కాంగ్రెస్‌లోనే ఉంటూ వస్తుంది. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కిషోర్ అత్యంత ఆప్తుడు. పది సంవత్సరాల పాటు కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా కిషోర్ కాంగ్రెస్‌ను అంటిపెట్టుకొని మధిర మండలంలో కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ వచ్చారు. నాలుగుసార్లు భట్టి విక్రమార్క గెలుపులోను మధిర మండలంలో విశేషమైన కృషి చేశారు. దీంతో కిషోర్‌కు మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కనున్నట్లు తెలిసింది. ఇప్పటికే కిషోర్ పేరును ఖరారు చేశారని, అధికారికంగా ప్రకటించవలసి ఉందని కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న వినికిడి. ఈ మూడు మండలాల పరిధిలో కాంగ్రెస్‌కు మండల స్థాయిలో బలమైన బీసీ నాయకుడు కూడా లేకపోవడంతో కిషోర్‌కు మరింత కలిసి వచ్చే అంశంగా మారింది. మధిర నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులలో పెద్ద పదవి ఇదే. నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో అగ్రకుల సామాజిక వర్గంలోనే ఎక్కువ మంది నాయకులు ఉన్నారు. మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో కిషోర్‌కు మరింత కలసి వచ్చింది. కిషోర్ మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో బీసీ సామాజిక వర్గాలలో బలమైన నాయకుడు కావడంతో పాటు బట్టి విక్రమార్క, నందిని దంపతులకు నమ్మిన బంటుగా ఉండటంతో కిషోర్‌కు బాగా కలిసి వచ్చే అంశాలని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో బీఆర్ఎస్‌లో చేరితే మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తామని కిషోర్‌కి బిఆర్ఎస్ నాయకులు మధిర పోలీస్ అధికారి ద్వారా రాయబారం పంపారు. ఉద్యోగం చేయడానికి వచ్చిన వాడిని ఉద్యోగం చేసుకో రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేసి పంపించి వేసినట్లు ఆనాడు జోరుగా ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ప్రకటించింది. మధిరను మొదటి సంవత్సరం జనరల్‌కు, రెండు, మూడు, నాలుగు సంవత్సరాలను బీసీ జనరల్‌కు 5వ సంవత్సరాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. మార్కెట్ కమిటీల పదవీ కాలాన్ని ఏడాది కాలం పాటుకే కుదించారు. మొట్టమొదటి చైర్మన్‌గా ఎర్రుపాలెం మాజీ జెడ్పిటిసి చావా రామకృష్ణ వ్యవహరించారు. రెండవ చైర్మన్‌గా మధిర మండల పరిధిలోని ఇల్లూరు గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన చిత్తారు నాగేశ్వరరావుకు దక్కింది. ఏడాది కాలం పూర్తి చేసిన తర్వాత రెండు దఫాలుగా నాగేశ్వరరావు పదవీ కాలాన్ని ఆరు నెలల చొప్పున పొడిగించారు. ఆ తర్వాత బోనకల్ మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన బంధం శ్రీనివాసరావుని మూడోసారి ఈ పదవి వరించింది. 2023 జూలై 4న మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బంధం శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాది పాటు ఈయన పదవిలో ఉండాలి. ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు ఎదురైన గురువు కొండబాల కోటేశ్వరరావు అనుగ్రహంతో తన చిరకాల కోరిక అయినా మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని పొందాడు. కానీ పాపం అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో బంధం శ్రీనివాసరావుకి మధ్యలోనే పదవీ కాండం ఏర్పడింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నియమించబడిన వ్యవసాయ మార్కెట్ కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతోపాటు పాలకవర్గం పదవీ కాలాన్ని ఏడాది నుంచి రెండు సంవత్సరాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెంచింది. దీనికి తోడు ఆరేసి నెలల చొప్పున రెండుసార్లు పదవీ కాలాన్ని పెంచుతూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం చైర్మన్‌గా నియమించబడిన వ్యక్తి మూడు సంవత్సరాలు పాటు ఆ పదవుల్లో ఉండే అవకాశం ఏర్పడింది. ఏడాది పాటు పదవిలో ఉండవలసి ఉండగా కేవలం 7 నెలల పది రోజులు మాత్రమే బంధం శ్రీనివాసరావు పదవిలో ఉన్నాడు.

ఇవీ నూతన మార్గదర్శకాలు..

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశు గణాల మార్కెట్ల చట్టం 1966 సెక్షన్-5(1), ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతి మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటవుతుంది. 12 మంది రైతులతో పాలకవర్గం ఏర్పాటు అవుతుంది. పాలకవర్గంలో మార్కెట్ కమిటీ పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయోత్పత్తిదారులు ఉంటారు. పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక (మైనార్టీ) వర్గాలు, మహిళలై ఉండాలి.

చైర్మన్, వైస్ చైర్మన్ నియామకం ఇలా....

కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఎక్స్ అఫీషియో సభ్యులుగా నలుగురు ఉంటారు. మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్ లేదా సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒకరిని నియమిస్తారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల్లో ఒకరు సభ్యులుగా ఉంటారు. మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్, మున్సిపల్ చైర్పర్సన్ లేదా గ్రామ సర్పంచ్‌లలో ఒకరిని సభ్యులుగా నియమిస్తారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం మార్కెట్ కమిటీలు ఏర్పాటు కానున్నాయి.

మతోన్మాద బీజేపీని తరిమికొట్టాలి

- లెనిన్ వర్ధంతిసభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

నవతెలంగాణ-ముదిగొండ



రష్యా దేశంలో తొలి సోషలిస్ట్ ప్రభుత్వం ఏర్పాటు చేసి సామ్రాజ్యవాద దేశాలకు దీటుగా రష్యాను అభివృద్ధి పథంలో నడిపిన మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ రష్యా ఉక్కు నిర్మాతని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. లెనిన్ 100వ(శత)వర్ధంతిని ముదిగొండ మచ్చా వీరయ్య కార్యాలయంలో ముదిగొండ గ్రామ శాఖ(2) కార్యదర్శి ఇరుకు నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ ఉక్కు పరిశ్రమతో పాటు భారతదేశంలోని పలు ఉక్కు కర్మాగారాలు, లెనిన్ నేతృత్వంలో ఏర్పాటుకు రష్యా సహకారం అందించిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మూడవసారి అధికారం కోసం ప్రధాని మోదీ రాముని ప్రాణ ప్రతిష్ట చేసి లబ్ది పొందాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కావాలని ఢిల్లీ పురవీధుల్లో రైతులు చేస్తున్న ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం ఎస్మా నిర్బంధాన్ని ప్రయోగించడం సిగ్గుచేటు అన్నారు. మతతత్వాన్ని ప్రజల్లో పెంచి పోషిస్తున్న మతవాద బిజేపీను తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బండి రమేష్, జిల్లా నాయకులు బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వైస్‌ఎంపిపి మంకెన దామోదర్, మండల నాయకులు మందరపు వెంకన్న, పద్మావతి, టిఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, బట్టు రాజు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-వైరాటౌన్



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కోటా ప్రేమ్ కుమార్ తెలియజేశారు. మంగళవారం మధు విద్యాలయంలో పదవి తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మధు విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రం మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాన్ని, విద్యార్థులకు అభినందించారు. విద్యార్థులు పరీక్ష కాలంలో ధైర్యంగా చదువుతూ ముందడుగు వేయాలని, సృజనాత్మకత జ్ఞాన సంపదను పెంచుకుంటూ పరీక్షలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే తొలి అడుగు పదో తరగతి విద్యార్థులు టాలెంట్ టెస్ట్ పరీక్షను ఉపయోగిం చుకొని మంచి మార్కులు సాధించడంతోపాటు సమాజానికి ఉపయోగపడే జ్ఞానాన్ని సంపాదించాలని, ఈ పరీక్షలలో ప్రైజ్ మనీతో పాటు విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు గుర్తింపు వచ్చే విధంగా విద్యార్థులు అందరూ పరీక్షలలో కృషి చేయాలని కోరారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు నినాదాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అధ్యయనం, పోరాటం బాటలో నడవాలని విద్యార్థులను కోరారు. దేశ భవిష్యత్తు మన భవిష్యత్తుగా భావించి బాధ్యతగా సమాజం పట్ల అంకిత భావంతో మానవాళిని ముందుకు తీసుకెళ్లే శక్తిగా విద్యార్థులు తయారవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వేమూరి అజయ్, నాయకులు నాగరాజ్, విక్రాంత్, రాహుల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ తిరుపతిరెడ్డికి శుభాకాంక్షలు

నవతెలంగాణ - ఖమ్మంరూరల్



ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణపురంలోని ఏసీపీ కార్యాలయంలో సీపీఐ, కాంగ్రెస్ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సాధిక్ అలీ, కాంగ్రెస్ టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి, బోడా వెంకన్న, హరినాయక్, శ్రీనునాయక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు తరుపున చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండల పరిధిలోని జలగంనగర్‌కు చెందిన సతీశ్ ఇటీవల మున్నేరు వరదల్లో మృతిచెందగా, ముత్తగూడెంకి చెందిన మునేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతులు బీఆర్ఎస్ పార్టీ సభ్యులు. పార్టీ తరుపున మంజూరయిన బీమా చెక్కులను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు గోపాల్ బాధిత కుటుంబాలకు మంగళవారం అందజేశారు. ఒక్కో కుటుంబానికి మంజూరయిన రూ. 2 లక్షల చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మలుపులు తిరుగుతున్న సొసైటీ సీఈవో తొలగింపు వ్యవహారం

- బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన తిరుమలరావు కాంగ్రెస్ వర్గం సభ్యులు
- సొసైటీ పాలకవర్గం సమావేశంలో తీవ్ర వాగ్వివాదం
- తీర్మానం పెట్టేందుకు సీఈఓ నిరాకరణ
- ప్రేక్షక పాత్రలో సొసైటీ అధ్యక్షుడు
- సమావేశాన్ని బహిష్కరించిన కాంగ్రెస్, సిపిఐ డైరెక్టర్లు
- నిలిచిపోయిన సీఈఓ తొలగింపు వ్యవహారం
- డిసిఓని కలవాలని మెజార్టీ డైరెక్టర్లు నిర్ణయం

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో తొలగింపు వ్యవహారం పలు మలుపులు తిరుగుతుంది. సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సీఈవో చేపూరి నాగరాజుని తొలగించాలని ఇటీవల పాలకవర్గం సభ్యులు కొంతమంది జిల్లా సొసైటీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి సొసైటీ పాలకవర్గం సమావేశం మంగళవారం బ్రాహ్మణపల్లి సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 12 మంది సొసైటీ పాలకవర్గం సభ్యులు ఉండగా ఒకరు మృతి చెందారు. దీంతో 11 మంది పాలకవర్గం సభ్యులుగా ఉన్నారు. ఆనాడు ఈ సొసైటీ ఏకగ్రీవంగా అయింది. టిఆర్ఎస్‌కు నలుగురు, సిపిఐకి ఇద్దరు, కాంగ్రెస్‌కి నలుగురు, సిపిఎంకు ఒకరు చొప్పున సొసైటీ డైరెక్టర్లుగా ఉన్నారు. బ్రాహ్మణపల్లి సొసైటీ పరిధిలో రాపల్లి గ్రామం కూడా ఉంది. సొసైటీ ప్రెసిడెంట్‌గా రాపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్‌కు చెందిన గంగసాని రాఘవరావు ఎన్నికయ్యారు. బ్రాహ్మణపల్లి సొసైటీ ఎన్నికల నాటికి ముందు సిఈఓగా ఉన్న వ్యక్తిపై పలు అవినీతి ఆరోపణలు ఉండటంతో తొలగించారు. కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత తాత్కాలికంగా అదే గ్రామానికి చెందిన బ్రాహ్మణపల్లి బీఆర్ఎస్ ఎంపీటీసీ చేపూరి సునీత భర్త చేపూరి నాగరాజుని నియమించారు. ఇంతవరకు కథ బాగానే ఉంది. సొసైటీ ఎన్నికల సమయంలో రాపల్లి తాజా మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ నాయకుడు మందడపు తిరుమలరావు ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరాడు. దీంతో కథ మలుపు తిరిగింది. కాంగ్రెస్‌కు చెందిన నలుగురిలో ఇద్దరు సభ్యులు రాపల్లి గ్రామానికి చెందినవారు. తోట వెంకటేశ్వర్లు, గొల్లమందల కృష్ణవేణి తిరుమల్‌రావు వర్గంగా ఉంటున్నారు. సీఈవో చేపూరి నాగరాజుని తొలగించాలంటూ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 11 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే కాంగ్రెస్‌కు చెందిన ఉపాధ్యక్షుడు గంగసాని రాఘవరావు తో పాటు సిపిఐ లకు చెందిన డైరెక్టర్లు నాగరాజుని తొలగించాలని తీర్మానం ప్రవేశపెట్టాలని పట్టుబట్టారు. తీర్మానం పెట్టవద్దని బిఆర్ఎస్‌కు చెందిన సొసైటీ డైరెక్టర్ పెనుగొండ ఏడుకొండలు, తీర్మానం రాయనని సీఈవో నాగరాజు స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్, సిపిఐలకు చెందిన డైరెక్టర్లతో బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సిపిఎంకి చెందిన డైరెక్టర్ ఇరు వర్గాలకు మద్దతు ఇవ్వకుండా తటస్థంగా ఉండిపోయారు. రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరుగుతున్న ఏనుగు నాగేశ్వరరావు స్పందించకుండా ప్రేక్షక పాత్ర నిర్వహించారు. తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్, సిపిఐ వర్గం పట్టుబడుతుండగా పరిస్థితి చేయి దాటి పోతుండటంతో తిరుమలరావు వర్గానికి చెందిన బెజవాడ వెంకటేశ్వరరావు, తోట ప్రసాద్, చింతపట్ల నరేష్ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తిరుమల రావుకు చేరవేస్తున్నారు. సొసైటీతో ఎటువంటి సంబంధం లేని, పాలకవర్గ సభ్యులుగా కానీ తిరుమల్‌రావు వర్గానికి చెందిన తోట ప్రసాద్, బెజవాడ వెంకటేశ్వరరావు, చింతపట్ల నరేష్ సొసైటీ వద్దే తిష్ట వేసి వేసి ఉండటం విశేషం. అక్కడ జరుగుతున్న పరిణామాలను తిరుమలరావుకి వీరు చేరవేస్తూ ఉండగా, తిరుమలరావు వారికి తగు సూచనలు చేస్తూ నడిపించారు. పరిస్థితి చేయి దాటి పోతుండటంతో కాంగ్రెస్‌కు చెందిన మందడపు తిరుమలరావు వర్గానికి చెందిన ఇద్దరు తోట వెంకటేశ్వర్లు, గొల్లమందల కృష్ణవేణి సమావేశం నుంచి అర్ధాంతరంగా బయటకు వెళ్లిపోయారు. తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్, సిపిఐ డైరెక్టర్లు పట్టుబడుతుండగా ఒక్కసారిగా కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లు సమావేశం నుంచి బయటికి వెళ్లిపోవడంతో కాంగ్రెస్‌కు చెందిన మిగిలిన సొసైటీ డైరెక్టర్లు కంగుతిన్నారు. సీఈవో నాగరాజుకు మద్దతుగా కాంగ్రెస్ డైరెక్టర్లు నిలబడటంతో సమావేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కొద్దిసేపు తీవ్ర వాగ్వివాదం అనంతరం మిగిలిన కాంగ్రెస్ డైరెక్టర్లు, సిపిఐ డైరెక్టర్లు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. దీంతో సీఈఓ సమస్య ఎటు తేలకుండా ఆగిపోయింది. సమావేశ అనంతరం డిసిఓని కలుద్దామని నిర్ణయించుకొని అందరూ వెళ్లిపోయారు. సీఈఓని తొలగించే విషయంలో తిరుమలరావు వర్గానికి చెందిన కాంగ్రెస్ డైరెక్టర్లు బీఆర్ఎస్‌కు చెందిన సీఈఓకి మద్దతుగా నిలబడి మరోసారి తిరుమలరావు రాజకీయాలలో తనదైన విచిత్రమైన ముద్ర వేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకవైపు బీఆర్ఎస్ మేయర్లు, చైర్‌పర్సన్‌లపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానాలు పెట్టి పదవి నుంచి తొలగిస్తున్న సమయంలో బోనకల్లు మండలంలోని బ్రాహ్మణపల్లి సొసైటీ పరిధిలో మాత్రం బీఆర్ఎస్‌కు చెందిన సీఈఓకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మద్దతుగా నిలవడం సంచలనంగా మారింది.

నవతెలంగాణ
6
ఖమ్మం
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

28న మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

- రూ. 181 కోట్లు బడ్జెట్ పై చర్చ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బడ్జెట్‌ను ఆమోదించేందుకు ఈనెల 28న సమావేశ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి చర్చించగా...తాజాగా నగర మేయర్ పునుకొల్లు నీరజతోనూ అధికారులు చర్చించినట్లు తెలిసింది. ఈ.మేరకు రూ. 181 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

తెలంగాణ రాష్ట్రంలో అతి వెనుకబడిన కులాలను గుర్తించి కుల గణన తీర్మానం అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ...హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు సైదా ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పాలకులు ముస్లిం సమాజంలో బీసీ ఈలో ఉన్న అతి వెనుకబడ్డ ముస్లిం కులాలను సామాజికంగా, ఆర్థికంగా విద్యా ఉపాధి రాజకీయంగా అభివృద్ధికి నోచుకోలేని సంచార ముస్లిం కులాలను ఎదగనివ్వకుండా అన్యాయం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుల గణనాలతో అన్ని కులాల వారు సామాజిక రాజకీయంగా ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కాశ్మీర్ మహాదేవ క్షేత్రం చైర్మెన్‌గా మాడిశెట్టి వెంకటేశ్వరరావు ఎన్నిక

నవతెలంగాణ-కల్లూరు



కల్లూరు మండల పరిధిలోని పుల్లయ్య బంజర కాశ్మీర మహా క్షేత్రంగా శివాలయం (కల్లూరు అప్పయ్య) చైర్మెన్‌గా మాడిశెట్టి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఎన్నిక నిర్వహించారు. చైర్మెన్‌గా మాడిశెట్టి వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్స్‌గా ఎస్సీ నుండి కందుల జోజీ, ఎస్టీ నుండి ఎర్రబడి నాగమణి, ఓసి నుండి అబ్బూరి యుగంధర్, బీసీ నుండి బుర్రి లక్ష్మయ్య, పెద్దబోయిన శివకృష్ణ, తిరుమలగిరి లక్ష్మయ్య, రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన చైర్మెన్ మాడిశెట్టి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య బంజర నాయకులు పెద్దబోయిన నరసింహారావు, వెంకటేశ్వరరావు, కిష్టంశెట్టి కొండలు, రంగు లక్ష్మణరావు, బోబోలు కృష్ణయ్య, జక్కు కృష్ణయ్య, రాచబంటి శీను, బందెల కృష్ణయ్య, తండు రాములు, బుర్రి వీరయ్య, మాడిశెట్టి శీను, తదితరులు పాల్గొన్నారు.

వారాల సుజానమ్మకు నివాళులు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని తెలగవరం గ్రామానికి చెందిన వారాల సుజానమ్మ(50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుధాకర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నున్న రంగయ్య కుటుంబాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కటికి కిరణ్ కుమార్, నున్న రామారావు, తూము నరసింహారావు, అనంతయ్య, నున్న వెంకటేశ్వరరావు, కటుకూరి ప్రకాష్‌రావు, బుచ్చిబాబు, అజయ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నేకల్ ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ

నవతెలంగాణ-కామేపల్లి



మండలపరిధిలోని పొన్నేకల్ ప్రాథమికోన్నత పాఠశాల, పోన్నేకల్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కేటీపీఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ కొయ్యడ ముకుంద్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ కోదాటి వెంకట్ (ఎన్ఆర్ఐ)లువారి దాతృత్వంతో మంగళవారం కంప్యూటర్ ప్రింటర్‌ని పాఠశాలకు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డిలు పాల్గొని వారి చేతుల మీద అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఇంతటి సహాయాన్ని అందించినటువంటి ముకుంద్, వెంకట్‌లకు కృతజ్ఞతలు తెలిపి, వారి దాతృత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం, గ్రామ పెద్దలు వడియాల కృష్ణారెడ్డి , కోదాటి శ్రీనివాస్ , యువజన నాయకులు, మాజీ పాలక మండలి సభ్యులు శిలాసాగరపు నగేష్ కోటి, వల్లభినేని అశోక్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్రికా విలేకరులపై దాడులను ఖండించాలి

-టీఎస్ యుటీఎఫ్

నవతెలంగాణ-కామేపల్లి

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులపై దాడులను టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరసింహారావు, వెంకటేశ్వర స్వామి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఒక విలేకరిపై జరిగిన అమానుష దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మయిన పత్రికా రంగాన్ని, పాత్రికేయులను కించపరుస్తూ, వారిపై దాడులను ప్రోత్సహించడం అమానుషమని తెలిపారు. విలేకరులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు మిన్నకుండటం అత్యంత బాధాకరమన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన 6.50 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రుపాలెం మండలం పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శీలం జయలక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు జంగా శేషిరెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, గుడేటి బాబురావు, పంచాయతీ కార్యదర్శి మడుపల్లి విజయ లక్ష్మి, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి, షేక్ జానీబాష, దేవరకొండ రాజీవ్ గాంధీ, శీలం వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ యరమల శ్రీనివాస రెడ్డి, జంగా ప్రసాద్‌రెడ్డి, వేమిరెడ్డి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్ 95 పెన్షనర్ల సమస్యలు పరిష్కారించాలి

నవతెలంగాణ-ఖమ్మం

ఈపీఎస్ 95 పెన్షనర్ల సమస్యలు పరిష్కారించాలని, అతి తక్కువ పెన్షన్ రూ.1000 లోపు ఆసరా పెన్షన్ కంటె తక్కువ పొందుతున్న ఈపీఎస్, కోల్ పెన్షనర్ల మినిమమ్ పెన్షన్ రూ.15000 చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పి.కృష్ణమూర్తి, రంగయ్య, మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని మంచికంటి హాలులో జిల్లా విస్తృత సమావేశం పాటిబండ్ల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈపీఎస్, కోల్ పెన్షనర్లకు డిఆర్ ఇవ్వాలని, ఉచిత వైద్యం అందించాలన్నారు. పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు మాధవరావు,ఝాన్సీ, రాములమ్మ, నాగేశ్వరావు, జరీనా, బీబీ, మధు, గణపతి,కుటుంబరావు, శ్రీధర్,మీరాఖాన్, సాంబయ్య లు పాల్గొన్నారు.

ఏసీపీ తిరుపతిరెడ్డిని కలిసిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఖమ్మంరూరల్ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిరెడ్డిని మంగళవారం సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసిపికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏసీపీని కలిసిన వారిలో ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, మండల నాయకులు పి.మోహన్‌రావు, తోట పెద్ద వెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, యామిని ఉపేందర్, తాటి వెంకటేశ్వర్లు, సాయిబాబా, మోరబోయిన పుల్లయ్య, ఆంటోనీ తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

• మాస్టర్ ట్రైనర్లు కే.శ్రీరామ్, మదన్‌గోపాల్

నవతెలంగాణ-ఖమ్మం



అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకొని, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తహశీల్దార్లు, సెక్టార్ అధికారులకు, ఎన్నికల విధులు, డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్ కేంద్రాల నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ, అవగాహనా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు అధికారులు పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ సందర్భంలో సాంకేతిక సమస్యలు ఎదురయినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు అసెంబ్లీ సెగ్మెంట్ల కేంద్రాల్లో ఉంటాయని, రిషిప్షన్ కేంద్రం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు ఉంటుందని అన్నారు. పోల్కైన ఇవిఎం ల రవాణా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా మాత్రమే చేపట్టాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కి ఒక కలర్ కోడ్ తో రవాణా సిబ్బందికి టీ షర్టులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నివేదికను నిర్ణీత సమయంలోగా సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘంచే జారీచేసిన హ్యాండ్ బుక్, పూర్తిగా చదివి, ఏ సమయంలో ఏం చేయాలి తూ.చ. తప్పకుండా పాటించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో క్రమశిక్షణ, శారీరక ధృడత్వం ముఖ్యం

• ట్రైనీ కానిస్టేబుల్‌కు ఐడీ కార్డ్స్, కిట్స్ పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం



పోలీస్ శాఖలో క్రమశిక్షణ, శారీరక ధృఢత్వాన్ని కలిగి ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. తెలంగాణ పోలీస్ నియామక మండలి ద్వారా ఎంపికైన వారిలో తొమ్మిది నెలల శిక్షణ కోసం పోలీస్ శిక్షణ కేంద్రాలకు వెళ్ళుతున్న 158 మంది సివిల్, ఏఆర్ స్టైఫండరీ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళకు మంగళవారం పోలీస్ ఐడెంటిఫికేషన్ కార్డు, కిట్ ఆర్టికల్స్ ను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించే రీతిలో ఇచ్చే తొమ్మిది నెలల పోలీస్ శిక్షణ కాలాన్ని చక్కని అవకాశంగా భావించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. శిక్షణ ప్రారంభంలో కుటుంబ సభ్యులతో గడిపిన క్షణాలు గుర్తు చేసుకొని భావోద్వేగాలకు గురికాకుండా మానసిక బలం కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య వుంటే తోటి వారితో పంచుకోవడం ద్వారా మానసిక ప్రశాంత ఏర్పడుతుందన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్య వచ్చిన సమర్థవంతంగా ఎదుర్కోనేలా తొమ్మిది నెలలలో శిక్షణ పొందలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీస్ శాఖలోని వివిధ విభాగాలలో ఎంపికైన అభ్యర్థులకు పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాలు అందజేసిన నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ నుండి శిక్షణకు వెళ్తున్న158 మందిలో 54 మంది సివిల్ ట్రైనీ కానిస్టేబుళ్ళు, 55 మంది ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుళ్ళు ఉన్నారన్నారు. అలాగే 33 మంది మహిళ సివిల్ కానిస్టేబుళ్ళు,16 మంది మహిళా ఆర్మ్డ్ రిజర్వ్ ట్రైనీ కానిస్టేబుళ్ళు ఉన్నారన్నారు. వీరందరికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీతో పాటు, పిటిసి వరంగల్, సిటిసీ సైబరాబాద్, 8వ బెటాలియన్‌ల్లో తొమ్మిది నెలల శిక్షణ ఇవ్వనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ గణేష్, ఏవో అక్తరూనీసాబేగం, ఆర్ఐ లు కామరాజు , శ్రీశైలం, అప్పలనాయుడు, సిఐ అంజలి, సిఐ స్వామి, సిఐ వెంకన్న, సెక్షన్ సూపరిండెంట్ జానకి రామ్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినీలను సిద్ధం చేయాలి

• అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-ఖమ్మం



పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినీలను సిద్ధం చేయాలని, ఎలాంటి వత్తిడికి గురికాకుండా పరీక్షలు అంటే భయం పోగెట్టెల ఉపాధ్యాయులు వారికి తెలియజేయాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల కస్తూరీభా పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతిని సందర్శించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. వారికి విద్యాబోధన చేసి వారి సందేహాలను నివృత్తి చేశారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారి విద్యా ప్రమాణాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నది పరిశీలించారు. అనంతరం కిచెన్ షెడ్ వంట వస్తువులు, కూరగాయలు, సరుకుల వివరాలు, విద్యార్థులకు ప్రతిరోజు అందించే మెనూను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కస్తూరీభా విద్యాలయ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాయలేడి గుట్టురట్టు

హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా కౌన్సిల్ స్టేట్ చైర్మెన్ అంటూ గిరిజన ఆశ్రమ వసతి గృహాన్ని పతనిఖీ చేసి పట్టుబడ్డ మహిళా బృందం

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా స్టేట్ చైర్మెన్‌ని అంటూ ఓ మహిళ జరపల స్రవంతి వారితో పాటు ఐదుగురు పురుషులు ఓ ముఠాగా బయలుదేరి ఓ కారులో వచ్చి వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వెలువడిన విషయాలను సంబంధిత పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఎంతో అంత మాకు డబ్బులు ఇస్తే పై అధికారులకు ఏమి చెప్పమని ఆ వసతి గృహ వార్డెన్ వసంతాను బెదిరించడంతో ఆమె భయపడి సంబంధిత యూనియన్ లీడర్లకు సమాచారం అందించారు. అలాంటివారు ఎవరు లేరు అని అలా ఎవరు తనిఖీలు చేయరని తనిఖీ చేసే బృందాలు ఇంతవరకు మండలంలో ఎవరు తిరగలేదని ఒక మాయలేడి ఆశ్రమ పాఠశాలను బృందంతో కలిసి ఇనోవా కారులో తిరుగుతూ తనిఖీలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని తెలపడంతో అనుమానం వచ్చి ఆ వసతి గృహ వార్డేన్ వసంతా పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెంటనే వచ్చి బృందాన్ని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఆ వసతి గృహ వార్డెన్ వసంత ఫిర్యాదు మేరకు ఆ మాయ ముఠాపై ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీని కలిసిన సీపీఐ నాయకులు

ఖమ్మం : సిపిఐ నాయకులు మంగళవారం ఖమ్మం సిపి సునీల్ దత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా శాంతి భద్రతలు సహా పలు విషయాలపై చర్చించారు. సీపీని కలిసిన వారి లో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టి. రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

భట్టి విక్రమార్క చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మధిర



మధిర నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుట కోసం కృషి చేస్తున్న మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి మంగళవారం కాంగ్రెస్ నాయకులు పాలభిషేకం నిర్వహించారు. మధిర పట్టణంలో మెజిస్ట్రేట్ కోర్టు భవనాలు శిథిలావస్థలో ఉన్న వాటిని చూసి నూతన భవనాల సముదాయం కోసం 24 కోట్ల రూపాయలు మంజూరు చేసి వెంటనే భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవడం చాలా ఆనందించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ మధిర మండల అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండలం పట్టణానికి చెందిన వివిధ హోదాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమ భోధన ద్వారానే ప్రభుత్వ పాఠశాల బలోపేతం

నవతెలంగాణ-మధిర

ఆంగ్ల మాధ్యమ భోధన ద్వారానే ప్రభుత్వ పాఠశాల బలోపేతమవుతుందని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీహరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాటూరు పాఠశాల సముదాయ సమావేశం, ప్రాథమికోన్నత పాఠశాల నాగవరప్పాడు వేదికగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిత్యం తరగతి గదిలో ఆంగ్ల భాషలో బోధనకు ఉపయోగపడే 20 పేజీల బుక్ లెట్‌ను ప్రతి పాఠశాలకు అందించారు. అదేవిధంగా ఆంగ్లంలో 4 వ తరగతి విద్యార్థులకు మాదిరి పాఠ్యబోధన లలిత కుమారి, మాటూరు ప్రాథమిక పాఠశాల (హ.వా) చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ సంగు కృష్ణాంజనేయులు, సమావేశ ఆతిధ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సంగారావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, శుభకార్యాలకు హాజరై ఆశీర్వాదాలు, పరామర్శలు తదితర కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇటివలే వివాహం జరిగిన ఖమ్మం కార్పొరేటర్ చామకురి వెంకన్న కుమార్తె ప్రశాంతి - లక్ష్మణరావులను పువ్వాడ అజయ్ కుమార్ కలిసి నూతన దంపతులను ఆశీర్వదించారు. మమత ఆసుపత్రిలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న ఏపూరి కృష్ణారావుని కలిసి పరామర్శించారు. ఖమ్మం గాంధీ చౌక్‌లోని శ్రీ వరప్రదాత షిరిడీ సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని బాబా ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూరాకుల నాగభూషణం, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్, వేములపల్లి వెంకన్న, కన్నం ప్రసన్న కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, గుత్తా రవి, గౌరోజు వసంత్, బిక్కసాని జస్వంత్, బండారు శ్రీనివాస్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన సమావేశం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ శశి పూర్ణ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు అంగన్వాడీ సిబ్బందితో పల్స్ పోలియోపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సమావేశంలో శశి పూర్ణ మాట్లాడుతూ మార్చి 3వ తేది నుండి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. మొదటిరోజు బూత్‌లలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, రెండు, మూడవ రోజులలో గృహ సందర్శన ద్వారా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడి సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వై ద్యులు వెంకట్ లాల్, కంటి వైద్యులు ప్రవీణ్ కుమార్, సిహెచ్ఓ కాంతమ్మ పిహెచ్ఎన్ రాణి, సూపర్ వైజర్లు కె. వెంకటేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు సుధాకర్, శాయిరెడ్డి, అశోక్, వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పిలు, అంగన్వాడీ సిబ్బంది, ఆ శా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీ రుణాలు సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-కల్లూరు

మహిళలు ఆర్థికంగా బలపడటం కోసం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఖాన్ ఖాన్‌పేట గ్రామీణ వికాసం బ్యాంక్ మేనేజర్ రవికుమార్ మహిళలను కోరారు. మంగళవారం స్థానిక ఉషోదయ మండల మహిళా సమాఖ్య స్త్రీ శక్తి భవన్ నందు నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని గ్రామ సమాఖ్య నుండి అధ్యక్షురాలు, మండల సమైక్య ప్రతినిధులు, సీసీలు జెండర్ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. బ్యాంక్ మేనేజర్ రవికుమార్ పాల్గొని బ్యాంకు లింకేజీ ఎస్‌హెచ్‌జి రుణాలు గురించి వివరించారు. తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకొని సక్రమంగా చెల్లించి తిరిగి రుణాలు పొందాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ చేపడుతున్న కార్యక్రమాలను బ్యాంకు లింకేజీ లోకోస్ యాప్ గురించి ఏపీఎం.ఎం వెంకట్రామారావు వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ తగిలి వ్యక్తి మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



కోతుల నివారణకై అమర్చిన విద్యుత్ బైండింగ్ వైరు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కోక్యరేణి గ్రామానికి చెందిన గద్దల గోపయ్య(70) అనే వ్యక్తి కోతులు వచ్చి అతని ఇంటి ఆవరణలో గల రేకులను మొక్కలను నాశనం చేస్తున్నాయని అతను విద్యుత్ వైర్‌కు బైండింగ్ వైర్ సహాయంతో రేకుల మీద నుంచి అతని బౌండరీలో ఉన్న ఫెన్సింగ్ వైర్‌కు సప్లై ఇచ్చాడు. మంగళవారం అతని ఇంటికి చాలా కోతులు రావడంతో వాటిని వెళ్ళగొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు ఫెన్సింగ్ ఆనుకొని రేకుని తాకడం వల్ల అతనికి విద్యుత్ ప్రవహించి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం ఎస్సై గిరిధర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని గాంధీ చౌక్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కళాశాల తెలుగు విభాగం వారి సహకారంతో బోటనీ లెక్చరర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళా సంఘం అధ్యక్షురాలు పిఆర్.దేవి, తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జూపూడి మార్జియాన పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు అనంతలక్ష్మి, మణి, సహాయ కార్యదర్శి ఈ.నాగలక్ష్మి, రమ్య, కళాశాల లెక్చరర్స్ కె. ఇందిరా (ఎకనామిక్స్), డాక్టర్ ఎన్. పద్మావతి (ఇంగ్లీష్), డాక్టర్ కె.పద్మారాణి (హిందీ), సిఎహెచ్. శ్రీనివాస్ (తెలుగు), పి.శ్రీనివాస్ (తెలుగు), విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లు నందిని కలిసిన డీసీసీబీ చైర్మెన్ దొండపాటి

నవతెలంగాణ-మధిర

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మల్లు నందినిని డిసిసిబి చైర్మెన్ దొండపాటి వెంకటేశ్వరరావు మంగళవారం కలిశారు. డిసిసిబి చైర్మెన్ బాధ్యతలను చేపట్టిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని మర్యాదపూర్వకంగా కలిసిన దొండపాటికి శుభాకాంక్షలు తెలియజేశారు. నందిని కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, తన్నీరు రామకృష్ణ, మల్లు నందిని ఉన్నారు.

ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్‌లో సర్వజ్ఞ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని వీడియోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాల 5వ తరగతి విద్యార్థి ఎమ్. అక్షదుత్విక్, ప్రఖ్యాత ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ పోటి పరీక్షలో సర్వజ్ఞ విద్యార్థి జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఈ పరీక్షలో ఇంగ్లీష్ విభాగంలో మా విద్యార్థికి 50గాను 44 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడని పాఠశాల చైర్మెన్ ఆర్‌వి. నాగేంద్రకుమార్, డైరక్టర్ కె.నీలిమా తెలిపారు. పాఠశాల చైర్మెన్ ఆర్‌వి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థి ఎమ్. అక్షదుత్విక్ ఈ ఘనత సాధించడం సంతోషంగా ఉందన్నారు. సుమరు 1500 పాఠశాలల నుండి వచ్చిన 500మంది విద్యార్థులలో తమ పాఠశాల విద్యార్థి టాపర్గా నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను ప్రతిభను విద్యార్థి దశలోనే గుర్తించి వారిని ప్రోత్సాహించడం ద్వారా వారు భవిష్యత్తులో ఎదుర్కోనబోవు పోటి పరీక్షలను సునాయాసంగా ఎదుర్కొని వారు వారి లక్ష్యాలను సాధించడంలో సర్వజ్ఞ స్కూల్ తర్ఫీదు ఇస్తుందని తెలిపారు. పాఠశాల డైరక్టర్ కె. నీలిమా మాట్లాడుతూ సర్వజ్ఞలో చదువుతో పాటు అన్నీ విషయలనీ నేర్చుకోవడం ద్వారా నవసమాజ నిర్మాతలుగా మారగలరని ఆశభవం వ్యక్తం చేశారు. సర్వజ్ఞ పాఠశాల విద్యార్థి ఎమ్. అక్షదుత్విక్, ఇటివల భక్తరామదాసు కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అవార్డుప్రధానోత్సవంలో పాల్గొని జిల్లా టాపర్ జ్ఞాపికను, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడని తెలిపారు. విద్యార్థి ప్రతిభకు సంతోషించి సర్వజ్ఞ పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కె. మానస తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నలుగురి తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం ఫిబ్రవరి 21, 2024 www.navatelangana.com

కృష్ణకుమారి సంస్మరణ సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-మణుగూరు

పగిడేరు మాజీ సర్పంచ్, రెండుసార్లు ఎంపీటీసీగా గెలిచిన సీపీఐ(ఎం) డివిజన్ నాయకురాలు కామ్రేడ్ అమరజీవి కుంజ కృష్ణకుమారి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. మంగళవారం మండల కమిటీ సమావేశం స్థానిక శ్రామిక భవనంలో నంద ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 9న అనారోగ్యంతో కృష్ణకుమారి అకాల మరణం పొందారని అన్నారు. ఫిబ్రవరి 26 సోమవారం సంస్మరణ సభను పగిడేరు గ్రామంలో నిర్వహిస్తున్నామని, కావున సంస్కరణ సభలో పాల్గొనవలసిందిగా వామపక్ష, సీపీఐ(ఎం) శ్రేణులను ప్రజలను కోరారు. నిరంతర స్ఫూర్తి ప్రదాత కృష్ణకుమారి ఆదివాసి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమెకి తన భర్త సహకారంతో సీపీఐ(ఎం) నాయకురాలిగా ఆదర్శవంతమైన ప్రజాప్రతినిధిగా పేదల పక్షపాతిగా గిరిజన గిరిజనేతర ప్రజల మన్నాలను పొందరన్నారు. ఆమె మరణం ప్రజా ఉద్యమములకు తీరని లోటు అన్నారు. మండల కార్యదర్శి కోడిశాల రాములు అధ్యక్షతన జరిగే సంస్మరణ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి, పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మాజీ ఎంపీ మీడియం బాబురావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావులు పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి కోడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, ఉప్పుతల నరసింహారావు, పిట్టల నాగమణి, రాజు, ఈశ్వరరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉండాలి

- ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ అభ్యర్థుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన అన్ని పరీక్షలలో ఉత్తీర్ణులై జిల్లా నుండి ఎంపికైన 75 మంది అభ్యర్థులను మంగళవారం 9 నెలల ప్రాథమిక శిక్షణ నిమిత్తం ట్రైనింగ్ సెంటర్లకు పంపడమైనదని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇందులో సివిల్ కానిస్టేబుల్ పురుషులు 27 మందిని సైబరాబాద్ (సీటీసీ) ట్రైనింగ్ సెంటర్ నకు,సివిల్ మహిళలు 18 మందిని పీటీసీ వరంగల్ నకు,ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్స్ పురుషులు 22 మందిని మొదటి బెటాలియన్, యూసుఫ్ గూడ నందు, ఏఆర్ మహిళలు 8 మందిని, టీఎస్‌పీఏ ట్రైనింగ్ సెంటర్లకు పంపడం జరిగిందని ఎస్పీ తెలిపారు. వీరిని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి ప్రత్యేక వాహనాలలో ఆయా ట్రైనింగ్ సెంటర్లకు శిక్షణ కొరకు పంపడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేయటానికి అర్హత సాధించిన అభ్యర్థులు అందరికీ ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, అడ్మిన్ ఆర్ఐ రవి మరియు ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ సమస్య పరిస్కారానికి కృషి

- లబ్ధిదారుల దరఖాస్తుల జాప్యంపై సీఎం సానుకూలంగా స్పందించాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

సీఎం రిలీఫ్ ఫండ్ దకఖాస్తుల సమర్పణలో జరిగిన జాప్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ప్రతి లబ్ధిదారునికి రిలీఫ్ ఫండ్ మంజూరి చేయాలనీ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో లబ్దిదారుల నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులు స్వీకరించిన అనంతరం అయన మాట్లాడుతూ రోగులు ఆస్పత్రి నుంచి డీచార్జి అయిన తర్వాత ఆరు నెలలలోపు రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఉందని, చాలా మంది సకాలంలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ దృష్ట్యా స్వీకరణ నిలిచిపోవడంతో 6 నెలల గడువు ముగిసిపోయిందని అన్నారు. ఒక్క కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుమారు 500 మందికి పైగా లబ్దిదారులు 6నెలల నిబంధన మూలంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది లబ్దిదారులకు ఈ సమస్య ఏర్పడిందని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఆరునెలల నిబంధన తొలగించి ప్రతి దరఖాస్తును పరిగణలోకి తీసుకొని రిలీఫ్ ఫండ్ మంజూరు వైద్య ఖర్చులతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకోవాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ సమస్య పరిస్కారానికి కృషిచేయాలని కోరారు.

10వ తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడు ఏవి రామారావుకు వినతిపత్రం అందజేశారు. దుమ్ముగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ ఎంతో చరిత్ర కల్గిన పాఠశాల అని ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులు చేసి, ఉన్నత స్థాయిలో ఉంచిన పాఠశాలలో గత 40 సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్షా కేంద్రం నిర్వహించే వారు. కానీ గత సంవత్సరం పరీక్షా కేంద్రం లేకుండా చేశారు. దీనికి కారణం తెలియలేదు. ఏది ఏమైనా ప్రస్తుత సంవత్సరం పరీక్షా కేంద్రం ఖచ్చితంగా ఏర్పాటు చేయాలనీ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యులు ముసలి రాంబాబు, షేక్ హుస్సేన్ అహ్మద్, సరిత, నక్క, సత్యనారాయణ, గ్రామ పెద్దలు కొత్తూరి, సీతారామారావు, బైరెడ్డి, సతీష్, బిల్లకుర్తి నగేష్ ఖన్నా, నర్సింహారావు, ఆదిలక్ష్మి, ముత్యాలమ్మ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మృతులు కుటుంబాలను పరామర్శించిన జారే

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ పరామర్శించి వారి కుటుంబాలను ఓదార్చారు. మండల కేంద్రంలో గల ఓ రిపోర్టర్ ఇమ్మడి కిషోర్ కుమార్ తల్లి ఇమ్మడి తులశమ్మ అనారోగ్యంతో బాధపడుతూ అకస్మాత్తుగా మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించిన ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయుకులు నేరేళ్ళ లాలయ్య, పర్స వెంకట్, వనమా గాంధీ, మాజీ సర్పంచ్ పద్మ, దుబాకుల రాము, భీముడు తదితరులు పాల్గొన్నారు.

మేడారం భక్తులకు మినరల్ వాటర్ పంపిణీ

- సింగరేణి కార్మికుడి నాగేల్లి వెంకట్ దంపతుల ఔధార్యం



మణుగూరు : దక్షిణాది కుంభమేళగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తులకు దాహం తీర్చేందుకు మినరల్ వాటర్‌ను పంపిణీ చేస్తున్నట్లు కొండాపురం కార్మికుడు నాగేల్లి వెంకట్ తెలిపారు. మంగళవారం గిరిజన ఆరాధ్యదైవాలు కోట్లాది మంది భక్తులకు కొంగు బంగారంగా నిలిచి కోరినా కోర్కెలు తీరుస్తూ మొక్కులు అందుకుంటున్న శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మేడారం ఆర్టీసి బస్సు ద్వార వెళ్ళే భక్త ప్రయాణికులకు ఉచితంగా చల్లటి మినరల్ వాటర్ అందించే కార్యక్రమం చేపట్టారు. మణుగూరు సింగరేణి ఏరియా కొండాపురం భూగర్భ గని నందు విధులు నిర్వహిస్తున్న ఫ్యాన్ అపరేటర్ ఉద్యోగి నాగెల్లి శ్రీకారం చుట్టారు. వారి తల్లిదండ్రులైన కీర్తిశేషులు నాగెల్లి సోమయ్య, చిలకమ్మల పేరిట ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, ఆర్‌టీసీ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె.మోహన్ రావు, ఆర్‌టీసీ స్టోర్ ఇంఛార్జి గణేష్, పాయింట్ కంట్రోలర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకలి బాధ తీర్చిన దానధర్మ ట్రస్ట్ చైర్‌పర్సన్ రాధా

మణుగూరు : ఆకలితో బాధపడుతున్న వలస బేడ బుడగ జంగాల కుటుంబాలలో వృద్ధులకు, పిల్లలకు, బాలింతలకు ఆహార పదార్థాలను దానధర్మ ట్రస్ట్ చైర్‌పర్సన్ గంట రాధా ఆధ్వర్యంలో భోజనాలు పంపిణీ చేశారు. మంగళవారం రైల్ గేటు వద్ద ఉన్న బేడ బుడగ జంగాలకు చెందిన సుమారు వందమందికి వండిన భోజన పొట్లాలను పంపిణీ చేశారు. ఇంతటి మహెూత్తర కార్యక్రమానికి ఆర్థిక సాయం చేసిన దాతలకు, పెద్దలకు ఆహార పదార్థాలను వండి పొట్లాలు కట్టిన ట్రస్టు సభ్యులకు ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

దొండపాటిని సత్కరించిన కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

నూతనంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) ఛైర్మెన్‌గా బాధ్యతలు తీసుకున్న దొండపాటి వెంకటేశ్వరావుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని డిసిసిబి ప్రధాన కార్యాలయంలో దొండపాటిని కలిసి కొత్వాల అభినందనలు తెలిపారు. శాలువా, బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, బయ్యారం కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ మూల మధుకర్ రెడ్డి, పాల్వంచ మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్యలి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

- జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులలో అర్హులైన అందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేరే విధంగా చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో వ్యవసాయం, వైద్య విద్యాశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా స్త్రీ శిశు, వికలాంగుల సంక్షేమ శాఖలపై నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలలో రెండు గ్యారెంటీలు అమలు అయ్యాయని, సర్వసభ్య సమావేశంలో చర్చించిన అంశాలపై లోతుగా విశ్లేషణ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. తీసుకున్న చర్యలపై సభ్యులకు నివేదికల ప్రతులను అందజేయాలని పేర్కొన్నారు.





ఆసుపత్రుల్లో సేవలు పెంచాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన అంశాలపై కలెక్టర్ ప్రియాంక అలా, జిల్లా అధికారులు స్పందించి మాతా శిశు ఆసుపత్రి కొత్తగూడెం నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలోని బెడ్స్‌పై దుప్పట్లు విధిగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారులను కోరారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రస్తుతం ఉన్న జడ్పీ కార్యాలయం చాలా పాతబడినదని నూతనంగా జడ్పీ కార్యాలయం విశాలంగా నిర్మించుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంప వలసినదిగా కోరారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిందిగా కోరారు. రానున్న వేసవిలో గ్రామీణ ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను కోరారు.

ఇంటి నెంబర్లు కేటాయించాలి : వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు నిర్మించుకున్న ఇళ్లకు ప్రభుత్వం వారు ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. జిల్లాలో 1/70 యాక్ట్ అమలులో ఉన్నందున ఇల్లు నిర్మించుకొని ఉన్నవారికి ఇంటి నెంబర్లు కేటాయించడం జరగలేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించుచున్న కొన్ని భవనాలు శిధిలావస్థకు చేరాయని, వాటికి రిపేర్లు చేయాలని, వీలున్న చోట నూతన భవనాలు నిర్మించుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సిందిగా కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు పూర్తి విధంగా సమాచారం ఇవ్వలేకపోయామని, అధికారుల బదిలీల వల్ల వీలుపడలేదని, వచ్చే సమావేశంనాటికి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, ముఖ్యంగా జాబ్ కార్డ్స్, మస్టర్ రోల్స్ వేయడం, అంగన్వాడీ పాఠశాలల సమస్యల గురించి తనిఖీ చేసి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అందజేస్తామన్నారు. కలెక్టర్ దగ్గర ఉన్న యాస్పిరేషన్స్ నిధుల నుండి పాఠశాలలకు, అంగన్వాడీలకు, ఆస్పత్రులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. వేసవిలో గ్రామీణ ప్రజలకు మంచినీటి సరఫరా కొరకు కలెక్టర్ పరిధిలో నిధులు లేకపోయినా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు తెప్పిస్తామన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం అభివృద్ధి పనులకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, డిఆర్ఓ విద్యాచందన, జడ్పి సీఈఓ ప్రసూన రాణి, జడ్పిటిసిలు, ఎంపీపీలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

-: కలెక్టర్ ప్రియాంక అల

పరీక్షలకు సన్నద్ధం చేసేందుకే ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం

నవతెలంగాణ-కొత్తగూడెం



భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు జిల్లా వ్యాప్తంగా రెండవ రోజు 4000 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొత్తగూడెం పట్టణ కేంద్రంలో 16 పాఠశాలల్లో, పాల్వంచలో 8 పాఠశాలల్లో, సుజాతనగర్ హైస్కూల్‌లో పరీక్ష నిర్వహించినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం తెలిపారు. ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌కు జిల్లా వ్యాప్తంగా విశేషం స్పందన లభిస్తోంది. మండల స్థాయిలో రాణించిన మొదటి ఐదుగురు జిల్లా స్థాయిలో జరిగే ఈ నెల 24న జరిగే టాలెంట్ టెస్ట్‌కు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బి.వీరభద్రం మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు, భయాన్ని పోగొట్టి మానసికంగా దృఢంగా తయారయ్యేందుకు, ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన మొదటి 3 గురికి రూ.5,000, 3,000, 1,500లు చొప్పున బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులలో పోటీతత్వాన్ని నెలకొల్పేందుకు ఈ పరీక్ష బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. వేలాదిగా హాజరై జయప్రదం చేసిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. టాలెంట్ టెస్ట్ నిర్వహణలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, ప్రవీణ్, భవ్య, భవాని, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

భద్రాచలం రూరల్ 10వ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ సమ్మయ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20 తేదీలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్ మొదటి రోజు భద్రాచలం మండల కేంద్రాల్లో నిర్వహించారు. 1500 మంది విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. భద్రాచల పట్టణ కేంద్రంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు ఎంఈఓ హాజరై ప్రశ్న పత్రావళిని ప్రారంభించి, అనంతరం విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు, విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తగ్గించేందుకు ఎస్ఎఫ్ఐ పదవ తరగతి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు అభిమన్యు, భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జ్ భూపేందర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఎస్ఎఫ్ఐ పదవ తరగతి విద్యార్థులకు జిల్లా మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, రవీంద్ర, కార్తిక్, అరవింద్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

జాతరమ్మ.... జాతర

- మేడారానికి తరులుతున్న ప్రజలు
- ఉచిత ప్రయాణంతో ఎరిగిన మహిళల రద్దీ
- గూడెం ప్రయాణికులు సందడి

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర నలుమూలల నుండి మేడారం జాతరకు ప్రజలు కదిలారు. తెలంగాణ కుంభమేళాగా చెప్పుకునే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తుల సందడి పెరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బస్టాండ్‌లలో రద్దీ భారీగా పెరిగింది. రాబోయే మూడు రోజులు సమ్మక్క సారలమ్మ జాతర భారీగా సాగుతున్న నేపథ్యంలో భక్తుల కుటుంబాలు... కుటుంబాలుగా తరలి వెళ్తున్నారు. కొత్తగూడెం బస్టాండ్‌లో జాతరకు వెళ్లే వారి సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ప్రజలు రద్దీని గమనించి వారికి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. టిఎస్ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్న నేపథ్యంలో కొత్తగూడెం నుండి 130 బస్సులు, ఇల్లందు నుండి 124, పాల్వంచ 45, మణుగూరు 25, భద్రాచలం 50 బస్సులతో పాటు చర్ల 10, టేకులపల్లి 25 బస్సులను ఏర్పాటు చేశారు. మహిళకు ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో జాతరకు వెళ్లే వారిలో మహిళలే ఎక్కువడా కనిపిస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్తారు. వారి వారి మొక్కులు తీర్చుకునేందుకు ముందుగానే నిలువెత్తు బంగారాన్ని కొనుగోలు చేయడంతో జాతర సందడి వాడవాడలా మొదలైంది. పట్టణంలోనే పలు కిరాణా షాప్‌ల వద్ద బంగారం (బెల్లం) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం వివిధ స్వచ్ఛంద సంస్థలు ఆహారం, తాగునీరు సౌకర్యాలను ఏర్పాటు చేశారు.



ఆర్టీసీ యాజమాన్యం భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఏర్పాట్లు కల్పించారు. ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు సేవలందిస్తున్నారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల ఆదివాసి, గిరిజన ప్రజానీకంతో పాటు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున జాతరకు తరలి వెళ్తున్నారు.

నిషేధిత పార్టీగా పోలీసులు ప్రకటించడం అన్యాయం

- ప్రభుత్వ ఏర్పాటు సభకు సీఎం ఆహ్వానం కూడా పంపారు
- విలేకర్ల సమావేశంలో న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని

నవతెలంగాణ-ఇల్లందు



సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీని నిషేధిత పార్టీగా పోలీసులు ప్రకటించడం అన్యాయమని ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు ఏ పార్టీని ప్రభుత్వం నిషేధిత పార్టీగా ప్రకటించలేదన్నారు. ఖమ్మం వరంగల్ జిల్లాలలో బలమైన ప్రజా పునాది ఉందన్నారు. గతంలో ఆరు సార్లు ఎమ్మెల్యే, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలను గెలిపించుకున్నామని తెలిపారు. విలువల కోసం పోరాడుతున్న పార్టీ అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మా పార్టీ సలహాలు, సూచనలు తీసుకుంటామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. గత రెండు నెలల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా సభకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డి సైతం ఆహ్వానం పంపించినట్లు పేర్కొన్నారు.

పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయాలి

అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలి

ఇల్లందు మండలం పూసపల్లి సమీపంలో ఇటీవల సాయుధ జనం ఉన్నదని సమాచారం తెలిసి నలుగురిని పట్టుకున్నట్లు, మరో 10 మంది సభ్యులు తప్పించుకున్నట్లు పోలీసుల ప్రకటించడం హస్యాస్పదమన్నారు. ఈనెల 14న ఖమ్మం సమీపంలోని రఘునాధపాలెం మండలం కోయచిలక గ్రామ సమీపంతో మూడు వాహనాల్లో వచ్చిన పోలీసులు మాటు వేసి రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ను పట్టుకున్నారని అన్నారు. వాస్తవానికి అశోక్ అనారోగ్యంతో ఉండి వైద్యశాలలో చికిత్స చేసుకొని తిరిగి వస్తుండగా పోలీసులు పట్టుకున్నారని దీన్ని వక్రీకరించటం సరికాదన్నారు. అక్రమంగా మోపిన తప్పుడు కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని, బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నేతలు మావిడాల బిక్షపతి, ఎం శ్రీనివాస్, జే.సీతారామయ్య, రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొత్తగూడెం నందు
ఒ.యస్. నెం. 310/2021

బిట్వీన్ :
సుంకర నాగేశ్వరరావు ...వాది
మరియు
మహ్మద్ షర్ఫుద్దీన్ ...ప్రతివాది

టు,
ప్రతివాది: మహ్మద్ షర్ఫుద్దీన్, తండ్రి : హార్రోన్ రషీద్, వయస్సు : 49 సం.లు, వృత్తి : ఫోన్ మెన్, గ్రేడ్ ఫోర్, ఐడి. నెం. 1049116, నివాసం : క్వార్టర్ నెం. బి.ఎఫ్-23, ఇంటర్ మీడియట్ కాలనీ, కెటిపిఎస్, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

పైన తెలిపిన వాది మీపై తనకు బాకీ వున్న సొమ్ము మరియు వడ్డీతో కలిపి ఉన్న పైకమును రాబట్టు కొనుటకై పైన తెలిపిన గౌరవ కోర్టు వారి యందు మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలోని ఎన్ని పర్యాయములు మీకు దావా సమన్లు పంపించియున్నను తీసుకొన కుండా మీరు కాలయాపన చేయటమైనది. అట్టి దావా యందు మీ హాజరు కొరకు గౌరవ కోర్టు వారు **ది. 06-03-2024న ఉ.గం. 10.30 ని॥లకు వాయిదా వేసియున్నారు.** కావున ఆ రోజు మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గాని జవాబు చెప్పుటకు పైన తెలిపిన న్యాయస్థానం యందు హాజరు కావలెను. లేని యెడల మీకు పరోక్షంలో కోర్టు వారు తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో//

వాయిదా : 06-03-2024

బి. చిరంజీవిరావు
కొత్తగూడెం న్యాయవాది, కొత్తగూడెం
ది.20-02-2024 సెల్ : 9440108535

IN THE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE AT KOTHAGUDEM
E P No. 72/2019

Between:-
BhUkya Hussain ...DHR
and
Bodda Suresh Kumar (Since died) rep by his LRs ...JDRs

To,
JDR No, 2: Bodda Samadhanam, w/o. late Suresh Kumar, Age: 49 years, Employee,
JDR No 3: Bodda Praneetha Ratna Rose, D/o. late Suresh Kumar, Age: 19 years, Student

Both residents of H.No. 8-1-40/2 Babu Camp, Kothagudem Town & Mandal, Bhadradri Kothagudem District.

Whereas the DHR has filed the above EP against you for recovery of money basing on decree in O.S No. 37/2016 and the said EP is posted on 14.03.2024.

Hence, you are hereby informed to appear before this court on 14.03.2024 at 10.30 A.M. either by yourself or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //

MSR RAVI CHANDRA
SK KHADAR
Advocates - Kothagudem
Mobile: 98663 44930

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRCT JUDGE KOTHAGUDEM
O.S.NO.1 OF 2023

BETWEEN:
Mahabubee ....Plaintiff
AND
Shaik Meera .....Defendant

NOTICE

To,
Defendant: Shaik Meera, S/o. Late. Mohammad Saheb, Aged: 63 years, Occu: Ex. S.C.C.O., Employee, R/o: Sheshagiri Nagar, Manuguru Town and Mandal, Bhadradri Kothagudem District.

That the above named Plaintiff filed the Suit against you for Maintenance and Medical Expenses. The above case is posted to **13.03.2024** for your appearance before the above said Hon'ble Court.

Hence, you are hereby directed to appear before the above said court at **10.30 A.M on 13.03.2024** either in person or through your counsel, failing which the matter will be decided in your absence.

(By order of the Court)

Kothagudem
Date: 20-02-2024

ARIKALA RAVI KUMAR
ADVOCATE, KOTHAGUDEM
Cell: 9440161575

తూతూ మంత్రంగా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ దాడులు

- సిండికేట్ వ్యాపారులకు ముందే సమాచారం చేరవేసిన అధికారులు
- బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జ్ యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ



గత రెండు రోజులు జిల్లాలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించిన దాడులు తూతూమంత్రంగా జరిగాయని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ యెర్రా కామేష్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న మద్యం సిండికేట్ దందా పై జిల్లా అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా స్పందించక పోవడంతో ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు గతంలో ఫిర్యాదులు వస్తే స్థానిక ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఏకకాలంలో అన్ని షాప్ లపై ఒకేసారి దాడులు కొనసాగించే వారు కానీ ఈసారి ముందే మద్యం సిండికేట్ వ్యాపారులకు సమాచారం ఇవ్వడంతో మద్యం అమ్ముతున్న వ్యాపారులు రెండు రోజులు సిండికేట్ స్టాక్ పాయింట్లకు తాళాలు వేసుకున్నారని ఆరోపించారు. దాడులకు వచ్చిన అదికారులు కేవలం ఒక షాప్ మాత్రమే జరిమానా విధించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దాడులకు వచ్చిన అధికారులు పారదర్శకంగా వ్యవహరించి ఉంటే చాలా షాపులో జరుగుతున్న అవినీతి, అక్రమాలు బయటకు వచ్చేయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ రాజ్యంలో బెల్ట్ షాపులు తొలగిస్తామని ఎన్నికల హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెట్టి ఆనందరావు, రంజిత్, ప్రవీణ్, సందీప్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఎస్ఎఫ్ఐ వజీ నాయకులు యాసా నరేష్ అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు మండల వ్యాప్తంగా 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల కేంద్రంలో హైస్కూల్, సెయింట్ ఆన్స్, వివిధ పాఠశాలల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రారంభ సభకు నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించాలని, బంగారు భవిష్యత్తుకు 10వ తరగతి తొలిమెట్టు అన్నారు. మండల పరిధిలో 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

పాయంను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ, సీఐ



నవతెలంగాణ-మణుగూరు

బదిలీపై మణుగూరు వచ్చి విధులు నిర్వహిస్తున్న నూతన డీఎస్పీ రవీందర్, సీఐ సతీష్ కుమార్ మంగళవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలుసుకుని, అభినందనలు తెలియజేశారు.



పాకలపాటికి విశ్వగురు సేవా పురస్కారం

- పురస్కారాన్ని అందించిన హైకోర్టు జడ్జి వేణుగోపాల్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని చెరుపల్లి గ్రామానికి చెందిన సినీ నిర్మాత, దర్శకుడు, వివిధ సామాజిక కార్యక్రమాలతో రాష్ట్ర దేశ స్థాయిలో ఎన్నో ప్రశంసలు పొందిన విజయ్ వర్మ పాకలపాటికి మరో అత్యున్నత పురస్కారం లభించింది. ప్రతిష్టాత్మక విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ గ్రామ స్థాయినుండి ఉభయ తెలుగు రాష్ట్రాలలో తనవంతు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విజయ్ వర్మ పాకలపాటిని విశ్వగురు సేవా పురస్కారంతో సత్కరించింది. హైకోర్టు జడ్జి వేణుగోపాల్ మంగళవారం హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో పురస్కారాన్ని అందించి విజయ్ వర్మను అభినందించారు. సంస్థ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు, రిటైర్డ్ ఐఎఎస్ లక్ష్మీకాంత్‌లు విజయ్ వర్మ అందిస్తున్న తనవంతు సేవలు ఎందరికో ఆదర్శమని కొనియాడారు. అవార్డు గ్రహీత విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ సినీ నటులు బ్రహ్మానందం, సినీ నటులు ఆదిత్య ఓం, నారీసేన వ్యవస్థాపకురాలు లతా బోట్ల, రోటరీ సంస్థ, షిర్డీ సాయి సంస్థాన్ యూఎస్ఏ, రోటేరియన్ సురేన్ వంటి ఎందరో ప్రముఖుల సహకారంతోనే కొన్ని కార్యక్రమాలు చెయ్యగలిగానని, భవిష్యత్‌లో దేశ అంతర్జాతీయ సేవా సంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో మరిన్ని సేవలు అందించనున్నట్లు ఆయన నవతెలంగాణకు తెలిపారు.



ప్రతి విద్యార్థి ఉన్నత భవిష్యత్తును కలగాలి

- కేఎల్ఆర్ విద్యా సంస్థల చైర్పర్సన్ కె.నాగమణి
- కెఎల్ఆర్ ఫిజియోథెరపీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుక

నవతెలంగాణ-పాల్వంచ

స్థానిక కేఎల్ఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. 2018 సంవత్సరం చెందిన 34 మంది విద్యార్థినీ, విద్యార్థులకు డిగ్రీ పట్టా అందజేసిన కేల విద్యాసంస్థల చైర్పర్సన్ కె.నాగమణి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్స్ కంప్లీట్ అయిన ప్రతి విద్యార్థి ఉన్నత భవిష్యత్తు కలిగి మెడికల్ రంగంలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ విద్యతో స్వయం ఉపాధి పొంది అందరికీ మార్గదర్శకంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ఎల్ లక్ష్మణరావు, కేఎల్ఆర్ విద్యా సంస్థ డైరెక్టర్లు మురళి ప్రసాద్, కాశీ విశ్వనాథం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్, సునీల్ రావు, అధ్యాపకులు, విద్యార్థినీ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నరసింహ మృతి బాధాకరం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని గుండెపుడి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ రామచంద్రపురం గ్రామానికి చెందిన ఈసం నరసింహ మరణం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం ఈసం నరసింహ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన నిజాయితీ గల నాయకుడిని కోల్పోయామని, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. వారి కుటుంబానికి సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, సిపిఐ నాయకులు మధు, చింత స్వరాజ్ రావు, చాంద్ పాషా తదితరులు నివాళులర్పించారు.

పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టిపిహెచ్‌డిఏ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు కత్తి జనార్దన్ గౌడ్ ఆదేశాల మేరకు ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా డాక్టర్ బి.బాలాజీ నాయక్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ బి.శివకుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ మురళీ కృష్ణ, కొత్తగూడెం డివిజన్ వైస్ ప్రెసిడెంట్స్‌గా డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ప్రియాంక, భద్రాచలం డివిజన్ వైస్ ప్రెసిడెంట్స్ గా డాక్టర్ నిశాంత్ రావు, డాక్టర్ స్పందన, ఆర్గనైజింగ్ సెక్రటరీస్‌గా డాక్టర్ రాకేష్ కుమార్, డాక్టర్ దినేష్, డాక్టర్ పుల్లా రెడ్డి, డాక్టర్ మనీష్ రెడ్డి, డాక్టర్ కృష్ణ దీపక్ రెడ్డి, జాయింట్ సెక్రటరీస్‌గా డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ మధువరన్, డాక్టర్ రేవంత్ డాక్టర్ సంఘమిత్ర గౌరవ సలహాదారులుగా డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పిహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

జెవిఆర్ ఓసీ నందు పర్యటించిన కంపెనీ సభ్యులు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జెవిఆర్ ఓసి నందు రష్యన్ మల్టీ నేషనల్ ఎనర్జీ కార్పొరేషన్ సంస్థ అయిన గజ్‌ప్రోమ్ కంపెనీ సభ్యులు మంగళవారం సత్తుపల్లి నందుగల ఓపెన్ కాస్ట్ గనులను సందర్శించారు. ఓసీలలో ఉపయోగించే శావెల్స్, డంపర్స్ పనిచేయుటకు వినియోగించే ఇంధనమైన డీజిల్‌కు బదులు ప్రత్యామ్నాయంగా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)ని వినియోగించే అవకాశాన్ని అధ్యయనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు , తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా భారతదేశంలోకి చొరబడిన నలుగురు బంగ్లాదేశీయులు అరెస్ట్

- జైలుకు పంపిన కొత్తగూడెం పోలీసులు

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలో కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తీ నందు ఒక ఇంటి నిర్మాణ పనులను చేస్తూ అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు వ్యక్తులను కొత్తగూడెం 3 టౌన్ ఎస్ఐ విజయ అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులను విచారించగా వారు బంగ్లాదేశ్ దేశానికి చెందిన వారని, అక్రమంగా మన దేశంలోకి చొరబడి ఇక్కడ నకిలీ ధృవ పత్రాలను సృష్టించుకుని ఎవరికీ అనుమానం రాకుండా జీవిస్తున్నారని తేలిందని 3 టౌన్ సీఐ మురళి వెల్లడించారు. నిందితుల వివరాలు వెల్లడించారు. మహమ్మద్ ఆజాద్ ఆలియాస్ షేక్ ఆజాద్, మొహమ్మద్, మహమ్మద్ అలామిన్ హొూస్సేన్, మహమ్మద్ మోహిన్ బంగ్లాదేశ్ దేశానికి చెందిన వారుగా తెలిపారు. పట్టుబడిన నిందితుల వద్ద నుండి నకిలీ ధృవ పత్రాలను, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఏటిఎం కార్డులు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టు నకు తరలించడమైనదని సీఐ మురళి వెల్లడించారు. ఈ విధంగా ఎవరైనా ఇతర దేశస్తులు తమ చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.

బండిని పరామర్శించిన మంత్రి తుమ్మల



నవతెలంగాణ-అశ్వారావుపేట

సీనియర్ నాయకులు, అశ్వారావుపేట మండలంలో తన ప్రధాన అనుచరుడు, నారంవారిగూడెం గ్రామానికి చెందిన బండి పుల్లారావును మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న 'పుల్లారావు' ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా ప్రజా జీవితంలోకి రావాలని సూచించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మద్ది అంజనేయ స్వామి, పశ్చిమ గోదావరి జిల్లా విజయ రాయ్ రాట్నాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట అలపాటి రామచంద్రప్రసాద్, దొడ్డా ప్రసాద్, ఎల్లిన రాఘవరావు, మున్నా రత్నాకర్, రసూల్, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కథ మారదు...వ్యథ తీరదు

క్రింది గుంపుకు మిషన్ భగీరథుడు ఎప్పుడొస్తాదో...

- ఆశగా ఎదురు చూస్తున్న జనం



నవతెలంగాణ-పినపాక

తిన్నా తినకున్నా ఇంట్లో గాబు నిండా నీళ్ల ఉంటే జేబు నిండా డబ్బులు లేకున్నా రందే ఉండదు. ఆ నీళ్ల ఒక్కరోజు లేకపోతే ఏ పని జరగక మది నిండా తీరని వ్యధ మిగులుతుంది. వేసవికాలం సమీపిస్తే ఆ గ్రామంలో ఒక వీధి మాత్రం నీటి కోసమై పరితపిస్తుంది. దశాబ్దాల కాలం నాటి నుంచి ఆ సమస్య ఎదురవుతున్నా పట్టించుకున్న నాధుడే లేడు. వివరాల్లోకి వెళితే పినపాక మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీ క్రింది గుంపు ప్రాంతంతో పాటు దుగినేపల్లి గ్రామపంచాయతీ బ్రిడ్జి గ్రూపులో ఈ ప్రాంతంలలో దాదాపుగా ఒక్కొక్క గ్రామపంచాయతీలో నలభై కుటుంబాలు రెండువందల మందికి పైగా జనాభా నివసిస్తూ ఉంటారు. ఈ ప్రాంతం దశాబ్దాల కాలం నుండి తాగునీటి సమస్యతో బాధపడుతుంది. గ్రామంలో మిషన్ భగీరథ నీటి ట్యాంక్ ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఆనీరు చేరుతుంది. పేరుకు క్రింది గుంపైన మిషన్ భగీరథుడు చేరని ఆటవిక ప్రాంతమే. పినపాక పంచాయతీలో భాగంగా ఉన్న తోగ్గూడెం గ్రామం 2018వ సంవత్సరంలో కొత్త పంచాయతీగా ఏర్పడి ఐదు సంవత్సరాల కాలం దాటినప్పటికీ తాత్కాలిక పరిష్కారాలు మాత్రమే అధికారులు చేయగలిగారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం చేయలేకపోయారు. వాన కాలంలో మోటార్ ద్వారా, హ్యాండ్ పంపు ద్వారా వచ్చే నీటితో పబ్బం గడుస్తున్నప్పటికీ వేసవి వస్తే ఇవి మూలకు పడటం నీటి కోసం వెతుకులాడటం ప్రతి ఏటా జరుగుతున్న తంతుగా మారింది. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందాలని ప్రభుత్వాలు పలుమార్లు వల్లె వేస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు మాటల రూపంలో మాత్రమే అభయమిస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఉంటున్నారు. ఈ ఏడాది వేసవికాలం మొదలైంది. అప్పుడే ప్రజలు చేతిలో బకెట్లు పట్టుకొని నీటి కోసం వెతుకులాట మొదలుపెట్టారు. సర్పంచులు ఉంటే శాశ్వత ప్రాతిపదికన కాకున్నా తాత్కాలికంగానైనా నీటిని అందించే చర్యలు చేపట్టేవారు. ఈ ఏడాది సర్పంచుల పదవీకాలం ముగియడం ప్రత్యేక అధికారుల పాలన రావడం నీటి సమస్య ఏ స్థాయికి చేరుతుందేమోనని ప్రజలు వాపోతున్నారు. ఎలక్షన్స్ వచ్చినప్పుడు ఓటు కోసం వచ్చే నాయకులు తప్ప ఆ తర్వాత ఎన్ని మార్లు మొరపెట్టుకున్న ఇటువైపు చూసే నాయకుడే లేరంటున్నారు గ్రామస్తులు. పది సంవత్సరాల తర్వాత కొత్త ప్రభుత్వం వచ్చింది. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైన ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు గంపెడు నీటి ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా ఈ గ్రామాన్ని సందర్శించి సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు. సమస్యను తెలుసుకున్న ఎంపీఓ వెంకటేశ్వరరావు ఈ ప్రాంతాల్లో నీటి సమస్య తీర్చడానికి కొంతమేర తను స్వయంగా పూనుకున్నారు. నీటి సమస్యపై స్థానిక ఎంపీఓ వెంకటేశ్వరరావు వివరణ కోరగా సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించామని తెలియజేశారు. ప్రస్తుతం మేడారం డ్యూటీలో ఉన్నామని రాగానే శాశ్వతమైన పరిష్కారం చూపిస్తామని తెలియజేశారు. మిషన్ భగీరథ ఏఈ విజయ కృష్ణతో కలిసి తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలియజేశారు. వేసవిలోగా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలియజేశారు.



ఏల్టా డ్రామా పోటీల్లో కేజీబీవి పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు
- ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఏల్టా)

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఏల్టా) ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రామా పోటీల్లో కేజీబీవి పాఠశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికయ్యారు. ఏల్టా ఎన్ఎస్పి ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు నిర్వహించిన ఆంగ్ల డ్రామా ఉమ్మడి జిల్లా పోటీలు జరిగాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా విజేతగా కేజీబీవీ అన్నపురెడ్డిపల్లి జట్టు ఎంపిక అయింది.ఈ డ్రామా జట్టు ఈనెల 26న ఉమ్మడి ఖమ్మం జిల్లా తరఫున రాష్ట్ర స్థాయిలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ దస్తగిరి, ఆంగ్ల రిసోర్స్ పర్సన్స్ మీరా హుస్సేన్, కె.సైదులు, గైడ్ టీచర్ వాసం అరుణ విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలని భద్రాద్రి జిల్లా విద్యాధికారి శ్రీనివాస చారి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజేతలకు డైట్ కళాశాల అధ్యాపకులు బహుమతులు ప్రశంసా పత్రాలు అందించారు. నాగచైతన్య, గీతిక (9వ తరగతి), సంధ్య (8వ తరగతి) ఊహశ్రీ (9వతరగతి) జెస్సికా(8వ తరగతి) విద్యార్థులు "భిన్నత్వంలో ఏకత్వం" అనే నాటికను ఎంతో సృజనాత్మకతో ప్రదర్శించారు. విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాలు, భావవ్యక్తీకరణ, ఫ్లూయెన్సీ నైపుణ్యాలు, ఇలాంటి పోటీల ద్వారా అభివృద్ధి చెందుతాయని ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు పెంచుకొనుటకు ఏల్టా ద్వారా ఎంతో కృషి చేస్తున్నామని, రెండు జిల్లాల ఏల్టా నాయకులు వివరించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన గ్రామీణ యువకుడు

- ఘనంగా సన్మానించిన గ్రామస్తులు



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అనేకమంది యువతీ, యువకులు పోలీసు ఉద్యోగాలు సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసినటువంటి రిజర్వేషన్ వల్ల అనేకమంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రిజర్వేషన్ ఫలాలు అందుకొని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తున్నారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, మారుమూల గ్రామమైన ఉలవనూరులో శ్యాగల శ్రీకాంత్ అనే యువకుడు పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ బర్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహకారంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.... తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించి పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపిక అవడం గ్రామానికి గర్వకారణం అంబేద్కర్ అందించిన రిజర్వేషన్ ఫలాలు అందుకొని ప్రతి ఒక్కరూ ఉద్యోగలు సాధించాలని చెప్పారు. అంతేకాక శ్రీకాంత్ తన ఉద్యోగంలో అంచలంచలుగా ఎదుగుతూ అధికారుల వద్ద మంచి పేరు పొందాలని, కుటుంబంతో మంచి అనుబంధం కలిగి ఉండాలని, గ్రామంలో కూడా మంచి పేరు సంపాదించాలని హితవు పలికారు. ఈ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన శ్రీకాంత్ మాట్లాడుతూ... కానిస్టేబుల్ ఉద్యోగ సాధనలో సహకరించిన తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చిన్ననాటి గురువు అయిన బర్ల లక్ష్మణరావుకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులందరూ కలిసి ఇలా సన్మానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పాడు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు మోట జగదీష్, దారం రమేష్, తడికల దాసు, గోపి ఏసు, బూర్గుల ప్రకాష్, నరసింహారావు, అమృత రావు, వంశీ, లవన్, ప్రేమ్, సుమంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అధిగమించిన ఇల్లందు

- బొగ్గు ఉత్పత్తిలో ఆదర్శంగా జెకె 5 ఉపరితల గని
- ఉద్యోగులను అభినందించిన జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణిలోనే బొగ్గు వెలికి తీయడంలో ఇల్లందు ఏరియాలోని జెకె 5 ఉపరితల గని ప్రత్యేకంగా నిలుస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా గనికి ఇచ్చినటువంటి వార్షిక లక్ష్యాన్ని గడువులోపే సాధించి, ఉత్పత్తి సాధనలో ముందు వరుసలో ఉంది. జెకె 5 ఉపరితల గనిలో 229 మంది ఉద్యోగులున్నారు. భద్రతాతో కూడిన ఉత్పత్తి కోసం ఉద్యోగులంతా కలిసికట్టుగా, ఒకరికి ఒకరు సహాయ సహకారాలతో ముందుకు సాగడంతోనే, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 44 రోజుల ముందుగానే నిర్దేశిత 1మి.టన్న లక్ష్యాన్ని సాధించడంతో పాటు 104 శాతం ఉత్పత్తితో దూసుకుపోతున్నది.

కార్మికులకు, ఉద్యోగులకు అభినందనలు

గత ఆర్థిక సంవత్సరం 2022-23 గాను సంస్థ నిర్దేశించిన 14.5 లక్షల టన్నులకు గాను 18.7 లక్షల టన్నులను ఉత్పత్తి చేసింది. గత సంవత్సరం 63 రోజుల ముందుగానే జెకె 5 నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అధిగమించింది. ఈ సందర్భంగా కార్మికులను, ఉద్యోగులను, అధికారులను మంగళవారం జరిగిన కార్యక్రమంలో జీఎం ఆనంద్ అభినందించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచారు.

ఏరియా ప్రత్యేకం నిలుస్తుంది : జీఎం జాన్ ఆనంద్

ఉద్యోగులంతా సమిష్టిగా ముందుకు సాగడంతో నిర్దేశిత ఉత్పత్తి సాధ్యమవుతుంది. జెకె 5 ఉపరితల గని బొగ్గు నిక్షేపాలు తరిగిపోయినప్పటికీ సింగరేణి సంస్థ నిర్దేశించినటువంటి వార్షిక లక్ష్యాన్ని 44 రోజుల ముందే సాధించడం చాలా సంతోషంగా ఉంది. వార్షిక లక్ష్యం సాధించడం కోసం కృషి అభినందనీయం.

కార్మికుల ఐక్యతతోనే ముందుకు : ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు



ఉద్యోగులంతా కలిసికట్టుగా ముందుకు సాగడంతోనే నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని సాధించాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని ఇచ్చిన గడువులోపే సాధించడం ఆనందంగా ఉంది.

ముందస్తు ప్రణాళికలతోనే లక్ష్యసాధన : గని మేనేజర్ పూర్ణచందర్

గనిలో ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటూ, లక్ష్యసాధనలో ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు పోవడంతోనే సంస్థా నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని 44 రోజులు ముందుగానే సాధించడం సంతోషంగా ఉంది. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారికి అందుబాటులో ఉంటూ, వారిలో ఒక ఒకరిగా ఉండటం వల్లనే భద్రతతో కూడిన ఉత్పత్తి సాధ్యమైంది.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు ఏజీ శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవి మోహన్ రావు, గని మేనేజర్ పులి పూర్ణచందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చిన్నయ్య, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, పిట్ సెక్రటరీలు సంజీవ చారి, సేవ్య మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం



నవతెలంగాణ-మణుగూరు

ఉపాధి కూలీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ప్రజల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షులు బొల్లం రాజు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు సాంబశివరావు డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను గుట్ట మల్లారం కారం వెంకటయ్య కుంటలో పనిచేస్తున్నటువంటి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనేక సమస్యలు దృష్టికి వచ్చాయి. అనేక సమస్యల తోటి ఉపాధి హామీ పని నిర్వహిస్తున్నామని 4 బ్యాచ్లుగా పనిచేస్తున్నటువంటి మాకు గడ్డపార, తట్ట, పారా, డేరాలు, ప్రాథమిక చికిత్స వంటి సదుపాయాలు ఏమీ కల్పించడం లేదని కూలీలు తెలియపరిచారు. సుమారు 2023లో సుమారు రెండు లక్షల రూపాయల దాకా కూలీలకు రావాల్సిందని కూలీలు తెలియపరిచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం చూస్తుందని, పనికి ఎటువంటి కొలతలు లేకుండా రూ.600 రోజుకి ఇవ్వాలని, ప్రతి మనిషికి 200 దినాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడిదేశి హేమంతరావు, కూలీలు అనుపమ, ఎస్.మని, పుష్ప, వెంకటరమణ, లక్ష్మణ్, సాహెబ్ బేగం, రామారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నేడు కొబ్బరి సాగు దారుల సమావేశం



నవతెలంగాణ-అశ్వారావుపేట

కొబ్బరి సాగు దారుల సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక రైతు వేదికలో నిర్వహించనున్నట్లు తెలంగాణ కొబ్బరి సాగు దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆలపాటి రాంమోహన్ రావు (రాము), కొక్కెరపాటి పుల్లయ్యలు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి కొబ్బరి సాగు చేసే ప్రతీ రైతు సకాలంలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

రైతులకు ప్యాకేజీ ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలం

- తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్రావు



నవతెలంగాణ-పినపాక

ప్రాజెక్టుల పేరుతో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి పరివాహక ప్రాంత రైతులను తీవ్రంగా మోసం చేస్తుందని, వారికి రావలసిన ప్యాకేజీలు సైతం ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న రైతాంగాన్ని పూర్తిస్థాయిలో ముంచే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పై మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు మూలంగా భూమిని కోల్పోయిన చిన్న సన్నకారు, గిరిజన గిరిజనేతర రైతులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గంలలో ముంపు బారినపడి చాలామంది రైతులు పంట నష్టపోతున్నారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ నియోజకవర్గాల్లో పర్యటించి ఈ ప్రాంతానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి, అశ్వాపురం మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బూర్గంపాడు మండల అధ్యక్షులు నాగిరెడ్డి, పార్టీ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సోయం ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకువెళ్ళాలి

- గంగులు చారిత్రక నవల ఆవిష్కరణ



నవతెలంగాణ-దమ్మపేట

కోయజాతి ముద్దుబిడ్డ సోయం గంగులు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు తీసుకువెళ్ళాలని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని జమేదారుబంజరలో సోయం గంగులు చారిత్రక నవల ఆవిష్కరణ సభ గుర్రం అచ్చయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట కాలంలో దమ్మపేట మండలం జమీదారు బంజర గ్రామవాసి సోయం గంగులు ఆనాటి పాల్వంచ తాలూకాలో కమ్యూనిస్టు వీరుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఈ ప్రాంతంలో నైజామ్, రజాకార్లకు వ్యతిరేకంగా, జమీందారులకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు చేసి గెరిల్లా వీరుడుగా గుర్తింపు పొందారని అన్నారు. ఈక్రమంలో ఆయనను 1951 మార్చి27-29మధ్యన యూనియన్ సైన్యాలు కాల్చి చంపారని అన్నారు. అలాంటి మహనీయుని చరిత్ర ఈనాటి యువతకు ఆదర్శం కావాలని, ఆయన ఆశయాలను ఈనాటి యువత ముందుకు తీసుకెళ్లిననాడే సోయం గంగులకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) కెచ్చల రంగారెడ్డి, రాయల సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ పుసులూరి నరేంద్ర, ఆళ్ల రామారావు, మనోహర్ రాజు, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, రేపాకుల శివలింగం, రచయిత అనసూయ, కాంతారావు, రామ్మోహన్ రావు, సాగర్, అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, కంగాల కన్నయ్య, కిషోర్, వాసం బుచ్చిరాజు, సున్నం జగన్, ఊకె మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల జోడో యాత్రను జయప్రదం చేయండి

నవతెలంగాణ-పినపాక

ఈ నెల 21న ప్రారంభంకానున్న మా దిగల జోడో యాత్రను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ పినపాక నియోజకవర్గ కన్వీనర్ తోకల శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం పినపాక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంకు ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే మొదటి విడత మాదిగల జోడో యాత్రకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలి

నవతెలంగాణ-పినపాక

మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని ఆదివాసి ఉద్యోగుల సంస్కృతిక, సంక్షేమ సంఘం డివిజన్ నాయకులు అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పినపాక మండలం జానంపేటలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డివిజన్ అధ్యక్షులు పోలబోయిన అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవం సమ్మక్క సారలమ్మ జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద మేడారం జాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను అధికారికంగా నిర్వహించి వాహనాల రద్దీ కారణంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు మూడు రోజులు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి ఉద్యోగ సంఘ నాయకులు కొమరం కేశవరావు, కన్నయ్య, రామారావు, నాగరాజు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మోతే శివాలయంలో వైభవంగా దీపోత్సవం

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని మోతే పట్టీ నగర్ గ్రామంలోని శివాలయంలో మంగళవారం దీపో త్సవం వైభవంగా నిర్వహించారు. పరమేశ్వరుని జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురస్కరిం చుకుని సహస్ర దీపాలంకరణ సేవను భక్తులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లోని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆల యం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం 1008 దీపాలు వెలిగించి దీపోత్సవం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు, ఆల యకమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

విప్లవస్ఫూర్తి గల నేత నాగేశ్వరావు

నవతెలంగాణ-ఇల్లందు



విద్యార్థి దశ నుండి కార్మిక నాయకత్వం వహించి అనేక ప్రజా పోరాటాలకు పిలుపు ఇచ్చి పోరాడేవాడని అలాంటి విప్లవ స్ఫూర్తి గల నాయకుడు కామ్రేడ్ దయ్యాల నాగేశ్వరావు అని సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు ఆలేటి కిరణ్, కుకట్ల శంకర్ అన్నారు. దయ్యాల నాగేశ్వరావు మూడో వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పులమల వేసి ఘనంగా నివాళు లర్పించారు. తాళ్లురి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. విద్యార్థి, యువజన, కార్మిక రంగాల్లో ప్రజా సమస్యలను తీసుకొని పోరాడిన మంచి కమ్యూనిస్టు దయ్యాల నాగేశ్వరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్బిజే రాజు, ఎస్.విజయ్ కుమార్, మండల నాయకులు మన్నెం మోహన్‌రావు, ఏం. లక్ష్మి, పీ. లక్ష్మి వీరయ్య, సత్యనారాయణ కోరి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుటలో పర్యటించిన కార్పొరేట్ జనరల్ మేనేజర్స్

నవతెలంగాణ-ఇల్లందు

వివిధ గనులు, స్టోర్ నందు ఉన్న స్క్రాప్‌ను గుర్తించడానికి కమిటీ సభ్యులైన కార్పొరేట్ జనరల్ మేనేజర్స్ బిజిఎస్ఎస్ఎన్. మాచరయ్య(స్టోర్స్), బిఆర్. దీక్షితులు(సెక్యూరిటీ), డిజియం(సెక్యూరిటీ) వేణు మాధవ్ మంగళవారం ఇల్లందు ఏరియాలో పర్యటించారు. ఏరియా స్టోర్, జెకే. 5 ఉపరిత గని, కోయగూడెం ఉపరిత గని ని సందర్శించి వినియోగంలో లేని స్క్రాప్ వివరాలనును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్, ఏరియా విభాగాల అధిపతులు శాలువా, పులా మొక్కతో సన్మానించారు. తదుపరి వారు ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ బొల్లం వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, స్టోర్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ పథకానికి మైనార్టీలు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ పాల్వంచ

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థుల కొరకు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వార అందిస్తున్న సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ అధ్యక్షులు యండీ. యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయల లోపు కలిగి, గత ఏడాది 2023 ఆగస్ట్ - డిసెంబర్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్ డిలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మాత్రమే ఈ స్కాలర్ షిప్ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు మార్చి 20వ తేదీ లోపు సంబంధిత ధృవీకరణ పత్రాలతో www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ ఆన్లైన్ చేసి, హార్డ్ కాపీని ఏప్రిల్ 15 లోపు జిల్లా మైనారిటీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఈ ఉపకార వేతనాలకు ఎంపికైన వారికి 20 లక్షల రూపాయలతో పాటు విమాన చార్జీల నిమిత్తం 60 వేల రూపాయలు కూడా అందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కొరకు 8520860785 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

విస్తరిస్తున్న 'భాగం' ఫౌండేషన్ సేవలు

'ఆదరణ' ఫౌండేషన్‌కు నిత్యావసరాలు' వితరణ

నవతెలంగాణ - బోనకల్



భాగం సేవా ఫౌండేషన్ తమ సేవా కార్యక్రమాలను నిర్విరామంగా కొన సాగిస్తుంది. ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్ఆర్ఐ భాగం రాకేష్ తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ సేవా నిరతిని చాటుకుంటున్నారు. మండల పరిధిలోని గోవిందాపురం (ఏ) గ్రామానికి చెందిన ఎన్నారై భాగం రాకేష్ భాగం సేవా ఫౌండేషన్ ను స్థాపించాడు. ఆ సంస్థ ద్వారా పలు సేవలు చేస్తున్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన మధిరలో సుశీల డిగ్రీ కాలేజ్ రోడ్‌లో గల ఆదరణ ఫౌండేషన్ వారి అవసరాలను గమనించి బియ్యం, నిత్యావసర సరుకులను మంగళవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు భాగం రాధాకృష్ణ మాట్లాడుతూ నేటి యువత సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలని, తద్వారా పలువురికి ఆదర్శంగా మారతారన్నారు. అనంతరం ఆదరణ ఫౌండేషన్ నిర్వాహకురాలు నిస్సి మాట్లాడుతూ భాగం ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారు కొనసాగిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కావూరి వెంకటరావు, భాగం పాపారావు, గుండపనేని రాజేంద్రబాబు, షేక్ రంజాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు మండలంలో నిర్వహించిన రూ.5.61 కోట్ల విలువైన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదికను బుధవారం మండల పరిధిలో జలగంనగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా వేదికకు అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

జితేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-చంద్రుగొండ



మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్ నందు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేంద్ర జన్మదిన సందర్భంగా, వారిని మర్యాదపూర్వకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్చాన్ని అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జనరల్ సెక్రెటరీ కొదుమూరి దయాకర్ రావు, అశ్వరావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదల్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదల్ జనరల్ సెక్రెటరీ కోదుమూరు కోటేశ్వరరావు చంద్రుగొండ పార్టీ మండల నాయకులు చాపలమడుగు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మాతృమూర్తి పిల్లలమర్రి సుందర లక్ష్మి కన్నుమూత

పలువురి నివాళి

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



కామ్రేడ్ డా.పి.సుబ్బారావు మాతృ మూర్తి పిల్లలమర్రి సుందరలక్ష్మి (93) అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నాం కన్నుమూశారు. ఆదర్శ మాతృమూర్తి పిల్లలమర్రి సుందర లక్ష్మి 1931లో ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా ఘంటసాలలో జన్మనిచ్చింది ఆమె భర్త ముక్తేశ్వరరావు రిటైర్డ్ టీచర్‌గా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు, నలుగురు కుమారులు న్నారు. ఆమె ఎంతో ఆదర్శంగా సీపీఐ(ఎం)కి ఎన్నో సేవలు అందించారు. అదే బాటలో తన తనీయుడు డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావుని కూడా నడిపిస్తూ. పార్టీలో గాని, క్యాంపు కార్యక్రమాలలో గాని, అన్ని ప్రజారంగాలలో గాని ముందుండి నడిపించారు. మృతదేహాన్ని మేయర్ పి.నీరజ,రాంబ్రహ్మం దంపతులు, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా నాయకులు ఎర్ర శ్రీకాంత్, మాదినేని రమేష్, నవీన్‌రెడ్డి, బషీరుద్దీన్, ఆర్.ప్రకాష్, వన్ టౌన్ ఇంచార్జ్ జబ్బర్, సిపిఎం మాజీ మున్సిపల్ ఫోర్ లీడర్ వంజాపు లక్ష్మీనారాయణ, 26 డివిజన్ సిపిఎం నాయకులు కొల్లి వెంకటేశ్వర్‌రావు, దేవేంద్ర, ఝాన్సీ, కొత్త శ్రీనివాసరావు, జిల్లా మహిళా నాయకురాలు నాగసులోచన బేగం, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందు, తదితరులు పాల్గొన్నారు..





కాంగ్రెస్ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడుగా ఎండి మహబూబ్ ఆలీ

నవతెలంగాణ- నేలకొండపల్లి

కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ముస్లిం మైనారిటీ కమిటీ నేలకొండపల్లి గ్రామ అధ్యక్షుడుగా గ్రామానికి చెందిన ఎండి మహబూబ్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నేలకొండపల్లిలో ముస్లిం మైనారిటీ గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుతో పాటు కమిటీ ప్రధాన కార్యదర్శిగా పఠాన్ పాష, కోశాధికారిగా ఎస్కే సుభాన్, కమిటీ సభ్యులుగా ఎస్కే సొందుమియా, ఎస్ కే జహంగీర్ రఫీ, ఎస్కే షఫీ, ఎస్కే కాజా, ఎస్.కె అహ్మద్, ఎస్కే మీరాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎండి మహబూబ్ ఆలీ మాట్లాడుతూ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి ప్రస్తుతం నిర్మాణాలు నిలిచిపోయిన షాదిఖానా, కబరస్థాన్ నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. వాటి నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముస్లిం మైనారిటీ కమిటీ తరఫున కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రానున్న కాలంలో ముస్లింలు ఎదుర్కొంటున్న ఇల్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి అనేక సమస్యల పరిష్కారానికి కషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.



కృష్ణయ్య సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శం : ఎంఈవో

నవతెలంగాణ- కల్లూరు

తాను చేపట్టిన ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూ విద్యాబుద్ధులు క్రమశిక్షణ నేర్పి పలువురు ఉపాధ్యాయులకు నున్నా కృష్ణయ్య ఆదర్శంగా నిలిచారని ఎంఈఓ దామోదర్ ప్రసాద్ కొనియాడారు. మంగళవారం బాలికల ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పద్మ, సహాయ కార్యదర్శి బి. రాంబాబు, ఆధ్వర్యంలో టిసి క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న నున్నా కృష్ణయ్య, మార్చి 31 తేదీన పదవి విరమణ చేయుచున్న సందర్భంగా టి సి క్లాస్ ఆధ్వర్యంలో ఎంఈఓ దామోదర్ ప్రసాద్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, సహాయ కార్యదర్శి బి రాంబాబు, పలువూరు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని 55 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ సమస్యలపై కాంగ్రెస్ దృష్టి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు

రసాభాసగా మారిన సమావేశం

నవతెలంగాణ- ఖమ్మం

మహిళలకు జరుగుతున్న అన్యాయలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టిందని రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు మోగిలి అన్నారు. ఖమ్మం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, దేవి ప్రసన్నతో కలిపి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీతారావు మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒకటి కాకపోతే కవితను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం జరిగిన నారీ న్యాయ సమ్మేళనం సమీక్ష సమావేశంలో రసాభాస చోటు చేసుకుంది. రాష్ట్ర అధ్యక్షురాలు కలిసేందుకు వచ్చిన పొంగులేటి వర్గం మహిళ నాయకురాలు జై పొంగులేటి అని నినాదాలు చేశారు. వెంటనే జిల్లా అధ్యక్షురాలు సౌజన్య జై భట్టి అంటూ వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మరొక మహిళ నాయకురాలు జై తుమ్మల అంటూ వర్గపోరుతో నినాదాలు చేసుకున్నారు. ఇదంతా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు సమక్షంలో చోటు చేసుకుంది. ఖమ్మం జరుగుతున్న సమీక్ష సమావేశం తమ సమాచారం ఇవ్వలేదని పొంగులేటి,తుమ్మల మహిళ వర్గీయులకు జిల్లా అధ్యక్షురాలిపై ఫిర్యాదు చేశారు.ఆవేశంతో జిల్లా అధ్యక్షురాలు సౌజన్య మిమ్ములను పార్టీలోకి ఎవరు ఆహ్వానించారని మహిళ నాయకురాలు జ్యోతిర్మయిని ప్రశ్నించడం కొసమెరుపు. దీంతో నాయకురాలు అసహనంతో సమావేశం నుండి బయటికి వెళ్లిపోయారు. వెంటనే రాష్ట్ర అధ్యక్షురాలు జిల్లా అధ్యక్షురాలు చేతిలో ఉన్న మైక్ లాక్కొని వివాదానికి తెరదించారు.

ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రావూరికి అభినందనలు

నవతెలంగాణ- ఖమ్మం

రఘునాథపాలెం మండలం వి.వెంకటాయ పాలెం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా రావూరి సైదాబాబు, వైస్ చైర్మన్‌గా రావెళ్ళ శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సదర్భంగా చైర్మన్ రావూరి సైదాబాబు రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ప్రజలు నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని, రైతులతో మమేకం అవ్వాలని, వారి సమస్యలను తీర్చడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చావా నారాయణరావు, మిక్కిలినేని నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోట్ల వీరేందర్, నల్లమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు

నవతెలంగాణ- ఖమ్మం



తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్యామ్, ట్రెజరర్‌గా ఉపేందర్ రెడ్డి ఎంపికయ్యారు. అధ్యక్షుడితో పాటు మెత్తం ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో వివిధ డిపార్ట్మెంట్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు వారి కార్యవర్గ సభ్యులతో పాటు 200 మంది గెజిటెడ్ అధికార సంఘాల జిల్లా కార్యవర్గ సభ్యులు, పలువురు గెజిటెడ్ అధికారులు పాల్గొని ఏలూరిని ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వ కలసి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ రమేష్, వాసిరెడ్డి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ హరికిషన్, నయీం పాషా తదితరులు పాల్గొన్నారు.



ఐజెయు నేత రాంనారాయణను పరామర్శించిన తుమ్మల

నవతెలంగాణ- ఖమ్మం

ఇటీవల బైపాస్ సర్జరి చేయించుకొని కోలుకున్న టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం పరామర్శించారు. ఖమ్మం నగరంలో బురహాన్ పురంలోని రాంనారాయణ నివాసంలో యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు అమరవాధి రవీంద్ర శేషు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్‌రావు, సామినేని మురారీ, జిల్లా నాయకులు నలజాల వెంకట్రావ్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నగర కమిటి అధ్యక్ష, కార్యదర్శులు మైసాపాపారావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, ,ప్రెస్ క్లబ్ కార్యదర్శి కురాకుల గోపి,కోశాధికారి నామ పురుషోత్తం, జిల్లా నాయకులు మహేందర్, వై మాధవరావు, జనార్ధనచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దురద పాడుకు చెందిన బంధం సారయ్య బంధం వెంకటేష్ ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దాచారంలో గల తమ బంధువుల ఇంట్లో జరిగిన వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో అశ్వారావుపేట మండలంలోని కుడుములపాడు సమీపంలో అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేశారు. కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌హెచ్ఒ, ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంత్ సేవాలాల్ మార్గంలో నడవాలి

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ-అశ్వాపురం



బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీ సంతు సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం బ్యాంకు కార్యాలయం వెనక నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందాన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు తొలగడం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన మహనీయుడు అన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, డాక్టర్ శంకర్ నాయక్, తహశీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ గంట వరప్రసాద్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ షరీపుద్దీన్, మండల కో ఆప్షన్ ఎస్.కె ఖదీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బంజార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికే తలమానికంగా లేక్ పార్క్

- **ప్రారంభ సభలో ఎమ్మెల్యే కోరం, మున్సిపల్ చైర్మెన్ డీవీ**

నవతెలంగాణ-ఇల్లందు



బొగ్గుట పట్టణానికే తలమానికంగా లేక్ పార్క్ రూపుదిద్దుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మెన్ డీ.వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీ ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకొని నిర్మించిన లేక్ వ్యూ చిల్డ్రన్ పార్కును మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డివి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాయంకాలం పిల్లలతోటి సరదాగా సమయం గడిపేందుకు చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేశామన్నారు. పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తావని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నవీన్, మేనేజర్ అంకు షావలి, మున్సిపల్ కౌన్సిలర్లు తార, వారా రవి, కటకం పద్మావతి, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజం, తోట లలిత శారద, రేళ్ళ నాగలక్ష్మి, చీమల సుజాత, పాటోలు స్వాతి, అంకెపాక నవీన్ కుమార్, కుమ్మరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల డీఆర్ బకాయిలను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

2022 సంవత్సరం జులై నుండి పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల డిఆర్. బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్అండ్‌రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం యూ.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సారధినగర్ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపీచంద్, రాజేంద్ర ప్రసాద్, కె.శ్రీధర్, పి.కృష్ణారావు, కొమ్మాలు, వెంకటయ్య, పి.చంద్రశేఖర్, పి.వెంకన్న, సాహెబ్, వి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు పెట్టుబడి పెరిగింది..రుణ పరిమితి పెంచండి..

- **యూబీడీజీఎంకు మొర పెట్టుకున్న రైతులు**
- **వ్యవసాయ రంగానికి అండగా ఉంటాం**
- **యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంతరెడ్డి**

నవతెలంగాణ-అశ్వారావుపేట





సాగులో యాంత్రిక త,పంట ను ఆశిస్తున్న కొత్తరకం వ్యాధులతో పెట్టుబడి వ్యయం పెరిగిందని అందుకు అనుగుణంగా ఆర్ధిక సంస్థలు ఋణ పరిమితి పెంపుదల చేసి రైతులను ఆర్థికంగా చేయూతను ఇవ్వాలని యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంతరెడ్డి కి పలువురు రైతులు మొరపెట్టుకున్నారు. మంగళవారం యూనియన్ బ్యాంక్ స్థానిక బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో బ్యాంక్ డీజీఎం హనుమంతరెడ్డి బృందం స్థానిక రైతులు, నర్సరీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పామాయిల్‌కు ప్రస్తుతం రూ.3 లక్షలు రుణం అందిస్తున్నారని దానిని రూ. 5 లక్షలు కు పెంపుదల చేయాలని,అలానే పొగాకు బేరం కు రూ.5 లక్షల ఇస్తున్నారని దానిని కూడా రూ.7 లక్షల వరకు పెంచి రైతులకు అండగా నిలవాలని రైతు సంఘం నాయకులు డీజీఎం దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు తెలిపిన పలు విషయాలను సావధానంగా విన్న డీజీఎం మాట్లాడుతూ మీరు చెప్పిన ప్రతి విషయాన్ని బ్యాంక్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని, మా పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించి మిగిలిన సమస్యలపై అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి అతి త్వరలోనే మీరు అనుకున్నట్లుగా వ్యవసాయానికి పంట రుణాలను అందించే ఏర్పాటు చేస్తామన్నారు. రైతు సోదరులు కూడా బ్యాంకు అందించే అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా నిలబడుతూ బ్యాంకుకు కూడా సరైన సమయంలో అప్పు తీర్చేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆలపాటి రామ్మోహన్‌రావు సుంకవల్లి వీరభద్రరావు,కొక్కెరపాటి పుల్లయ్య,వేముల సూర్య ప్రకాష్ రావు,మొగళ్ళపు చెన్నకేశవరావు,కాసాని చంద్రమోహన్,వైస్ ఎంపీపీ ఫణీంద్ర, తాడేపల్లి రవి, బ్యాంకు సిబ్బంది మురళీకృష్ణ, శ్రీధర్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలి

- **సీపీఐ(ఎం) డిమాండ్**

నవతెలంగాణ-కరకగూడెం



కరకగూడెం మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం నూతన ఆర్టీసీ బస్టాండు నిర్మించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మణుగూరు బస్ డిపో కార్యాలయంలో స్థానిక మనేజరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మండల ప్రజలు ప్రయాణాల్లో బస్సు ఎక్కడం కోసం బస్టాండ్ సౌకర్యం లేక చెట్ల కింద షాపుల ముందు నిల్చుని పడి కాపులు కాస్తున్నారని, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన బస్టాండ్ నిర్మాణానికి అధికారులు తక్షణమే చొరవ చూపాలని సంబంధిత అధికారులను కోరారు. బస్టాండ్ నిర్మాణం కొరకు సీపీఐ(ఎం) దశల వారి పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఊక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి 6వేల ప్రత్యేక బస్సులు

- జిల్లాల్లో 51 క్యాంపులు ఏర్పాటు : టీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క, సారక్క జాతరకు ఆరువేల ప్రత్యేక బస్సుల్ని నడుపుతున్నట్టు టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. తెలంగాణ కుంభమేళాగా ప్రాచుర్యం పొందిన ఈ జాతరకు ప్రయాణీకులు ఆర్టీసీ సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బస్సులు ఇప్పటికే మేడారానికి వెళ్లాయనీ, ముఖ్యంగా యాత్రీకుల రద్దీ ఎక్కువగా ఉండే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో 51 క్యాంపులను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని తెలిపారు. ఈ జాతరకు ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకం అమల్లో ఉంటుందనీ, మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చని వివరించారు. జాతర ప్రత్యేక బస్సుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో రెగ్యులర్ సర్వీసులను తగ్గించామని చెప్పారు. దీనివల్ల సాధారణ ప్రయాణికులకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందనీ, ప్రత్యేక పరిస్థితుల్లో ఆర్టీసీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మాటే మంత్రం...

- 'సురభి' వాయిస్ స్పీచ్ వర్క్‌షాప్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మాట...విలువ కట్టలేని వ్యక్తిత్వానికి నిలువెత్తు సాక్ష్యం. ఆ మాటను మృదుమధురంగా చెప్పగలిగితే ఎదుటి వ్యక్తులు సమ్మోహితులు కావల్సిందే. అందరూ మాట్లాడతారు. కానీ కొందరే ఆకట్టుకోగలుగుతారు. మాట్లాడే మాటలో స్వర సంబంధం, స్పష్టత, గాంభీర్యం, మృదుత్వం, లాలింపు ఉంటే వినడానికి వినసొంపుగా ఉంటాయి. మనం నిత్యం మాట్లాడే మాటలకు కొంత శిక్షణ తోడైతే, ఆ చిలుక పలుకులకు ఉండే ప్రాధాన్యతే ప్రత్యేకం. దానికితోడు 'మాట'నే పెట్టుబడిగా పెట్టి ఉపాధి అవకాశాలు పొందొచ్చు. ఇలాంటి మాటలకు శిక్షణ ఇచ్చి, ఆత్మస్థైర్యంతో కూడిన వ్యక్తిత్వ వికాసాన్ని అందించేందుకు సురభి కళా క్షేత్రం సిద్ధమైంది.

మాటల స్వర స్థాయిల్ని తెలుసుకుని, ఎవరి రంగంలో వారు గుర్తింపు పొందే అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రముఖ రేడియో జాకీ (ఆర్‌జే), వాయిస్ అండ్ యాక్టింగ్ ట్రైనర్ డాక్టర్ సురభి రమేష్ నేతృత్వంలో ఈనెల 25 నుంచి వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. నెలరోజుల ఈ శిక్షణా శిబిరంలో డబ్బింగ్, స్టోరీ టెల్లింగ్, పాడ్ కాస్ట్, న్యూస్ రీడింగ్, పబ్లిక్ స్పీకింగ్, స్క్రిప్ట్ రీడింగ్ వంటి అనేక అంశాలపై శిక్షణ ఇస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట, యశోదా ఆస్పత్రి పక్కనే ఉన్న దుర్గా అపార్ట్‌మెంట్‌లో శిక్షణా తరగతులు ఉంటాయి. మరిన్ని వివరాల కోసం సురభి రమేష్‌ను ఫోన్ నెంబర్లు 9490423885, 6309413885 లో సంప్రదించవచ్చని మంగళవారం నాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు.

నేడు ఎప్‌సెట్ నోటిఫికేషన్

- 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ ఆరో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. మే తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరంలో వంద శాతం సిలబస్‌తో ఎప్‌సెట్‌ను నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 26 నుంచి పూర్తిస్థాయి వివరాలతో నోటిఫికేషన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఈనెల 21న ఉదయం పది గంటల నుంచి https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కాళేశ్వరం కుంభకోణంతో ఖజానా ఖాళీ

- బీజేపీ, బీఆర్‌ఎస్ పొత్తు అన్నవారిని చెప్పుతో కొట్టండి
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు : కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- తాండూరులో బీజేపీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభం



నవతెలంగాణ-తాండూరు

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో కాళేశ్వరంలో జరిగిన కుంభకోణంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. మీడియాకు లీకులు ఇస్తూ లేనిపోని ప్రచారాలు చేస్తున్న వారికి ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణలో బీజేపీ పొత్తు పెట్టుకోలేదని, ఇప్పుడు ఓడిపోయిన పార్టీతో పొత్తు ఎలా పెట్టుకుంటామని, పొత్తు ఉంటుందన్న వారిని చెప్పుతో కొట్టాలన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా తాండూర్ పట్టణ కేంద్రంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను ప్రారంభించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, చేవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్‌పై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉంటే కేసీఆర్‌ను ఇప్పటికే జైల్లో పెట్టేవాళ్లమన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, కృష్ణా జలాల అప్పగింతపై రెండు పార్టీలు విమర్శలు చేసుకుంటూ అసెంబ్లీలో బైపాస్ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో కచ్చితంగా మూడోసారి మోడీ ప్రభుత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ, జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి, సీనియర్ నాయకులు యు.రమేష్ కుమార్, ఎం.నరేష్‌మహరాజ్, గాజుల శాంతుకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు బాలి శివకుమార్, అంతారం లలిత, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, కౌన్సిలర్ సాహు శ్రీలత, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,560	▼ 110
22 క్యారెట్లు	57,350	▼ 100
కిలో వెండి	77,000	▼ 500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 135
రిటైల్ (లైవ్)	రూ. 157
స్కిన్‌తో	రూ. 228
స్కిన్‌లెస్	రూ. 259

మన కంచంలో బ్రెజిల్ పప్పు

దిగుమతులపైనే మోడీ సర్కార్ దృష్టి

శాస్త్రవేత్తల పరిశోధనలు..దిగుబడులు ఉన్నా విదేశాలపైనే ఆధారం





భారతదేశంలో పండించే పంటలకు బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. విదేశాల్లోనూ ఎగబడి కొనుగోలు చేస్తారు. అయితే ఇప్పటికే నూనెలు..ఇతర వస్తువులను విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటుండగా ..ఇకపై మన కంచంలోకి బ్రెజిల్ పప్పు కూడా రాబోతోంది. విదేశాల నుంచి అవసరం ఉన్నా.. లేకపోయినా మోడీ పర్యటనల్లో ఎంఓయూలు కుదుర్చుకోవటం సర్వసాధారణమైపోయింది. అయితే ఇక్కడి రైతు రోడ్డెక్కి మద్దతు ధర ఇవ్వాలని వీధుల్లోకొచ్చి మొత్తుకుంటున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. మీరు పంట పండించకపోయినా..విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామన్న ధోరణి కనిపిస్తోంది.

న్యూఢిల్లీ: పప్పులు...ముఖ్యంగా కందిపప్పు, మినపపప్పు వాణిజ్యంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి భారత్, బ్రెజిల్ కృషి చేస్తున్నాయి. ఇటీవల రెండు దేశాల అధికారులు సమావేశమై దీనిపై చర్చించారు. పప్పుల సరఫరాలో బ్రెజిల్‌ను విశ్వసనీయ దేశంగా తాము పరిగణిస్తున్నామని ఈ సందర్భంగా భారత అధికారులు తెలిపారు. పప్పు ధాన్యాలకు సంబంధించిన ఆహార భద్రతలో ఉమ్మడి భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడం పై చర్చించామని న్యూఢిల్లీలోని బ్రెజిల్ రాయబార కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతాధికారి మరీసియో తెలిపారు.

గత సంవత్సరం బ్రెజిల్ నుండి మూడు వేల టన్నుల మినపపప్పును దిగుమతి చేసుకున్నామని వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ ఇటీవల చెప్పారు. పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మరో 20 వేల టన్నులను దిగుమతి చేసుకోవాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ద్వైపాక్షిక వ్యవసాయ వాణిజ్యాన్ని విస్తరించుకునేందుకు పప్పు ధాన్యాలు దోహదపడతాయని ఆయన చెప్పారు. కాగా దేశంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి పడిపోతున్న నేపథ్యంలో మినుము, కంది పంటలు పండించాలని బ్రెజిల్‌లోని వ్యాపారులు, అధికారులను రోహిత్ కుమార్ గత నవంబరులో కోరారు.

ప్రపంచంలో భారత్‌లోనే అత్యధికంగా పప్పు ధాన్యాల పంటలు పండిస్తున్నారు. వాటి వినియోగం కూడా మన దేశంలో ఎక్కువే. ఏటా 28 మిలియన్ టన్నుల పప్పులు అవసరమవుతున్నాయి. దేశీయంగా డిమాండ్ పెరుగుతుండడంతో పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోంది.

విదేశీ దిగుమతులు ఎంతంటే..

మన దేశంలో పప్పుధాన్యాలను ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఉత్పత్తిలో 20 శాతం వరకు ఇతర దేశాల (కెనడా, మయన్మార్, రష్యా, అమెరికా, ఆస్ట్రేలియా) నుంచి దిగుమతి అవుతున్నాయి. 2001-02లో దిగుమతి ఖర్చు రూ. 3,160 కోట్లు వుండగా, 2013-14లో రూ.10,551 కోట్లు వుంది. తలసరి పప్పుధాన్యాల లభ్యత మన దేశంలో 51.1 గ్రా/ ఒక రోజుకు (1971) నుంచి 41.9 గ్రా. / ఒక రోజుకు (2013) పడిపోయింది, ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన 80 గ్రా. / ఒక రోజుకు కంటే చాలా తక్కువ, జాతీయ పప్పుధాన్యాల పరిశోధనా సంస్థ, కాన్పూరు వారి ప్రకారం మన దేశంలో జనాభా 2030 నాటికి 1.68 మిలియన్ల అవుతుందని, అందుకనుగుణంగా 32 మి.ట. పప్పుధాన్యాలు అవసరమవుతాయని తెలుపుతోంది. ఈ అవసరాన్ని అందుకోవాలంటే అదనంగా 3-5 మి.హె. విస్తీర్ణంలో పప్పుధాన్యాలు సాగు కావాలని, అలాగే ఉత్పాదకతను హెక్టారుకు 1361 కిలోలు సాధించాల్సిన అవసరం వుంది.

భారత్‌లో పప్పుధాన్యాల పంటల ఉత్పత్తి ఎంతంటే..



ప్రపంచ వ్యాప్తంగా 171 దేశాలలో పప్పుధాన్యపు పంటలను పండిస్తున్నారు. మన భారత దేశం పప్పుధాన్యాల పంటల ఉత్పత్తి 25 శాతంగా, ఆహారంగా తీసుకోవడం 27 శాతంగా ఉన్నది. అంటే ఈ లెక్కన గ్యాప్ చాలా తక్కువ. కాని కేంద్రం దిగుమతి చేసుకోవడంలోనే 14 శాతం ముందుంది. ఆహార గింజల విస్తీర్ణంలో పప్పుధాన్యాలు 20 శాతం, అదే విధంగా ఉత్పత్తిలో 7-10 శాతం వరకు ఆక్రమిస్తున్నాయి. పప్పుధాన్యాలను ఖరీఫ్, రబీ కాలంలో పండిస్తున్నప్పటికీ, రబీలో పప్పుధాన్యపు పంటల సాగు 60 శాతము వరకు ఉంది. పప్పుధాన్యపు పంటల విస్తీర్ణం 1950-1951వ సంవత్సరములో 19 మి.హెగా వుండగా, 2013-14వ సంవత్సరంలో 25 మి.హె.గా వుంది. అదే కాలంలో ఉత్పత్తి 8.41 మి.ట. నుండి 19.27 మి.ట. గా పెరిగింది. మన దేశంలో పప్పుధాన్యాలను పండించే ఐదు రాష్ట్రాలు వరుసగా మధ్యప్రదేశ్, మహరాష్ట్ర రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ , కర్నాటక ఉన్నాయి.

మన దేశంలో పప్పుధాన్యపు పంటల ఉత్పాదకత హెక్టారుకు 440 కిలోల (1950-51) నుంచి 769 కిలోల (2013-14) వరకు, అంటే 46 శాతం పెరిగింది. ఉత్పాదకత ఫ్రాన్స్లో హెక్టారుకు 4,219 కిలోల, కెనడాలో 1986 కిలోలు, అమెరికాలో 1882 కిలోలు, రష్యాలో 1648 కిలోలు, చైనాలో 1,596 కిలోలుగా వుండగా, మన దేశంలో 764 కిలోలు మాత్రమే. పప్పుధాన్యపు పంటల విస్తీర్ణం (0.08 శాతం), ఆహార గింజలు (0.21 శాతం), వరి (0.058 శాతం), గోధుమ (1.7 శాతం) మరివు నూనెగింజలు (1.4 శాతం) తో పోలిస్తే వార్షిక సమ్మేళన వృద్ధి రేటు (సీఏజీఆర్) 1950-51 వ సంవత్సరం నుంచి 2013-14 సంవత్సరం వరకు తగ్గింది. కారణం, ఇప్పటికీ మన దేశంలో పప్పుధాన్యాలను సారవంతం లేని నేలల్లో , చౌడు నేలల్లో పండించడమే.

అంతే కాకుండా ఎక్కువగా వర్షాధారంగా పండిస్తుండమే. అయితే ఈ పంటను కూడా మధ్యదళారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించటంతో అటు రైతుకు, ఇటు వినియోగదారులని నిలువునా మోసం జరుగుతోంది. దీనిపై మోడీ ప్రభుత్వం కట్టడి చేయాల్సి ఉండగా..అందుకు భిన్నంగా వ్యవహరించటంతో..విదేశాల నుంచి దిగుమతిపైనే కేంద్రం ఆధారపడుతోంది.

పరిశోధనలు ఉన్నా..

జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు , కృషి విజ్ఞాన కేంద్రాలు పప్పుధాన్యపు పంటలలో అధిక దిగుబడి నిచ్చే రకాలు, పురుగు, తెగుళ్ళను తట్టుకునే రకాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులపై ప్రదర్శనా క్షేత్రాలు, శిక్షణా కార్యక్రమాలు , ఇతర విస్తరణ కార్యక్రమాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడం జరుగుతోంది. 2010-11వ సంవత్సరం నుంచి జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా పప్పుధాన్యపు పంటలలో ఉత్పాదకతను పెంచడానికి రైతుల పొలాల్లో మొదటి తరహా ప్రదర్శనా క్షేత్రాలను నిర్వహించి, రైతులను ప్రోత్సహించడం జరుగుతోంది. అలాగే వ్యవసాయం , రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా కూడా పప్పుధాన్యపు పంటలలో ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించడం జరుగుతోంది.

ఐక్యరాజ్యసమితి, అన్ని సభ్యదేశాల అనుమతితో 2016వ సంవత్సరాన్ని "ప్రపంచ పప్పుధాన్యపు పంటల సంవత్సరంగా" ప్రకటించింది, పప్పుధాన్యపు పంటల ఉపయోగాలను, దిగుబడులు పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలను, పోషకాహారంలో పప్పుధాన్యపు ప్రాముఖ్యతను గురించి తెలియజేయడానికి మోడీ ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపటంలేదని రైతులు, రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

రద్దీ పెరిగితే.. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంపు

ప్రస్తుతం 3 నుంచి 3.5 నిమిషాలకో మెట్రో రైలు

జేబీఎస్-ఎంజీబీఎస్ రూట్లో 6 నిమిషాలకో రైలు

- మెట్రోలో ప్రతిరోజూ 5లక్షల మంది జర్నీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ నుంచి మేడారం జాతరకు వందలాది ఆర్టీసీ బస్సులను పంపించారు. నేటి నుంచి మేడారం మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే సిటీ నుంచి దాదాపు 2వేలకుపైగా బస్సులు అవసరమైన పాయింట్లకు వెళ్లగా.. గ్రేటర్‌లో కేవలం 600 బస్సులే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు వివిధ వృత్తి పనుల కోసం వెళ్లేవారు బస్సుల్లేక అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి బస్టాపుల్లో బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ప్రజలను ప్రత్యామ్నాయ రవాణా చూసుకోవాలని కోరింది. సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వెళ్లే సందర్శకులకు, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. బస్సుల సంఖ్య తగ్గడంతో మెట్రోలో రద్దీ పెరిగింది.

అవసరమైతే ట్రిప్పులు పెంచుతాం..

గ్రేటర్ జోన్‌లో ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసులను తగ్గించడంతో ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్యాసింజర్ వాహనదారులు, డ్రైవర్లు అడ్డగోలుగా ధరలు పెంచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ జనం గమ్యస్థానాలకు చేరేందుకు హైదరాబాద్ మెట్రో రైలును ఆశ్రయించనున్నారు. ట్రాఫిక్ రహితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న మెట్రోకు ఆదరణ బాగుంది. ఆటోలు, బస్సులతో పోల్చితే నిమిషాల వ్యవధిలో, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గమ్యస్థానాలకు వెళ్లే అవకాశం ఉండటంతో చాలామంది మెట్రోకే మొగ్గు చూపుతున్నారు. అయితే, ఇప్పటికి హైదరాబాద్ మెట్రో అధికారులు ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. కానీ, ప్రయాణికుల రద్దీ పెరిగితే ప్రస్తుతమున్న రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచుతామని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గ్ కారిడార్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 3, 3.5 నిమిషాలకో ట్రైన్.. ఎంజీబీఎస్- జేబీఎస్ రూట్లో ఆరు నిమిషాలకో రైల్ నడుపుతున్నట్టు అధికారులు తెలిపారు. ఒకవేళ అవసరమైతే అప్పుడు రద్దీకి అనుగుణంగా 3నిమిషాలకో ట్రైన్ నడుపుతామని చెబుతున్నారు. ఎల్బీనగర్-మియాపూర్, నాగోలు- రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ కారిడార్ల పరిధిలోని 57 స్టేషన్ల ద్వారా రోజుకు 1,065 సర్వీసులను నడిపిస్తున్నారు. ప్రతిరోజూ 5-5.10లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం కూడా ఇదే స్థాయిలో ప్రయాణికుల ఫుట్‌ఫాల్ నమోదైందని మెట్రో అధికారులు తెలిపారు.

టీజీవో నూతన అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాసరావు

- ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ తిరిగి ఎన్నిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టీజీవో) సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శిగా ఎ సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా బి శ్యామ్, ఉపాధ్యక్షులుగా ఎ జగన్ మోహన్‌రావు, కోశాధికారిగా ఎం ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా ఎ పరమేశ్వర్‌రెడ్డి, మహిళా ప్రతినిధిగా జి దీపారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మాచర్ల రామకృష్ణగౌడ్, కార్యనిర్వాహక సభ్యులుగా పంతంగి యాదగిరిగౌడ్, సలహాదారులుగా టి రవీందర్‌రావు, జి పురుషోత్తమ్‌రెడ్డి, వాంకుడోత్ సురేష్‌లు ఎన్నికయ్యారు. వారు మూడేండ్లపాటు ఈ పదవుల్లో ఉంటారు. అంటే 2027 వరకు లేదా తదుపరి ఎన్నికలు జరిగే వరకు కొనసాగుతారు. రిటర్నింగ్ అధికారులుగా ఎన్ రవి, సిహెచ్ సంపత్ కుమార్ వ్యవహరించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం అధికారులుగా శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజల్లో మంచిపేరు తెస్తామన్నారు. తమ జెండా, ఎజెండా ఉద్యోగుల సంక్షేమం మాత్రమేనని స్పష్టం చేశారు. గెజిటెడ్ అధికారుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని చెప్పారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం త్వరలో విడుదల చేయించడానికి, మెరుగైన పీఆర్సీ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. రాష్ట్రంలో గెజిటెడ్ అధికారులకు మెరుగైన వేతన సవరణ కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామనీ, న్యాయబద్ధమైన డిమాండ్లను సాధిస్తామని వివరించారు. సీపీఎస్ అంశం, ఈకుబేర్‌లో ఉన్న బిల్లుల విడుదల, 317 జీవో సమస్య, సాధారణ బదిలీల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి బైలాను పూర్తిగా మారుస్తామనీ, సవరిస్తామని చెప్పారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించి త్వరితగతిన పూర్తి చేయాలని తీర్మానాన్ని ఆమోదించామని వివరించారు.

ఫలరాజంపై వాతావరణం ఎఫెక్ట్

ఈ ఏడాది మామిడి పూత ఆలస్యం

కొన్నిచోట్ల విరగపూత.. మరికొన్ని చోట్ల అంతంతే..



సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారుల సూచన

నవతెలంగాణ- మొఫిసిల్ యంత్రాగం

రాష్ట్రంలో మామిడి రైతుకు వాతావరణ రంధీ పట్టుకుంది. నవంబర్, డిసెంబర్ నెలల్లోనే మామిడి తోటలు పూతలతో నిండిపోవాలి. వాతావరణంలో మార్పులు కారణంగా ఈయేడాది పూత రావడం ఆలస్యమైంది. సంక్రాంతి పండుగ తర్వాత పూత కనిపిస్తోంది. కొన్నిచోట్ల విరగపూయగా.. మరికొన్నిచోట్ల అంతంతమాత్రమేగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో చీడ పీడలు అధికంగా ఉండడంతో వచ్చిన పూత కూడా పిందగా మారకుండానే రాలిపోతోంది. పూతకొస్తున్న దశలో రాత్రివేళ చల్లదనం మామిడితోటలకు మేలు చేస్తోంది. కానీ అతి మంచు, తీవ్రమైన చలి పరిస్థితులతో మామిడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో సాధారణం కంటే మామిడి పూత ఆలస్యంగా వస్తుండడంతో రైతుల్లో దిగులు నెలకొంది. సస్యరక్షణ చర్యలు చేపడుతూ తోటలను కాపాడుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సహకరించని వాతావరణ పరిస్థితులు

ప్రధాన ఉద్యాన పంటైన మామిడి వాతావరణ పరిస్థితులు సహకరించడం లేదు. ప్రతీయేటా డిసెంబరు మూడో వారం, జనవరి తొలి, మలి వారం నాటికి పూర్తి స్థాయిలో పూత వస్తుంది. జనవరి, ఫిబ్రవరిలో పిందెలు ఏర్పడి తదుపరి కాయలు వస్తాయి. ప్రస్తుత సీజన్‌లో అధిక వర్షాలు పడకపోవడం, రాత్రి వేళలో అతి చలి పెరగడం, తెగుళ్ల ప్రభావం వల్ల ప్రస్తుతం పూత ఆశించిన మేరకు రాలేదు. శాస్త్రవేత్తల సలహాలతో కొంతమేర ప్రయోజనం ఉన్నా చాలామంది రైతులు వాటిని పాటించడం లేదు. ప్రధానంగా మామిడికి అక్కడక్కడ సోకిన తేనే మంచు, బూడిద రంగు తెగులు, తామర తెగులు కారణాల వల్ల మామిడి రైతులు దిగులు చెందుతున్నారు.

రాష్ట్రంలో 2,91,388 ఎకరాలల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 46 వేల ఎకరాలు, జగిత్యాలలో 36,315 ఎకరాలల్లో సాగవుతుంది. సంగారెడ్డిలో 13200, సిద్దిపేటలో 13 వేల ఎకరాలు, మెదక్‌లో 4 వేల ఎకరాలు, ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో 70 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. అత్యధికంగా కొల్లాపూర్‌లో 15000 ఎకరాల మామిడి తోటలు సాగు చేశారు. ఖమ్మం, తదితర జిల్లాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. ఈసారి ఎకరాకు 3 నుంచి 3.5 టన్నుల వరకు దిగుబడి రావచ్చునేది అధికారుల ప్రాథమిక అంచనా. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడం కారణంగా పూత సరిగా రాకపోయేసరికి మామిడి వ్యాపారులు తోటలు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ సారి ఆలస్యంగా వాతావరణ విషయంలో అంతు చిక్కడం లేదని మామిడి వ్యాపారులు అభి ప్రాయపడ్డారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో పూత రాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో పూత నుంచి పింద దశలో ఉండడం, ఇంకొన్ని ప్రాంతాల్లో పూత రాలుతుండడం వంటివి చోటుచేసుకున్నాయని రైతులు అంటు న్నారు. దీనికి తోడు అక్కడక్కడ మామిడి పంటపై తేనే మంచు పురుగు దాడి చేస్తోంది.

వాతవరణ మార్పులతోనే దిగుబడిపై ప్రభావం
జంపుల శ్రీనివాస్, పులిచర్ల , నల్లగొండ జిల్లా

ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణం గా పూత, కాతపై ప్రభావం చూపుతున్నాయి. దిగుబడి తగ్గుతుందని ఆందోళనగా ఉంది. పూతకు వచ్చిన తోటలకు పెద్దగా ఇబ్బందులు లేవు. పూత ఆలస్యంగా వచ్చిన తోటల్లో మాత్రం దిగుబడిపై ప్రభా వం చూపే పరిస్థితులు ఉన్నాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..



మామిడి పూత ఆలస్యంగా వస్తోంది. ప్రస్తుతం పూత పిందెగా మారే దశలో మామిడి ఉంది. తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

సంగీతలక్ష్మి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి


పిల్లలు పుట్టిన తర్వాత మహిళల జీవితం ఇంటికే పరిమితమవుతుందనుకుంటారు కొందరు. కానీ ఈ తరానికి చెందిన మహిళలు మాత్రం ఇది కరెక్ట్ కాదని నిరూపిస్తున్నారు. పిల్లలు పుట్టిన కొద్ది రోజులకే తిరిగి పనిలోకి అడుగు పెడుతున్నారు. ఒక వేళ పిల్లల ఆలనా పాలనా చూడడం కుదరకపోతే కొంతకాలం కెరీర్‌కి గ్యాప్ ఇచ్చి తిరిగి ఉద్యోగ వేట ప్రారంభిస్తున్నారు. ఇలా తిరిగి కెరీర్‌ను ప్రారంభించే ముందు కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకుంటే మంచిదంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...





అమ్మ తర్వాత ఉద్యోగమా..?

ఫలానా రంగంలో ఉద్యోగం తెచ్చుకోవాలి, ఉన్నత స్థాయికి ఎదగాలి... ఇలా కెరీర్ పరంగా ఒక్కొక్కరిదీ ఒక్కో దారి. అలాగని అందరూ ఇలా తమ తపనకు తగిన ఉద్యోగమే చేస్తారని చెప్పలేం. ముందు ఏదో ఒక ఉద్యోగం చేయాల్సిన పరిస్థితులు తలెత్తవచ్చు. కొంత ఉద్యోగ అనుభవం సంపాదించాక ఆ దిశగా ప్రయత్నాలు చేయొచ్చు కదా అనుకోవచ్చు. ఇలా పలు కారణాల వల్ల తమ అంతిమ లక్ష్యాన్ని వాయిదా వేస్తూ వచ్చిన వారికి సెకండ్ ఇన్నింగ్స్ సరైన సమయం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇంట్లో ఉంటూ పిల్లల బాధ్యతలు చూసుకున్నప్పటికీ రోజులో అప్పుడప్పుడూ ఎంతో కొంత సమయం దొరుకుతుంది. మీ తపనను నెరవేర్చుకోవడానికి ఆ సమయాన్ని కేటాయించుకోవచ్చు. కాబట్టి ముందు ఏదో ఒక ఉద్యోగంతో సరిపెట్టుకున్నా ఇప్పుడు మీ తపనేంటో తెలుసుకోండి. అంతిమ లక్ష్యం దిశగా అడుగువేయండి. ఇలా కొత్త విషయాలపై అవగాహన పెంచుకుంటూ, నైపుణ్యాల్ని మెరుగుపరచుకుంటూ, టెక్నాలజీ విషయంలో అప్‌డేట్‌గా ఉంటూ రెజ్యూమెను అప్‌డేట్ చేసుకోవడం ఎంతో అవసరం అంటున్నారు నిపుణులు.



ఆత్మన్యూనత వద్దు

కొంత మంది మహిళలు సుదీర్ఘ విరామం తర్వాత ఉద్యోగం చేయడానికి కాస్త జంకుతుంటారు. తిరిగి నిలదొక్కుకోగలమో లేదో అన్న భయం ఉంటుంది. వీటిని కూడా అధిగమించవచ్చు అంటున్నారు నిపుణులు. గతంలో చాలా ఇంటర్వ్యూలకు హాజరై ఉండి ఉంటారు. కానీ, ఇదే మీ మొదటి ఇంటర్వ్యూ అనుకోండి. ఇందుకోసం మిమ్మల్ని మీరు కొత్తగా మార్చుకోండి. అవసరమైతే నిపుణుల సహంతో శిక్షణ తీసుకోండి. సీనియర్ల సలహాలు స్వీకరించండి. ఒక్క ఉద్యోగం కోసం వందలాది మంది రావొచ్చు. అంత మందిలో మీ ప్రత్యేకత తెలిసేదెలా? అందుకే ఉద్యోగ ప్రయత్నాల కంటే ముందే మీ నైపుణ్యాలను సరి చూసుకోండి. అప్పుడే ఏ మాత్రం భయం లేకుండా కొత్త ఉద్యోగానికి ప్రయత్నించొచ్చు.

ఆత్మవిశ్వాసం అవసరం

విరామం తర్వాత ఉద్యోగం కోసం ప్రయత్నించేటప్పుడు ఆందోళన సహజమే. అలాగని ప్రయత్నించకుండా భయపడటం అవసరం. మీ గత విజయాలను గుర్తు తెచ్చుకోండి. భవిష్యత్‌లో బిడ్డ ఆలనా పాలనా చూసుకుంటూనే ఉద్యోగం చేయాల్సి రావొచ్చు. అందుకే మీరేవిధంగా సన్నద్ధమయ్యారో, సమన్వయం చేసుకోగలరో కూడా చెప్పాల్సి రావొచ్చు. కాబట్టి వాటన్నింటికీ సూటిగా, స్పష్టంగా సమాధానాలు చెప్పగలిగితే వెనకడుగు వేయనక్కర్లేదు.

సమయం వృథా చేయొద్దు

రోజులు గడుస్తున్న కొద్దీ సమయం వృథా తప్ప మరే ప్రయోజనం ఉండదు. దీని వల్ల ఒక రకమైన అలసత్వం ఆవహించే అవకాశమూ లేకపోలేదు. కాబట్టి తిరిగి కెరీర్‌పై దృష్టి పెట్టే వారు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఉద్యోగ వేట ప్రారంభించాలంటున్నారు నిపుణులు. లేదంటే గ్యాప్ పెరిగిన కొద్దీ దాన్ని పూడ్చుకోవడం కష్టమవుతుందంటున్నారు. అవకాశాలూ సన్నగిల్లుతాయంటున్నారు. కనుక మీరు గతంలో పని చేసిన మీ సహోద్యోగులతో నిరంతరం టచ్‌లో ఉండడం, లింక్డ్‌ఇన్‌లో నెట్‌వర్క్ పెంచుకోవడం మాత్రం మర్చిపోవద్దు. తద్వారా ఆయా కంపెనీల్లో ఉండే ఖాళీల వివరాలు వారు మీకు తెలియజేసే అవకాశం ఉంటుంది. తద్వారా ఉద్యోగ ప్రయత్నాలు మరింత సులభమవుతాయి. అంతటితో ఆగకుండా మీ వంతుగా మీరు ఆయా జాబ్ పోర్టల్స్‌లో మీ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకుంటే వీలైనంత త్వరగా తిరిగి ఉద్యోగంలో చేరొచ్చు.

ఆచితూచి

కెరీర్‌లో గ్యాప్ తీసుకోవడం వరకు బాగానే ఉంటుంది. కానీ ఒక్కోసారి ఆ గ్యాప్‌ను పూడ్చడం అంత తేలిక కాకపోవచ్చు. అయితే అందుకు ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించే ముందు నుంచే సన్నద్ధం కావాలంటున్నారు నిపుణులు. కాబట్టి మీరు కెరీర్ నుండి ఎందుకు విరామం తీసుకోవాల్సి వచ్చింది? ఇన్ని రోజులు సమయం వృథా చేశారా? ఏవైనా నైపుణ్యాలు నేర్చుకున్నారా? లేదంటే ఏదైనా బిజినెస్ చేశారా? వంటి వివరాలన్నీ ఇంటర్వ్యూ చేసే బృందానికి ఓర్పుగా నేర్పుగా వివరించాల్సి వుంటుంది. ఇలా చెప్పే క్రమంలో ఏమాత్రం తడబడినా ఎదుటివారికి సందేహం వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఓ తల్లిగా పిల్లల ఆలనా పాలన చూసుకోవడానికే కెరీర్ నుంచి విరామం తీసుకోవాల్సి వస్తే నిస్సందేహంగా అదే విషయం చెప్పచ్చు. ఇక ఇప్పుడు ఉద్యోగానికి పూర్తి సన్నద్ధమయ్యానంటూ వారికి వివరిస్తే సరిపోతుంది. తద్వారా మీ పరిస్థితి వారు అర్థం చేసుకొని మీ అర్హతలు, మీ నైపుణ్యాల్ని బట్టి మీకు ఉద్యోగం కల్పించే అవకాశం కచ్చితంగా ఉంటుందంటున్నారు నిపుణులు.

కోర్సులు నేర్చుకోవచ్చు

అమ్మయ్యాక తిరిగి ఉద్యోగ వేట ప్రారంభించే తల్లులు కొత్త కోర్సులు నేర్చుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. కొత్తగా తల్లైన వారికి అంత సమయం ఉండచ్చు... ఉండకపోవచ్చు. కానీ పిల్లలు పెరిగి పెద్దయ్యే కొద్దీ, స్కూలుకెళ్లే వయసు వచ్చిన తర్వాత రోజులో గంటో, రెండు గంటలో సమయం దొరక్కపోదు. ఆ సమయాన్ని కెరీర్ పరంగా సద్వినియోగం చేసుకోవడం మంచిది. ఇందులో భాగంగా మీరు నేర్చుకోవాలనుకున్న కోర్సులు, పెంచుకోవాలనుకున్న నైపుణ్యాలకు సంబంధించిన తరగతులు ఆన్‌లైన్‌లోనే బోలెడున్నాయి. వాటిలో కొన్ని ఉచితంగానైనా చేరచ్చు. లేదంటే కొంత ఫీజు చెల్లించి చేరచ్చు. ఇలా మొత్తానికి ఖాళీగా సమయం వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకుంటే మీ ఉద్యోగ వేట మరింత సులభమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాలనుకునే మహిళలని ఇప్పుడు ఎన్నో సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా కొన్ని వెబ్‌సైట్లు కూడా పని చేస్తున్నాయి. ఇలాంటి వాటి ద్వారా మీరు కోరుకున్న ఉద్యోగాన్ని సంపాదించవచ్చు.

బెల్లి ఫ్యాట్ కరిగిద్దాం

పొట్ట వద్ద పేరుకుపోయే కొవ్వు కొన్ని దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. ఎక్కువ ప్రొటీన్ ఆహారం తినడం, వ్యాయామం చేయడం వంటివి పొట్ట కొవ్వును తగ్గించుకోవడానికి తీసుకోవలసిన కొన్ని చర్యలు మాత్రమే. ఈ కింది చిట్కాలతో పొట్ట కొవ్వును కరిగించుకోవచ్చు. పొట్ట కొవ్వును తగ్గించడానికి, మీ డిన్నర్‌లో ఈ కూరగాయలను చేర్చుకోండి

- రాత్రి భోజనంలో దోసకాయ తదితర కాయగూరలు తింటే బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది.



- పోషకాలు వుండే సొరకాయ రాత్రి భోజనంలో తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతుంది.
- రాత్రి భోజనంలో ఆకుకూరలు తింటే బరువు తగ్గుతారు.
- రాత్రి భోజనంలో వెజిటబుల్ రైస్ లేదా బచ్చలికూర సూప్ తీసుకోవడం వల్ల బెల్లీ ఫ్యాట్ త్వరగా తగ్గుతుంది.
- డిన్నర్‌లో బ్రకోలీని సలాడ్‌తో తీసుకుంటే కొవ్వు తగ్గుతుంది.
- క్యారెట్ బెల్లీ ఫ్యాట్ తగ్గించడంలో చాలా ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది.

ఎదగాలంటే..?

కెరీర్ అయినా, వ్యాపారమైనా మేమూ ఎవరికీ తీసిపోము అంటున్నారు ఈ తరం అమ్మాయిలు. టాప్‌లో నిలవడానికి ఎంత కష్టపడటానికైనా సిద్ధమంటున్నారు. ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి విజేతల జీవితాల గురించి తెలుసుకుంటున్నారు.

- ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలి. కొన్నిసార్లు సమయం వెంట పరుగెత్తి టాస్కులు పూర్తి చేయాల్సి వస్తుంది. అది సహజమే. చాలా సమయం ఉందని కూర్చోవడం, ఫోన్లు, చాటింగ్‌లు, ఇతర వ్యాపకాలు చూసుకుంటూ ఆఖర్లో పరుగులు తీస్తోంటే మాత్రం మీ తీరు మార్చుకోవాల్సిందే.



- ఎంత మెరుగ్గా పని చేస్తున్నారన్నదే ముఖ్యం. మనకు ఇల్లు, పిల్లలు బాధ్యతలు అదనమే అయినా, వాటి సాకుతో పని చేయకపోవడం, పొరపాట్లకు తావిస్తానంటే కుదరదు.
- 'అమ్మో తప్పులొస్తాయి' అని ప్రతిదానికీ వెనకాడొద్దు. కచ్చితత్వానికి మారుపేరైన సాంకేతికత కూడా కొన్ని సార్లు పొరపాటు చేస్తుంది. మనుషులం కావాలని కాకపోయినా తెలియకుండానే పొరపాట్లు జరుగుతాయి. అలాగని భయపడుతూ ఉంటే మిమ్మల్ని ఎవరైనా ఎలా నమ్ముతారు. నాయకురాలవ్వడానికి, పొరపాట్లకు బాధ్యత వహించడానికి వెనకాడొద్దు. తప్పులకు వెరవక వాటి నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తే చాలు.. అప్పుడు ఆగిపోవడమన్న మాటే ఉండదు.

2018 పరువునష్టం కేసులో... రాహుల్‌కు బెయిల్

లక్నో : 2018లో దాఖలైన ఓ పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా సివిల్ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. కర్నాటక శాసనసభ ఎన్నికల సందర్భంగా బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా రాహుల్ అభ్యంతరకరమైన వ్యాఖలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఓ హత్య కేసులో నిందితుడైన వ్యక్తి బీజేపీకి అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారంటూ రాహుల్ ఆ సమయంలో వ్యాఖ్యానించారు. కాగా విచారణకు రాహుల్ సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరు కావడంతో భారత్ జోడో న్యాయ్ యాత్రకు మరోసారి ఆటంకం ఏర్పడింది.

'రాహుల్ కోర్టులో లొంగిపోయారు. న్యాయస్థానం ఆయనను 30-45 నిమిషాల పాటు కస్టడీలోకి తీసుకుంది. ఆ తర్వాత రాహుల్ బెయిల్ కోసం దరఖాస్తు చేశారు. దానికి కోర్టు అంగీకరించింది. తదుపరి విచారణ తేదీ ఇంకా తెలియరాలేదు. రాహుల్ అమాయకుడని, పరువుకు నష్టం కలిగించే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆయన న్యాయవాది కోర్టుకు తెలియజేశారు' అని న్యాయవాది సంతోష్ పాండే విలేకరులకు చెప్పారు. కాగా రాహుల్ వ్యాఖ్యకు నాలుగు సంవత్సరాల ముందే ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం అమిత్ షాకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2005లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో అమిత్ షాపై మోపిన ఆరోపణలను తోసిపుచ్చింది. గుజరాత్ హోం మంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షాపై కేసును న్యాయస్థానం కొట్టివేసింది. రాహుల్ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని, ఆయన గొంతును ఎవరూ అణచలేరని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తెలిపారు. కాంగ్రెస్‌ను ఎవరూ భయపెట్టలేరని ఆయన అన్నారు.

ఏడాదికి రెండుసార్లు

న్యూఢిల్లీ : బోర్డు ఎగ్జామ్స్ విషయంలో కేంద్ర విద్యాశాఖ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. క్లాస్ 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలను విద్యార్థులు ఏడాదికి రెండుసార్లు రాసే ఆప్షన్‌ని తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. 2020లో ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)లో పేర్కొన్న లక్ష్యాలకు అనుగుణంగా, విద్యార్థులపై అకాడమిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. విద్యాపరంగా రాణించటానికి విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలను కల్పించటం కోసం.. ద్వైవార్షిక బోర్డు పరీక్షల పద్ధతిని ఎన్‌ఈపీ-2020 సూచించిందని ఆయన పేర్కొన్నారు. గతేడాది ఆగస్టులో విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించిన న్యూ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్సీఎఫ్) ప్రకారం.. మంచి పనితీరును కనబరచడానికి విద్యార్థులకు తగినంత సమయం, అవకాశం ఉండేలా బోర్డు పరీక్షలు సంవత్సరానికి కనీసం రెండుసార్లు నిర్వహించాలి. విద్యార్థులు బెస్ట్ స్కోర్‌ను సాధించే అవకాశం కూడా ఉంటుంది. ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లోని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాన్ పాల్గొన్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. కొత్త ఎగ్జామ్ ఫార్మాట్‌కు స్వాగతం పలుకుతున్నట్టు, రెండు సిట్టింగ్‌లను ఉపయోగించుకుని తమలోని సామర్థ్యాన్ని బయటకు తీసుకురావాలని కేంద్ర మంత్రి వారిని కోరారు.

బీజేపీ నేతలవి దిగజారుడు రాజకీయాలు

- మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి నిజాయితీ, నిబద్ధతకు మారుపేరని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన ఆరోపణలు ఆయన దిగజారుడుతన రాజకీయాలకు పరాకాష్ట అని పేర్కొన్నారు.

కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

గుడిసెలన్నీ కాలిబూడిదై రోడ్డున పడ్డారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బాధిత కుటుంబాలకు రూ.లక్ష సాయం సహా పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ నుంచి జగిత్యాలకు వెళ్లే రహదారి పక్కనే సుభాష్‌నగర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు పూరిళ్లు వేసుకుని సుమారు 50 కుటుంబాలు 20ఏండ్లుగా నివాసముంటున్నాయి. గుడిసె వాసులంతా కలిసి సమ్మక్కసారలమ్మ దర్శనం కోసం సోమవారమే మేడారానికి వెళ్లారు. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో గుడిసెల నుంచి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలార్పేందు ప్రయత్నిస్తుండగానే ఓ గుడిసెలోని వంటగ్యాస్ సిలిండర్ పేలి మంటలు ఎగిసిపడ్డాయి. ఒక్కసారిగా దవానంలా వ్యాపించిన మంటలు చుట్టూ ఉన్న సుమారు 50పూరిళ్లకు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకునేసరికే మరో వంటగ్యాస్ సిలిండర్ పేలింది. ఇలా వరుసగా మరో మూడు సిలిండర్లు పేలడంతో చుట్టుపక్కల జనమంతా పరుగులు తీశారు. అతికష్టం మీద అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పేశాయి. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుడిసెలు, అందులోని టీవీ, వంట, ఇతర సామాగ్రి బూడిదయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే సమ్మక్క-సారలమ్మ చిత్రపటాల ఎదుట పెట్టిన దీపాలు అంటుకోవడంతోనే అగ్నిప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న గుడిసెవాసులు సాయంత్రానికి అక్కడకు చేరుకున్నారు. ఆనవాళ్లు లేకుండా కాలిపోయిన తమ స్థావరాలను చూసి బోరున విలపించారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బాధితులను ఓదార్చారు. బాధితులకు తక్షణమే రూ.లక్షసాయం ఇవ్వాలని, వారందరికీ పక్కా ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రోడ్డునపడ్డ పేదలు వీరే..

గుడిసె వాసులందరూ మేడారం జాతరకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. అయినప్పటికీ గుడిసెలన్నీ కాలి బూడిదవడంతో నిలువ నీడ లేకుండా రోడ్డునపడ్డారు. సర్వం కోల్పోయిన బాధితుల్లో.. బత్తుల రాంబాబు, చల్లా తిరుమలయ్య, చల్లా రమేష్, గుంజ రమేష్, బత్తుల కృష్ణ, కుంచం తిరుమలేష్, వేముల రాములు, వేముల నాగరాజు, వేముల ఎల్లయ్య, అలకుంట నర్సయ్య, చల్లా వెంకటేష్, బత్తుల రాంప్రసాద్, గోగుల యాదయ్య, కుంచపు శివ, వేముల శ్రీను, ఓర్సు శ్రీను, వేముల ఉప్పలయ్య, గుర్రం కుమార్, వెంకన్న, మక్కల్ల శ్రీను, బత్తుల వెంకన్న, ఓర్సు కృష్ణ కుటుంబాలు ఉన్నాయి.

తక్షణసాయం రూ.2లక్షలు ఇవ్వాలి : మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే తక్షణసాయం కింద రూ.2లక్షలు ఇవ్వాలి. అగ్నిప్రమాదానికి గల కారణాలను నిగ్గుతేల్చాలి. వారికి వెంటనే పునరావాసం కల్పించి పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వాలి.

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగానే ఈసీ బృందం గత కొన్ని రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నది. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేసినట్టు సమాచారం.

వీటితోపాటు జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించాలని ఈసీ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో మార్చి 8, 9 తేదీల్లో ఈసీ బృందం భేటీ కానున్నట్టు తెలుస్తున్నది. ఎన్నికల సంసిద్ధతను పరిశీలించేందుకు మార్చి 12, 13 తేదీల్లో జమ్మూకాశ్మీర్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. లోక్‌సభతో పాటే అక్కడ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్టు తెలుస్తోంది. గతంలోలానే ఈసారి కూడా ఏప్రిల్, మే నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేలా ఈసీ ఏర్పాట్లుచేస్తున్నది. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్ ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకూ ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించారు.

ఉచిత రేషన్ బస్తాపై మోడీ చిత్రం !

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ చిత్రంతో గతంలో కోవిడ్ వాక్సిన్ సర్టిఫికెట్లు జారీ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉచిత రేషన్ బస్తాలపై కూడా ఆయన చిత్రాన్ని ముద్రించారు. దేశవ్యాప్తంగా ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యం బస్తాలపై ప్రధాని చిత్రాన్ని ముద్రించారు. ఇందుకోసం ఒక్క రాజస్థాన్‌లోనే రూ.13 కోట్లు ఖర్చు చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోడీ బ్రాండ్ ఇమేజ్‌కి ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తోంది. దీనికి పన్ను చెల్లింపుదారుల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తోంది.

బియ్యం బస్తాలపై మోడీ చిత్రాన్ని ముద్రించినందుకు ఎంత ఖర్చు చేశారో తెలియజేయాలని కోరుతూ హక్కుల కార్యకర్త అజయ్ బోస్ ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేశారు. దీనికి జైపూర్‌లోని ఎఫ్‌సీఐ సమాధానం అందించింది. పీఎం గరీబ్ కల్యాణ్ యోజన కింద ఒక్కో రేషన్ బియ్యం బస్తాపై రూ.12.575 చొప్పున 1,07,45,168 బస్తాలపై మోడీ చిత్రాన్ని ముద్రించడానికి రూ.13,29,71,454 ఖర్చయిందని వివరించింది. బియ్యం బస్తాలపై మోడీ చిత్రాన్ని ముద్రించేందుకు జైపూర్‌లోని ఎఫ్‌సీఐ కార్యాలయం జారీ చేసిన టెండర్ ప్రకటన వివరాలను అజయ్ బోస్ కోరారు.

మోడీ చిత్రాల ముద్రణ కోసం సలసార్ టెక్నోటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాజస్థాన్ ఫ్లెక్సిబుల్ ప్యాకేజింగ్ లిమిటెడ్, అలయన్స్ పాలీసాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు ఆర్డర్ ఇచ్చారు. ఒక్కో సింథటిక్ సంచీ కొనుగోలుకు రాజస్థాన్ రూ.12.3 ఖర్చు చేయగా నాగాలాండ్ రూ.9.3 వెచ్చించింది. రాజస్థాన్ ఫ్లెక్సిబుల్ ప్యాకేజింగ్ లిమిటెడ్ కంపెనీకి నాగాలాండ్ ఆర్డర్ ఇచ్చింది. ఉచిత రేషన్ పంపిణీ కోసం పర్యావరణ హితమైన జనపనార సంచులకు బదులుగా సింథటిక్ సంచులు వినియోగించడం గమనార్హం.

జనపనార సంచులను వినియోగిస్తే జౌళి పరిశ్రమకు ఎంతో ప్రయోజనం చేకూరి ఉండేది. కాగా 1.14 కోట్ల సంచుల కోసం తమిళనాడు టెండర్ పిలిచింది. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ టెండర్‌ను ఖరారు చేయలేదు. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సబ్సిడీ ధర (కిలోకు రూ.29)పై భారత్ బియ్యాన్ని విక్రయించాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. పంపిణీ కూడా ఇప్పటికే ప్రారంభమైంది. అయితే కేరళ వంటి రాష్ట్రాలు దీనిని వ్యతిరేకించాయి. కేరళలో ఇదే నాణ్యతతో కూడిన బియ్యాన్ని కిలో రూ. 24కు విక్రయిస్తున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు పచ్చజెండా..

(మొదటిపేజీ తరువాయి)

రహదారులుగా విస్తరించాల్సిన రాష్ట్ర రహదారుల జాబితాను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి అందజేశారు. ఆయా రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. నితిన్‌గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి ఆయన అధికారిక నివాసంలో కలిశారు. దాదాపు గంటన్నరపాటుసాగిన ఈ భేటీలో సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

తొలుత రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం చౌటుప్పల్-భువనగిరి-తుఫ్రాన్-సంగారెడ్డి-కంది పరిధిలో యుటిలిటీస్ (కరెంటు స్తంభాలు, భవనాల తదితరాలు) తొలగింపునకు సంబంధించి ఖర్చు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చ జరిగింది. యుటిలిటిస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పది నెలల క్రితం భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తెలపకపోవడంతో ఈ విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరించేందుకు సమ్మతిస్తూ ఎన్‌హెచ్ఏఐకు లేఖ పంపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీ వద్ద ప్రస్తావించగా ఆయన ఈ అంశంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆరా తీశారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మెలిక పెట్టినదెవరంటూ అధికారులపై కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరిస్తే భవిష్యత్‌లో టోల్ ఆదాయంలో సగం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని తామే భరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించి భూసేకరణ, విధానపరమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వరకు ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు.

రాజ్యసభకు సోనియా ఎన్నిక

జైపూర్ : రాజస్థాన్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు మంగళవారం ప్రకటించారు. అలాగే ఇదే రాష్ట్రం నుంచి బీజేపీ అభ్యర్థులు చున్నీలాల్ గరసియా, మదన్ రాథోర్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. రాజసభ్య ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ గడవు మంగళవారంతో ముగిసింది. దీంతో ఈ ఫలితాలను అధికారులు వెల్లడించారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యులు మన్మోహన్ సింగ్ (కాంగ్రెస్), భూపేంద్ర యాదవ్ (బీజేపీ) పదవీ కాలం ఏప్రిల్ 3తో ముగియనుంది. అలాగే డిసెంబరు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో కిరోడి లాల్ మీనా (బీజేపీ) తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో రాజస్థాన్‌లో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుత ఫలితాలతో రాజస్థాన్ నుంచి కాంగ్రెస్‌కు ఆరుగురు, బీజేపీకి నలుగురు రాజ్యసభ సభ్యులున్నారు.

రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవం

(మొదటిపేజీ తరువాయి)

కిరణ్ రాథోడ్‌లు నామినేషన్లు వేయగా..అవి నిబంధనల మేరకు లేవని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనంతరం రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి ప్రకటించారు

మాయావీ తనయ్!



- 56 వికెట్లతో హైదరాబాదీ మాయ
- రంజీ ప్లేట్ విజయంలో ముఖ్యపాత్ర

నవతెలంగాణ-హైదరాబాద్

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్. రంజీ ట్రోఫీని ముద్దాడిన మూడో జట్టుగా ఘన కీర్తి కలిగిన హైదరాబాద్.. గత సీజన్లో పేలవ ప్రదర్శనతో అవమానకర రీతిలో ప్లేట్ లీగ్‌కు పడిపోయింది. పసికూన జట్లతో పోరాటం కావటంతో హైదరాబాద్ శిబిరంలో నైరాశ్యం. విజయం దక్కినా..అందుకు తగిన విలువ ఉంటుందా అనే సంశయం. ఈ సీజన్ ఆరంభానికి ముందు హైదరాబాద్ క్రికెట్ జట్టు సమావేశమైనప్పుడు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్లేట్ లీగ్‌లో విజయాలు హైదరాబాద్‌కు ముఖ్యం కాదు. ఎన్ని సెషన్లు, ఎన్ని రోజుల్లో మ్యాచ్ ముగించామనేది కీలకం. నాలుగు రోజుల మ్యాచ్‌ను రెండు రోజుల్లోనే ముగించాలనే స్వీయ సవాల్‌ను డ్రెస్సింగ్‌రూమ్ స్వీకరించింది. ఈ సీజన్లో హైదరాబాద్ గ్రూప్ దశలో ఐదు మ్యాచుల్లోనూ రెండు రోజుల్లోనే విజయాలు సాధించింది. జట్టులో కీలక పాత్ర పోషిస్తూ, ప్రత్యర్థి బ్యాటర్లను మాయ చేసిన స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ హైదరాబాద్‌ను గెలుపు పథాన నడిపించాడు. 8 ఇన్నింగ్స్‌ల్లో 14.98 సగటుతో ఏకంగా 56 వికెట్లు పడగొట్టాడు. అందులో ఏకంగా ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. హైదరాబాద్ బ్యాటింగ్‌కు తన్మయ్ అగర్వాల్, తిలక్ వర్మ రాహుల్ సింగ్, రోహిత్ రాయుడులు నాయకత్వం వహించగా.. ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా వికెట్ల వేట సాగించిన తనయ్ త్యాగరాజన్ స్పిన్ దళానికి, వికెట్ల జాతరకు సారథిగా నిలిచాడు. టైటిల్ పోరులో రెండు ఇన్నింగ్స్‌ల్లో ఐదేసి వికెట్లతో జట్టు విజయంలో కీలక భూమిక వహించాడు. సహచర బౌలర్లు పరుగులు ధారాళంగా ఇచ్చినా.. తనయ్ త్యాగరాజన్ గొప్పగా కట్టడి చేశాడు. జట్టుకు వికెట్ అవసరమైన ప్రతిసారి కెప్టెన్ బంతిని తనయ్ త్యాగరాజన్‌కు అందించాడు. కండ్లుచెదిరే రీతిలో 56 వికెట్లు పడగొట్టిన తనయ్ త్యాగరాజన్ హైదరాబాద్ మాయావీగా నిలిచాడు!.

> రంజీ ప్లేట్‌లో ఆడటం నిరాశకు లోను చేసింది. కానీ ఓ సవాల్‌గా తీసుకుని బరిలోకి దిగాం. మా తదుపరి లక్ష్యం రంజీ ట్రోఫీ ఎలైట్ టైటిలే. ఈ సీజన్లో బౌలింగ్‌ను ఆస్వాదించాను. సొంతగడ్డ అనుకూలత సైతం కలిసొచ్చింది. ఈ సీజన్ ఐపీఎల్‌కు సన్నద్ధం అవుతాను. త్వరలోనే పంజాబ్ కింగ్స్ శిబిరంలో చేరబోతున్నాను. అక్కడి కోచింగ్ సిబ్బందితో కలిసి టీ20ల్లో బ్యాటర్లకు కట్టడి చేసేందుకు అవసరమైన టెక్నిక్, వేరియేషన్‌పై దృష్టి సారిస్తాను.
>
> - తనయ్ త్యాగరాజన్

హైదరాబాద్ క్రికెట్‌కు కాస్త ఊరట!. గత సీజన్లో ఎలైట్ నుంచి ప్లేట్‌కు దిగజారిన హైదరాబాద్.. ఈ ఏడాది రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ చాంపియన్‌గా అవతరించింది. గ్రూప్ దశ నుంచి నాకౌట్ వరకు ఎదురులేని విజయాలు సాధించిన హైదరాబాద్ అప్రతిహాత విజయ యాత్రతో మళ్లీ రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లోకి అడుగుపెట్టింది. ఉప్పల్ స్టేడియంలో మేఘాలయతో జరిగిన ఫైనల్లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు రూ.10 లక్షల నగదు బహుమతి ప్రకటించాడు.

చాంపియన్ హైదరాబాద్

- రంజీ ట్రోఫీ ప్లేట్ టైటిల్ సొంతం
- ఫైనల్లో మేఘాలయపై 5 వికెట్లతో గెలుపు



నవతెలంగాణ-హైదరాబాద్

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ చాంపియన్‌గా హైదరాబాద్ నిలిచింది. నాలుగు రోజులుగా ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో మేఘాలయపై 5 వికెట్ల తేడాతో గెలుపొందిన హైదరాబాద్..అజేయ రికార్డుతో ఎలైట్ గ్రూప్‌లోకి ప్రవేశించింది. 198 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 34.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ తిలక్ వర్మ (64, 50 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), వైస్ కెప్టెన్ రాహుల్ సింగ్ (62, 40 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో మెరువగా.. రోహిత్ రాయుడు (34, 61 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), తనయ్ త్యాగరాజన్ (26, 41 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. రోహిత్ రాయుడు, తిలక్ వర్మ గెలుపు ముంగిట నిష్క్రమించినా.. నితీశ్ రెడ్డి (3 నాటౌట్), చందన్ సహాని (8 నాటౌట్) లాంఛనం ముగించారు. మేఘాలయ బౌలర్లలో సంగ్మా (3/47) మూడు వికెట్ల ప్రదర్శనతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 304 పరుగులు చేయగా.. రాజ్ బిశ్వ (64), ఆకాశ్ చౌదరి (50), సచ్‌దేవ్ సింగ్ (46) ఆకట్టుకున్నారు. నితీశ్ రెడ్డి (122), ప్రజ్ఞయ్ రెడ్డి (102) శతకాలతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 350 పరుగులు చేసింది. రాజ్ బిశ్వ (100), సచ్‌దేవ్ సింగ్ (81) వీరోచిత ఇన్నింగ్స్‌లతో మేఘాలయ రెండో ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేసింది. హైదరాబాద్‌కు 198 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ రెండు ఇన్నింగ్స్‌ల్లో ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 5/103, రెండో ఇన్నింగ్స్‌లో 5/86తో మాయజాలం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో హైదరాబాద్‌కు విలువైన ఆధిక్యం అందించిన నితీశ్ రెడ్డి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ప్లేట్ లీగ్‌లో అజేయ రికార్డుతో చాంపియన్‌గా అవతరించిన హైదరాబాద్.. రంజీ ప్లేట్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ సీజన్‌లో హైదరాబాద్ తరఫున తనయ్ త్యాగరాజన్, తన్మయ్ అగర్వాల్ అద్భుత ప్రదర్శన చేశారు. తనయ్ త్యాగరాజన్ 14 ఇన్నింగ్స్‌ల్లో 14.98 సగటుతో 56 వికెట్లు పడగొట్టాడు. అందులో ఏకంగా ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ రికార్డు ట్రిపుల్ సెంచరీ సహా 8 ఇన్నింగ్స్‌ల్లో 95.62 సగటుతో 765 పరుగులు సాధించాడు. తనయ్ త్యాగరాజన్ అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలువగా.. తన్మయ్ అగర్వాల్ బ్యాటర్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.

స్కోరు వివరాలు :

మేఘాలయ తొలి ఇన్నింగ్స్ : 304/10

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ : 350/10

మేఘాలయ రెండో ఇన్నింగ్స్ : 243/10

హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్ : తన్మయ్ (సి) సంగ్మా 0, రాహుల్ సింగ్ (సి) ఆకాశ్ (బి) సంగ్మా 62, తనయ్ త్యాగరాజన్ (సి) ఏరియన్ (బి) సంగ్మా 26, తిలక్ వర్మ (సి) కిషన్ (బి) బిశ్వ 64, రోహిత్ రాయుడు (సి) సచ్‌దేవ్ (బి) బోర 34, నితీశ్ రెడ్డి నాటౌట్ 3, చందన్ సహాని నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (34.2 ఓవర్లలో 5 వికెట్లకు) 203. వికెట్ల పతనం :** 1-0, 2-88, 3-109, 4-191, 5-193. **బౌలింగ్ :** సంగ్మా 7-0-47-3, ఆకాశ్ 9-0-52-0, దీపు 5-0-16-0, బోర 2.2-0-13-0, స్వరజిత్ 1-0-4-0, రాజ్ బిశ్వ 7-0-49-1, సచ్‌దేవ్ 3-0-16-0.



10 లక్షల నజరానా

- రంజీ ఎలైట్ నెగ్గితే రూ. 1 కోటి బహుమానం
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు రంజీ జట్టుపై కాసుల వర్షం కురిపించాడు. రంజీ ట్రోఫీ ప్లేట్ విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు రూ.10 లక్షలు నజరానా సహా టోర్నీలో ఉత్తమ వ్యక్తిగత ప్రదర్శన చేసిన క్రికెటర్లకు రూ.50 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించాడు. రంజీ ట్రోఫీ ప్లేట్ ఫైనల్ బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగన్‌మోహన్ రావు.. హైదరాబాద్ క్రికెటర్లలో సరికొత్త ఉత్తేజం నింపాడు. 'హైదరాబాద్ మళ్లీ రంజీ ఎలైట్‌కు చేరటం సంతోషం. ప్లేట్ లీగ్ విజేతలుగా నిలిచిన జట్టుకు అభినందనలు. రానున్న మూడేండ్లలో ఎలైట్ ట్రోఫీ నెగ్గితే జట్టుకు రూ.1 కోటి బహుమానంతో పాటు ప్రతి ఒక్క ఆటగాడికి బీఎండబ్ల్యూ కారు బహుమతిగా అందజేస్తామని' ప్రకటించాడు. 'ఈ సీజన్‌లో హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేషన్ నుంచి గొప్ప మద్దతు లభించింది. అన్ని విధాలుగా జట్టుకు సహకారం అందించారు. ఆటగాళ్లుగా మాది ఒకటే లక్ష్యం. రంజీ ట్రోఫీ ఎలైట్ విజేతలుగా నిలువటం. భారీ నగదు బహుమతి ప్రకటన క్రికెటర్లలో సరికొత్త ఉత్సాహం తీసుకొస్తుంది. ప్లేట్ చాంపియన్స్‌గా నిలువటం పట్ల సంతోషంగా ఉంది' అని హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు.

మార్చి 22 నుంచి ఐపీఎల్ 2024

ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్



న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 సీజన్ మార్చి 22 నుంచి ఆరంభం కానుంది. ఈ మేరకు ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ తెలిపాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌ను తొలి 15 మ్యాచులకు మాత్రమే విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ అనంతరం ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు.'ఐపీఎల్ 17 పూర్తిగా భారత్‌లోనే జరుగుతుంది. ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నాం. మార్చి 22న తొలి మ్యాచ్‌కు ప్రణాళిక సిద్ధం చేశామని' అరుణ్ ధుమాల్ తెలిపారు. మే 26న ఐపీఎల్ 17 టైటిల్ పోరు షెడ్యూల్ చేసే అవకాశం కనిపిస్తుంది.

రిషబ్ పంత్ సిద్ధం!

ప్రాక్టీస్ మ్యాచ్‌లో జోరు

ఆలూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న యువ క్రికెటర్ రిషబ్ పంత్ ఐపీఎల్ 17కు సిద్ధమవుతున్నాడు. కొంతకాలంగా బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్‌లో ఉన్న రిషబ్ పంత్ నెట్స్‌లో కఠోరంగా శ్రమిస్తున్నాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్న రిషబ్ పంత్ మ్యాచ్ ఫిట్‌నెస్ దిశగా మరో అడుగు ముందుకేశాడు. ఆలూర్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీఏ ప్రాక్టీస్ మ్యాచ్‌లో రిషబ్ పంత్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ప్రమాదానికి ముందు పంత్ తరహాలో స్వేచ్ఛగా పరుగుల వేట సాగించినట్టు ఎన్‌సీఏ వర్గాల సమాచారం. వికెట్ కీపింగ్‌కు దూరంగా ఉన్న రిషబ్ పంత్ మరికొద్ది రోజుల్లోనే గ్లోవ్స్‌తోనూ సాధన చేయనున్నట్టు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిషబ్ పంత్ అప్పట్నుంచి ఆటకు పూర్తిగా దూరమైన సంగతి తెలిసిందే.



నవచిత్రం

చారి.. సాహసాల యాత్ర షురూ



వెన్నెల కిశోర్, సంయుక్తా విశ్వనాథన్

'చక చక మొదలిక... సాహసాల యాత్ర ఆగదిక... ఇది ఆపరేషన్ రుద్రనేత్ర' అని 'చారి 111' టీమ్ అంటోంది. స్టైలిష్‌గా పిక్చరైజ్ చేసిన థీమ్ సాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పుడు యూట్యూబ్‌లో ఈ సాంగ్ వైరల్ అవుతోంది. 'వెన్నెల' కిశోర్ కథానాయకుడిగా నటించిన సినిమా 'చారి 111'. టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహించారు. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మిస్తున్నారు. మురళీ శర్మ ప్రధాన పాత్రధారి. మార్చి 1న థియేటర్లలో విడుదల కానుంది.

తాజాగా 'చారి 111' థీమ్ సాంగ్ విడుదల చేశారు. ఈ పాటను సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి రాయగా, 'జవాన్' ఫేమ్ సంజీత భట్టాచార్య ఆలపించారు. సైమన్ కె కింగ్ మంచి స్టైలిష్ ట్యూన్ అందించారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'మా సినిమాలో ఒక్కటే సాంగ్ ఉంది. స్టార్టింగ్ టైటిల్స్‌లో వస్తుంది. ఈ పాటను నేపథ్య సంగీతంలో ఉపయోగించాం. ఆల్రెడీ విడుదలైన ట్రైలర్ ఫెంటాస్టిక్ రెస్పాన్స్ అందుకుంది. వెన్నెల కిశోర్‌ని ఇంతకు ముందెప్పుడూ ఇలా చూడలేదని ప్రేక్షకులు చెబుతున్నారు. ఆయన లుక్స్, స్టైలిష్ స్పైగా చేసిన కామెడీ సూపరని చెబుతున్నారు. సినిమా కూడా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా 'చారి 111' థీమ్ సాంగ్ విడుదలైంది.

ముఖ్య గమనిక.. రిలీజ్‌కి రెడీ



విశ్వక్‌సేన్, విరాన్ ముత్తంశెట్టి

విరాన్ ముత్తంశెట్టి హీరోగా, లావణ్య హీరోయిన్‌గా శివిన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజశేఖర్, సాయి కృష్ణ నిర్మాతలుగా కొత్త దర్శకుడు వేణు మురళీధర్.వి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'ముఖ్య గమనిక'.

హీరో విశ్వక్ సేన్ ముఖ్యఅతిథిగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సినిమాని ఈనెల 23న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.

ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'విరాన్ నేను జిమ్ ఫ్రెండ్స్. విరాన్‌కి ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'కిరణ్ అందించిన మ్యూజిక్ చాలా బాగా వచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్స్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. మంచి సినిమాతో మీముందుకు వస్తున్నాను' అని డైరెక్టర్ వేణు మురళీధర్ అన్నారు. హీరో విరాన్ ముత్తంశెట్టి మాట్లాడుతూ, 'బ్యాగ్రౌండ్, మ్యూజిక్, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ అన్ని చాలా బాగుంటాయి. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. ఈ

మెప్పించే యూనిక్ కాన్సెప్ట్



బిగ్ బాస్ ఫేమ్ అర్జున్ కళ్యాణ్, కుషితకల్లపు హీరో, హీరోయిన్స్‌గా లక్ష్మణ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాబు నెం1 బుల్ షిట్ గయ్..'. డీడీ క్రియేషన్స్ బ్యానర్ పై దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో బేబీ నిర్మాత ఎస్కేఎన్, దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత వివేక్ కూచిభొట్ల ముఖ్య అతిథులుగా హాజరైన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక గ్రాండ్‌గా జరిగింది.

హీరో అర్జున్ కళ్యాణ్ మాట్లాడుతూ,'ఈ ప్రాజెక్ట్ నన్ను నెక్స్ లెవల్‌కి తీసుకెళుతుందని కోరుకుంటున్నాను. మూడు భాషల్లో ఈ సినిమా చేశాం. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా చేశారు. యూనిక్ కాన్సెప్ట్‌తో థ్రిల్లర్, డ్రామా ఉన్న కథ ఇది' అని తెలిపారు. 'ప్రతి ఒక్కరూ ఫ్యామిలీతో కూర్చుని చూడదగ్గ మూవీ ఇది. తప్పకుండా థియేటర్స్‌కి వెళ్లి సినిమా చూడాలి' అని హీరోయిన్ కుషితకల్లపు అన్నారు.

దర్శకుడు లక్ష్మణ వర్మ మాట్లాడుతూ,'భిన్న కాన్సెప్ట్‌తో చేసిన ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుందే నమ్మకంతో ఉన్నాం' అని చెప్పారు. లక్ష్మణ్ వర్మ, సోనాలి పానిగ్రాహి, మురళీధర్ గౌడ్, భద్రం, రవి వర్మ, జబర్దస్త్ అప్పారావు, బద్రి, సునీత మనోహర్, బేబీ ఆరాధ్య తదితరులు నటిస్తున్నారు.

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే సినిమా



వరుణ్ తేజ్ నటించిన ఏరియల్ వార్ డ్రామా 'ఆపరేషన్ వాలెంటైన్'. తాజాగా హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్ర ట్రైలర్‌ను సల్మాన్‌ఖాన్, రామ్‌చరణ్ లాంచ్ చేశారు.

ఐఏఎఫ్ అధికారి అయిన అర్జున్ దేవ్ (వరుణ్ తేజ్)కి గతంలో జరిగిన ఒక సంఘటన కారణంగా పీడకలలు వస్తుంటాయి. కానీ అది అతని వైఖరి, విధానాన్ని మార్చలేదు. అతను మొండి పట్టుదలగలవాడు. రాడార్ ఆఫీసర్ సోనాల్ (మానుషి చిల్లర్)తో ప్రేమలో ఉన్న అడ్వంచర్ లవర్. మరోవైపు పుల్వామా దాడిలో 42 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణిస్తారు. ఇంతకుముందు ఓటమిని ఎదుర్కోని భారత వైమానిక దళం శత్రువులపై వైమానిక దాడిని ప్రకటిస్తుంది. టీంకు నాయకత్వం వహిస్తున్న అర్జున్ తన యుద్ధ విమానానికి గ్రెనేడ్ తగలడంతో ప్రమాదంలో పడతాడు. అయితే, అతనికి మార్గనిర్దేశం చేసేందుకు రాడార్ ఆఫీసర్ సోనాల్ వుంటుంది. వరుణ్ తేజ్ అడ్వంచరస్ స్క్వాడ్రన్ లీడర్‌గా అద్భుతంగా ఆకట్టుకున్నాడు. యాక్షన్, ఎమోషనల్ సీన్స్ రెండింటిలోనూ అదరగొట్టారు. యూనిఫాంలో వరుణుడిని చూడటం కన్నుల పండువగా వుంది. మానుషితో కెమిస్ట్రీ బాగా కుదిరింది.

> తెలుగులో మొట్టమొదటి ఏరియల్ ఫిల్మ్ అవ్వబోతుంది. చాలా కొత్తగా, ఎడ్జ్ అఫ్ ది సీట్ కూర్చుని గూస్ బంప్స్ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేసే చాలా సీన్స్ ఇందులో ఉన్నాయి. మార్చి 1న ఈ సినిమాని చాలా గర్వంగా, గుండెలు నిండా దేశభక్తితో చూసి మన జవాన్స్‌కి సెల్యూట్ కొడతారు ప్రేక్షకులు. మన జవాన్ల త్యాగాలని గుర్తు చేసుకుంటూ, వారి ధైర్య సాహసాలని మీముందుకు తీసుకురావడాని చేస్తున్న ప్రయత్నం ఈ సినిమా. అందరికీ దేశభక్తి మనసులో ఉంటుంది. ఈ సినిమా చూశాక అది మరింత పెరుగుతుందని నమ్మకంగా చెబుతున్నాం.
>
> - వరుణ్ తేజ్

హీరోయిన్ మానుషి చిల్లర్ మాట్లాడుతూ, 'ఇది చాలా స్పెషల్ మూవీ. దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ అద్భుతంగా ఈ సినిమాని తీశారు' అని తెలిపారు. 'ఈ సినిమాలో చాలా కీలకమైన పాత్ర చేశాను. తెలుగులో మొట్టమొదటి ఎయిర్ ఫోర్స్ యాక్షన్ సినిమా చేసిన ఘనత వరుణ్ తేజ్‌కి దక్కుతుంది. ఈ ట్రైలర్‌లో విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నాయి' అని నవదీప్ చెప్పారు. దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ,'వరుణ్ తేజ్‌కి, నిర్మాతలకు కృతజ్ఞతలు. వారి వలనే ఈ సినిమా సాధ్యపడింది. ఈ సినిమా సమిష్టి కృషి. సినిమా కోసం ప్రాణం పెట్టి పని చేశాం. యాక్షన్ డ్రామా ఫన్ ఎమోషన్ అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి' అని అన్నారు.

ఆ వాస్తవం ఏంటి?



మేఘ శ్యాం, రేఖ నిరోష

మేఘశ్యాం, రేఖ నిరోష హీరో, హీరోయిన్లుగా అంజనిసూట్ ఫిలిమ్స్ సంస్థ పై ఆదిత్య ముద్గల్ నిర్మాతగా జీవన్ బండి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'వాస్తవం'. తాజాగా చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఆదిత్య ముద్గల్ మాట్లాడుతూ, 'డైరెక్టర్ జీవన్ చెప్పిన కథ, తీసిన విధానం చాలా బాగుంది. పి. ఆర్ అందించిన మ్యూజిక్‌కి చాలా మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'ఈ సినిమాలో చేసిన ప్రతి చిన్న క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. నా టెక్నీషియన్స్, ఆర్టిస్టులు నాకు చాలా బాగా సపోర్ట్ చేశారు. పి.ఆర్ అందించిన మ్యూజిక్ చాలా బాగా వచ్చింది. హీరో మేఘశ్యాం, హీరోయిన్ రేఖ నిరోషా చాలా బాగా నటించారు'అని దర్శకుడు జీవన్ బండి చెప్పారు.

హీరోయిన్ రేఖ నిరోషా మాట్లాడుతూ, 'మా సినిమాలో చాలా మంచి కంటెంట్ ఉంది. అందరికీ నచ్చే కథ అవుతుంది' అని అన్నారు. హీరో మేఘశ్యాం మాట్లాడుతూ, 'ఎక్కడ కథ నుంచి డివియేట్ అవ్వకుండా చాలా బాగా కథని తీసుకుని వచ్చారు. మా సినిమా అందర్నీ అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.

అందరికీ సంతృప్తినిచ్చే సుందరం మాస్టర్



సిద్ధు జొన్నలగడ్డ, హర్ష

ఆర్ టీ టీం వర్క్స్, గోల్ డెన్ మీడియా పతాకాలపై రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. ఈ చిత్రంలో హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 23న విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరో సిద్దు జొన్నలగడ్డ ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ ఈవెంట్‌లో ఆయన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు.

'చిరంజీవి ఇచ్చిన సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోలేం. నాగ చైతన్య పాటను, సాయి ధరమ్ తేజ్ టీజర్‌ను లాంచ్ చేశారు. పదేళ్ల క్రితం ఆడియెన్స్ మధ్యలో ఉన్నాను. ఇప్పుడు ఈ స్టేజ్ మీద ఉన్నాను. మనం గట్టిగా నమ్మితే ఏదైనా సాధించగలం' అని హర్ష చెముడు చెప్పారు.

సుధీర్ కుమార్ మాట్లాడుతూ,'మా కథను నమ్మి రవితేజ ముందుకు వచ్చారు. అప్పుడు మా మీద మాకు నమ్మకం ఏర్పడింది. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

'మా సినిమా పోస్టర్లు, టీజర్,ట్రైలర్‌లు అందరికీ నచ్చాయి. ఈ సినిమాలోని ఇన్నోసెన్స్ వల్లే అందరికీ నచ్చింది. రవితేజ మాకు అందించిన సపోర్ట్‌ను ఎప్పటికీ మరిచిపోలేం. ప్రకృతి అందరికీ ఒకేలా కనిపించదు. రైతుకు వర్షం అన్నం పెడితే.. రోడ్డు పక్కన బిజినెస్ చేసేవాళ్లకు ఫుడ్ లాక్కుంటుంది. అలా ఈ సినిమాను ఎన్నో కోణాల్లో చూపించాం. ఎంత పెద్ద హిట్ అవుతుందో తెలియదు కానీ.. మా అందరికీ గౌరవాన్ని తీసుకొస్తుంది. సినిమాను చూసిన వారందరికీ ఓ సంతృప్తిని మాత్రం ఇస్తుంది' అని డైరెక్టర్ కళ్యాణ్ సంతోష్ చెప్పారు.

ఛాలెంజింగ్ పాత్ర చేశా



దీపక్ సరోజ్

పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్'తో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ అండ్ విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా నిర్మించారు. ఈనెల 23న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో హీరో దీపక్ సరోజ్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో పోషించిన సిద్ధార్థ్ రాయ్ పాత్ర చాలా లాజికల్‌గా, ఎక్స్ట్రీమిజంలో ఉంటుంది. తను చాలా నాన్ రియాక్టివ్‌గా ఉంటాడు. మొదట్లో ఎంత కంట్రోల్‌గా ఉంటాడో తర్వాత అంత అన్ కంట్రోల్ అయిపోతాడు. ఇది ప్లెయిన్ క్యారెక్టర్ కాదు. ఈ సినిమాకి 'సిద్ధార్థ్ రాయ్' పేరుపెట్టడానికి బలమైన కారణం వుంది. ఇందులో సిద్ధార్థ్ అనేది రివర్స్ థీసెస్ అఫ్ గౌతమ బుద్ధ. దర్శకుడు యశస్వీ చాలా అద్భుతంగా స్క్రిప్ట్ చేశారు. నాపాత్రను అందరూ అంగీకరిస్తారు' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886